# ది యునైటెడ్ ఇండియా లైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : మదరాసు. 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పండ్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ, క్లైములు సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి, మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.

## గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా ?

## నిజముగ జరిగిన సంగతి

వైద్యపరీక్ష లేదు. స్త్రీపురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్థాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు.

## ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి : 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4. ట్యూటికొరిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్టుస్.

'ఆంధ్రభూమి' ప్రకటనలు

# విషయసూచిక


౧. మేఘుడా ... ౨౩౩
—తురగా వేంకటరామయ్య
౨. పడమటిసీమ కవులకతలు ... ౨౩౪
—మున్నంగి శర్మ
౩. నిజాని కొరిదీపావం ... ౨౩౮
—హరి రాధాకృష్ణమూర్తి
౪. కథ వ్రాయడం ... ౨౪౩
—వేంకటశాస్త్రి
౫. పిస్తోలు ... ౨౪౫
—వాకాటి రాధాకృష్ణశ్రేష్ఠి
౬. శాంతి సమరసన్నాహము ... ౨౫౨
—వేమూరి శ్రీనివాసరావు బి. ఏ., బి. ఎల్.
౭. కన్నీళ్ళు ... ౨౫౨
—కస్తూరి రాజామాణిక్యము
౮. జన్మ నిరోధము ... ౨౫౩
—జె. శ్రీరామమూర్తి బి. ఏ. యల్. టి.
౯. కవిత ... ౨౫౫
—అలమూరు రాజగోపాలరావు, ఎం. ఏ.
౧౦. అర్థశాస్త్రము : వాంఛలు ... ౨౫౬
—అరవిల్లి నరసింహాచార్యులు, బి. ఏ.
౧౧. కోకిల ... ౨౫౮
—పోతాప్రగడ శ్రీరామారావు బి.ఏ.,బి.ఎల్.
౧౨. రషియాదేశపు స్త్రీలు ... ౨౫౯
—జరుగుమిల్లి సాంబశివరావు, బి. ఏ.
౧౩. కళ : శాస్త్రము ... ౨౬౦
—దేవగుప్తాపు విశ్వేశ్వరరావు
౧౪. సత్యాన్వేషణ ... ౨౬౧
—తాత కృష్ణమూర్తి, బి. ఏ, యల్. టి.
౧౫. శిక్ష ... ౨౬౬
—మల్లాది అవధాని
౧౬. తీర్థసేవ ... ౨౬౭
—కాశీఖండము
౧౭. తుంబాచార్యులుగారి హారపత్రిక ... ౨౬౮
—కొత్తపల్లి సూర్యారావు
౧౮. చింతాజ్వరము ... ౨౭౨
—శ్రీనాథ మహాకవి
౧౯. వాయసము ... ౨౭౨
—వేంకటనాథుడు
౨౦. సర్ జోసెఫ్ లాయినస్ ... ౨౭౩
౨౧. ఆరోగ్యవిజ్ఞానము ... ౨౭౯
౨౨. జీవిత కల్లోలము ... ౨౮౧
—ఓలేటి సీతారామమూర్తి, బి. ఏ.
౨౩. తేనె పరిశ్రమ ... ౨౮౨
—జాగు గోపాలరావు
౨౪. పునర్జన్మ ... ౨౮౭
—తల్లాప్రగడ ప్రకాశరాయడు ఎం. ఏ.
౨౫. యేప్రిల్ ఒకటవతేదీ ... ౨౮౯
—కాటూరి వెంకటరామారావు
౨౬. భగ్నవీణ ... ౨౯౫
—పెమ్మరాజు రాజగోపాలము, బి. ఏ.
౨౭. జిజ్ఞాస : మీమాంస ... ౨౯౬
౨౮. జాతకస్కంధచరిత్ర-దానిప్రాచీనత ... ౨౯౮
—చాగంటి అన్నపూర్ణశాస్త్రి
౨౯. మణిమాల ... ౨౯౯
౩౦. సంపాదకీయ సమాలోచన ... ౩౦౧
౩౧. ఇన్సూరెన్సు విషయములు ... ౩౦౩
—జమిలి నమ్మాళ్వారు



## నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములు లేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు, ఆవిషయమును ప్రత్యేకముగ మాకార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొనవచ్చును.

— ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత శాలేరు పెంటయ్యగారు, 4121. మూసాఖాన్‌వీధి, శికిందరాబాదు.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

## ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :— మ-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషన్ ఇయ్యబడును

### ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు, 2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును, 3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు, 4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి, 5. పట్టాదారులకు ఋణము లియ్యబడును, 6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు ఇయ్యబడును, 7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును, 8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జనన భీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

## ఆంధ్రప్రావిడెంటు కంపెనీ, గాంధినగర్, బెజవాడ.

## ఇంద్రజాల మహేంద్రజాలము

ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము, ఆంగ్లఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్లపేక తమాషాలు, వినోదవిద్యలు మనుష్యుని మాయము చేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధి యగుట, శరీరము లేని తలచేత మాట్లాడించుట, గాలిలో మనుష్యుని నిలుపుట, మొదలగు విచిత్రము లున్నవి. దీనిచే మేజిక్ చేయగలరు. వెల రు 4.

చమత్కార గణితము:—(అపూర్వము) ఇందులో విచిత్ర వినోదమనోగణితములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తి తమాషాలెక్కలు, గణితావధానము గలవు. దీనిని చదివిన తెలివికలుగును. వెల రు. 1.

వలయువారు :— సి. ఆర్. జనార్దనంనాయుడు, ఒంగోలు, (గుంటూరుజిల్లా) అని వ్రాయుడు.

## కామశాస్త్రము

ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాతలుకావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాబట్టి దీనిగొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతమగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 8 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మిత వ్యయము, నిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేకసౌకర్యములు గలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసుపంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లుకావలెను.

వివరములకు:—

య. మంగయ్య, బి.ఏ, బి.ఎల్.,

కార్యదర్శి.

"ఆంధ్రభూమి"



శ్రీయుత

మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మగారు, బి. ఏ.



రితలరాయ్

# మేఘుడా

౧

ఓగాలి యుయ్యాల
    లూగేటి మేఘుడా!
లోకమంటేనె: వే
    ళాకోళమయ్యె నా?
ఆధార మేలేని
    ఆకాశ సౌధాల
    కాపురా లెన్నాళ్ళు
    కలుఁగు లెన్నాళ్లో

౨

నీదయా వృష్టిచే
    భూదేవి పండునా?
నీవేనాకో విశ్వ
    జీవనదాతవూ?
మతిలేని మూఢ పం
డిత సంస్తుతుల కేమి?
    కలడురా! విశ్వజీ
    వనదాత మాత్రమోల
కలిమి లేములు రెండు
    కండ్లుగాగలవాడు.

౩

దరిగాన లేని మా
    నిరుపేదలోకాల
కన్నీటికణము లే
    కలిపిసంద్రము చేసి
ఇంకించి ఇంకించి
    ఈనాటికీలాటి
మాయమూపిచ్చి ని
న్నరులుకొలిపే మహా
    లీలా స్వభావుండు
    లేడటోయీ? అదే
        తెరచాటునందు నీ
కండ్లకై పునకు చ
    క్కని యంజనము వేయు
        తరివేచి చూడరా?
        తలయెత్తి మేఘుడా?

౪

చల్లగా మెల్లిగా
    చలిగాలి డోలికల
        నుల్లాసమెక్కటి
        యూపులూపించి, నీ
బ్రతుకెల్ల కరగించి
    పంచేవు, మాపేద
    లోకాలకే; వాడు.
    లోకేశ్వరుడువాడు?
        మేఘుడా? ఘనుడనని
        మిట్టిపడనేలరా?

—తురగా వేంకటరామయ్య.

## ౬

## అన్నావఝ్ఝల
# శేషయసూరి

ఈయన వెలనాటివైదికుడు తాతలనాటినుండి తన వఱకు వాసము నొసము (కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తా). తల్లి సీతమ్మ; తండ్రి తిమ్మాభట్లు. శాండిల్య గోత్రము. అన్నదమ్ములు మువ్వురు: అందు ఈ శేషయ సూరి నడిమివాఁడు. ఈతనితల్లి పుట్టినింటివారు 'సుష్టు' వారు. మాతామహుఁడు సుబ్బాశాస్త్రి; మాతామహి నందమ్మ. ఇరువురు మేనమామలు. అందు చినమేన మామ శేషయశాస్త్రి ఈ సూరికి విద్యాగురుఁడు. సుష్టువారు హరితసగోత్రులు. ఈ కుటుంబమూలపురు షుఁడు సురపురము దొరలచే సత్కృతుఁడై మాన్య ములు సంపాదించినవాఁడు. రాఘవశాస్త్రియను మఱి యొక పండితుఁడును ఈ సూరికి విద్యాదాన మొనర్చిన గురువఁట!

ఈ శేషయసూరి అఱువదియేండ్లు నిండకమునుపే ఐహికముఁ జాలించెనని, షుమారు 35 ఏండ్ల క్రితము వఱకు సజీవిగా నుండెనని తెలియుచున్నది. ఇతని రచిం చినగ్రంథము ఒక్కటే కనఁబడుచున్నది. ఇది 'మహా నంది మాహాత్మ్యము;' మూఁడాశ్వాసముల తెలుఁగు ప్రబంధము; వ్యాసభట్టారక ప్రణీతస్కాందపురాణాం తర్గత శ్రీశైలఖండమందలి సనత్కుమారసంహితలో నిది. ఈ మహానంది మహాత్మ్యముమాతృక. 'భాగవత' పురాణమందలి ద్వాదశస్కంధము, 'పంచీకరణము' మున్నగాఁ బెక్కులు సంస్కృతగ్రంథములఁ దెనుఁగిం చిన కథావశేషుఁడు మాధ్వబ్రాహ్మణుఁడు కోపూరు పట్టాభిరామశర్మ (నెల్లూరు మాండలికుఁడు) ఈ మహా నంది మహాత్మ్యమునకు పరిష్కర్తయగుట, ఈకర్త తన కృతజ్ఞతను అవతారికయందుఁ దెలిపికొనినాఁడు. ఉక్తగ్రంథము మన్మథనామ సం. జ్యేష్ఠ బ 10 సోమ వారమున సరియయిన 1895 జూన్ 17-వ తేది కడప కల్యాణకుమారవిలాస ముద్రణాలయమున నచ్చొత్తింప బడినది. కడపనగరమున ఆ దినములలో ప్రముఖులుగ నుండిన యాజ్ఞమూర్తి వేంకటాచార్యులు, కొమరగిరి శేషయ్యగార్లు ఈ గ్రంథకర్త నాదరించిరఁట!

ఈతనికి సంస్కృతాంధ్రములయందు పెద్దప్రవేశ మున్నది. ధారాశుద్ధియు శబ్దసిద్ధియుఁ బొందుపడినవి. శాస్త్రపరిచయముగూడ నలవడినట్లున్నది. పూర్వ గ్రంథరచయితల అడుగుజాడలలో నడచినాఁడు. పూర్వ రచయితల పోకడలను పోతలను పూతలను దల పించు పద్దెము లెన్నేని ఈయన గ్రంథమునఁ గలవు. మొత్తముమీఁద చదివికొన్నవాఁడు; శైలి లలితమయి నది భావముల నేకవుగొన్నను, పాకము ననుకరించినను జిగియయిన యల్లికయు జతన మగపడుచున్నది.

ఏతత్కవికృత మహానందిమాహాత్మ్యమునుండి మచ్చులు కొన్ని:

తన జన్మగ్రామమునెడఁ జూపిన యభిమానము:

"వేదశాస్త్రపురాణ వేదాంతకావ్యాది
గాఢవిద్యలకు బొక్కసము నొసము;
కుత్సితకుహూక కుటిలదురాచార
కఠినచిత్తులకు వెక్కసము నొసము;
యాయజూక హితాజ్యయ జనసంతర్పిత
కామారి ముఖదివౌకసము నొసము;
వాసుదేవశివానువాదు లుండుటఁ జేసి
కాలుగుండెకుఁ గరకసము నొసము;

అర్థిపాత్కృతపక్వపాయసము నొసము;
హర్మ్యచుంబితసద్విహాయసము నొసము;
వేంకటేశ్వరకంజాతబిసము నొసము;
భవ్యశాస్త్రార్థపటలీరభసము నొసము.

—(ప్రథమాశ్వాసము)

ధారకు—

"ఎద్దానిశీర్షం బహీనసమున్నతిఁ
వేంకటాచల మన వెలయుచుండు:
ఎద్దానిపుచ్ఛంబు హృద్యప్రకృతిశోభ
శ్రీశైలసంజ్ఞ భాసిల్లుచుండు:
వేదాచలంబన వెస గరుడాద్రినా
నెద్దాని మధ్యమై యెసఁగుచుండు:
దేవతాక్షేత్రముల్ దివ్యతీర్థంబులు
నెద్దానిగర్భమం దెసఁసియుండు:
ఎద్ది సర్వౌషధీగణావృతము యగుట
సకలసత్వనివాసాతిసౌఖ్య మగుచు
రత్నఫలపుష్పమూలాదిరమ్య మగుచు
నల్లమలయనఁ దనరి గణ్యతవహించె."

"పృథులదరీవిశాల బదరీ
విధురీకృతశైల నిర్ఝరీ
పథనిబరీసకైతకశిఖాంగణ
రంగగభృంగ ఝంక్రియా
ప్రథితరవానుసారముగ
రాగము లీనెడు కీచకాళితోఁ
గథితవికస్వరస్వరముఁ గల్వచు
వీణలఁ బాడి రచ్చరల్."

పూర్వపుపోకడల అనుకరణమునకు—

"సురసాల వాలమగుచును
సురసానప్రతిమరమ్య సురసాలంబై
సురసాలంకృతులెన్నఁగ
సురసాలంకారమనఁగఁ జూపులకలరుఁ.

అపప్రయోగములకు—

"గంగాతీరతపోవన

..... ..... ..... ..... .....

..... ..... ..... ..... .....

మంగళకర........మహానందికథల్

(౪ పుట—౧౭ పంక్తి)

"మహానందికాంతారమధ్యభాగమునందు

(౨౨ పుట—౨౩ సంక్తి)

"తఱివేచి వేకువఁ దడయక మేల్కను
మేల్కని కొలనిలో జల్కమాడు

(౯ పుట—౧౦ పంక్తి)

తెలివితక్కువ యనుకరణమునకు—

"హావికుచమ్ముల నంటి చూచెద వేమ;
యాలికుచమ్ముల నంటుకొనుము.
వలువఁ దొలంగింపు వైనంబుగాఁ జూతు;
నీధర నీకమ్మ నేల వలవఁ-
బదరిఫలంబైన భావించి కొననిమ్ము
కఠినహృదయ యిది కాంతుపడకు.

౭

ఆర్కాడు

గోపిసెట్టి

# రామచంద్ర నాయఁడు, బి.ఎ.

ఈయన గాజులబలిజకులజుఁడు. జనకకుల సగోత్రుఁడు. ఇంటిపేరు గోపిసెట్టివారు. పితామహుని తరమువఱకు ఆర్కాడు వాసముగాఁ గలవారు. తండ్రి మునిస్వామినాయఁడు; తల్లి రుక్మిణమ్మ. పితామహి బంగారమ్మ; పితామహుఁడు గంగన్ననాయఁడు.

జననము: చెన్నపట్నము; 19 మార్చి 1882-

మరణము: ,, ; 19 సెప్టెంబరు 1907.

తండ్రి మునిసామినాయఁడు, డెప్యూటీ ఇన్స్పెక్టరు—వాక్సినేషన్—(టీకాల ఇన్స్పెక్టరు)గా నుండెను. ఈయన ఉద్యోగవశమున ఈకుటుంబము తెలుఁగు జిల్లాలలో జీవనము గడపినది. ఈ రామచంద్రనాయఁని బాల్యము మొదలుగా యౌవనప్రాదుర్భావము వఱకు అనంతపురముజిల్లా పెనుగొండలో సాగినది. తరువాత మదరాసు పచ్చయప్ప కలాశాలలోను, క్రైస్తవకలాశాలయందును విద్యాభ్యాసం

గము సాగినది. 1906-వ సంవత్సరము పట్టపరీక్షయం దుత్తీర్ణుడైనాఁడు.

పెనుగొండలో చదువుకొనుచున్నపుడు, అట లోవర్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుఁడు, సంస్కృతాంధ్రములందు అతిమాత్రము కృషిగలవాఁడు శ్రీమాన్ ఎన్. కూర్తాళ్వార్ అయ్యంగారు అను నాయన, ఈ రామచంద్రనాయనికి విద్యాగురుఁడైనాఁడు. అయ్యంగారి శుశ్రూషభాగ్యమున ఈయనకు తెలుఁగుమీఁద చవిపుట్టినది. ఆ దినములలో, అచ్చ తెలుఁగున 'సత్యవిజయము' '(హరిశ్చంద్రోపాఖ్యానము)' ప్రబంధించిన అయ్యనకోట పార్థసారథిసెట్టిగారు ఆ పెనుగొండ హాస్పిటల్ అసిస్టెంటుగా నుండిరి. ఈయన శుశ్రూషయు, రామచంద్రనాయనికిఁ గలిగిన తెలుఁగుజవికి మఱింత తీపెక్కించినది.

మదరాసునఁ జదువుదినములలో కలాశాల తెలుఁగు పండితుల, సాహచర్య మొనగూడినది. అదియు ఈ నాయని సారస్వతకృషికి దోహదమయినది. క్రైస్తవ కలాశాల కప్పుడప్పుడే అనుబంధముగా రూపుదాల్చిన 'ఆంధ్రభాషాభిరంజనీ సమాజము'న ఈయన సభ్యుఁడైనాడు. ఏదేని వస్తువునుగూర్చి గద్య-పద్యములు రచించు సభ్యులకు, స్పర్థపరీక్ష పెట్టి, గెలుపుగొన్న వానికిఁ బసదన మిచ్చు నేర్పాటు సమాజ మవలంబించెను. శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు అప్పుడు (1899) క్రైస్తవ కళాశాలయందు బి. ఏ. తరగతిలో ప్రథమవార్షికవిద్యార్థిగ నుండి 'ముసలమ్మమరణము' పద్యమున రచించి తొలిపసదనము బడసిరి. ఈ రామచంద్రనాయఁడు, ఎఫ్. ఏ తరగతిలో జదువుచు, స్పర్థకుఁ దానును మునుకొని, టెన్నిసన్ కవికృతము 'డోరా' కథనుండి వస్తువు ననుకరించి, పాత్రలకుఁ దెలుఁగుపేరులు పెట్టి, స్థలముగా తెలుఁగుసీమయందలి పెనుగొండను గ్రహించి, 'సుమతి' పేర అచ్చతెనుఁగున 188 పద్యములుగల కావ్యము రచించినాఁడు. బహుమాకృతికి అర్హుఁడయినాఁడు—అందికొన్నాఁడు. ఇది 1901 వ సంవత్సరము కత.

1906-వ సంవత్సరమున నాయఁడు పట్టభద్రుఁడైనాఁడు. కొన్నిమాసములు, మదరాసు గవర్నమెంటు తెలుఁగు ట్రాన్స్‌లేటరు అఫీసులో నౌకరీచేసినాఁడు. ఇన్‌స్పెక్టర్-జనరల్ (రిజిస్ట్రేషన్ శాఖ) అఫీసున నుద్యోగమున కుపక్రమించినాఁడు. ఇప్పటికి వయసు 25. బ్రహ్మచర్యదీక్ష వదలలేదు. కుటుంబపోషణమున కక్షత ఏర్పడునందాఁక—స్వతంత్రవృత్తి స్థిరపడునందాఁక—పెండ్లాడనన్న పట్టుదలయే సాగించుకొన్నాఁడు. జాతకము ననుసరించి తనకు మారకమున్నటు, వివాహము మానితినని తనయాప్తులకు, ఒక రిద్దఱకుఁ దెలిపెనఁట గూడ!

1901 లో రచించిన తన'సుమతి'ని 1907-వ సం॥ జూన్ నెలలో ముద్రింపించి ప్రకాశింపఁజేసినాఁడు. పలువుర పండితుల మన్నన లందినాఁడు. "సుమతి" రసజ్ఞులయాదరముబడసినది అంతటితో ఈజీవినటన ఐహికరంగమున ముగిసినదికాఁబోలు—1907 సెప్టెంబరు మొదటివారమున సంధిజ్వర మారంభమయినది! 19-వ తేది సెప్టెంబరు అపరాహ్ణములో రామచంద్రనాయని జీవితమునకు పరిసమాప్తి యయినది! మదరాసునకు 500 మైళ్ళ దూరమున—గంజాముజిల్లా శ్రీకాకులము రేంజి—తెక్కలి—లో నుండిన తలి—దండ్రులు కొడుకు కాలగతిని విని నిలువున నీరైరి!

19 వ యేటనే తెలుఁగు సారస్వతమున, ఈడునకు మించిన చోరవ గడించి, అచ్చతెనుఁగు కావ్యము రచింపఁగలిగినాఁ డీనాయఁడు! భూమిమీఁద బ్రతుకు బుఱ మింకను దీర్ఘముగ నుండినచో పెద్దపెద్ద రచయితలలో నొకఁడై ప్రశస్తిగాంచియుండెడివాఁడు! జీవయాత్ర యందలి తొలి మజిలీయైన పూర్తిచేరకమును పే దారినడుమనే దయ్యము కబళించినది!

రామచంద్రనాయని స్మృతి చిహ్నముగా ఆయన మానసికపుత్రిక 'సుమతి' ఒక్కటి తెలుఁగుసీమకు దక్కినది! 'ఖిలము గాకుండునది యొక్కకృతియ' అనుట ఈయనయెడఁ జక్కఁగ వర్తించినది ఆలుపిల్లలు లేక ఏపేరకముఁ దొలఁగినను సాక్షరము అజరామరము నగు కృతికన్యం గన్నాఁడు;—కృతార్థుఁడైనాఁడు. తత్కృతిని తన తలి-దండ్రుల కంకితము నేసి ప

ణముం దీసుకొన్నాఁడు ;—ధన్యుఁడైనాఁడు.

'సుమతి' కావ్యమునుండి పద్యములను గొన్నింటిని ఉదాహరణార్థము ఉద్ధరించుటకు మున్న తత్కృతిని గూర్చి ఇంచుక తడవుదును ;

అచ్చదెనుఁగుకట్టుబాటునకు లోనయ్యు వడిగుడుసులఁబడక నడక తిన్నఁగా సాగినది. వస్తువున కనువుపడిన భావము లూరినవి. టెనిసన్ 'డోరా' శీల సంపత్తిని, 'సుమతి' వృత్తము, బహువిధములఁ బెంచి వికసింపఁజేసినది. ఇతివృత్తముమీఁద, పాత్రలమీఁద చూపు చెదరనీక, శబ్దాలంకారములవెట్టికి లోనుగాక, పలుకుబడికిని తలఁపునకును పెద్దగ నూఁతమిచ్చి తేఁట తెల్లమొనర్చ, రచయిత చేసిన జతనము పొత్తము తెలుపుచున్నది. కతకుఁ బ్రధానమయిన కరుణము స్ఫురించినది. అచ్చ తెలుఁగు బందుకట్టులేక సంస్కృతాంధ్రమిశ్రితముగా వ్రాసియుండినచో నీవృత్తము సహస్రగుణాధికమై యుండెడిది. కర్త వయసునఁ జిన్నయయ్యు వాఙ్మయమున నెక్కుడుగఁ గృషిచేసినాఁ డని తత్కృతము చాటుచున్నది.

ఈకథావశేషునిగ్రంథము "సుమతి"నుండి రచన కుదాహరణముగఁ బద్యములఁ గొన్నిటి నందు ఉద్ధరింతును :

"కమ్మక్రొవ్విరితావి గాడ్పురా తేఁజీల
 నెక్కుడువాళించు నిక్కులందు :
మవ్వంపు లేఁదీగమాటున నరవిరుల్
 ముసిముసినగవొల్కు దెసలయందు :
చిలుకపోటుల చేతఁ జిరిగిన బేసంబు
 జోటజోటఁదొరఁగెడు చోటులందు :
తెమ్మెరయెమ్మెకాఁ డిమ్ముగాఁ బొదరింట
 గుసగుసల్ వోయెడు కోనలందు :
తీఁగయుయ్యెలలం దూఁగి తూఁగియాడి
చిలుకకొమ్మలు నుతిగూర్చు నెలవులందు :
జూప జెంతయుఁ జిత్తరుబూపు లట్ల
యొయ్యనిలువరె యుల్లంబు లోలమంద."

"బురుజు లయ్యెయ్యెడ దొరల మున్నేర్చిన
 పడుకులు సడలెడు ప్రాఁతకోట,
కోటరా లురలఁగాఁ గూలిన మంటిచేఁ
 గరము పూడెడు తొంటికందకములు,
కందకం బాని నల్లనై ముస్తిబుగఁ
 దొలుతఁ గట్టిన మేటిదోగములును,
దోరమ్ములను గాఁపుదొడర గాడుపుమారి
 పిశ్యారిపతిమల పేర్మిఁ దనరి,
ప్రాపడిన దేవళములు నుప్పరిగగములు
నీటిలేవడి నపుడప్డుఁ జాటుచెఱువు
గలిగి మును రాయ లేలిన కలిమిఁ దెలుపు
ప్రాఁతజాల్గల పెనుగొండవఱలు నందు.

"కలకలమని పొంచి కలపండులను జించి
 యేపారు జిలుకలఁ జూపిచూపి,
పొలములఁ దమిఁ జేరి చెలులను దగఁజీరి
 దూఁకొను పులుఁగులఁ దోలితోలి,
అడికించుచును దాఁటు మిడుతలఁ జెయిమాటి
 యెలజొన్నకంకుల నిచ్చియిచ్చి
అరవిరులను గోసి యలుకమై గడుబ్రోసి
 చొక్కుతుమ్మెదలను జోపిజోపి,
అలరఁ జిన్నారిపలుకులఁ బలుకరించి,
పుణికి చెక్కిలి గిలిగించి బుజ్జగించి,
మోముఁ బొడగాంచి తమిసించి ప్రేముడించి
యుట్టి యరకాడు బుడుతనిఁ బట్టుపఱిచె."

చాపల్యము నాపలేక ఒకటిరెండు పద్దెములు పూర్వపుదిమ్మలో దింపఁబడినవి. మచ్చున కొకటి :

"దాయనుగాఁ దలంచు టరుదా యనుఁ ;
 గన్నెడసేయ నీకు వా
దా యను ; నన్నుఁ గోరఁ దగదా యనుఁ ;
 దాలిమిసేఁత మేర గా
దా యను ; మన్నలంప బిరుదా యనుఁ ;
 దండ్రిని డాసి వేఁడరా
దా యను ; నన్నె యింత గలదా యను ;
 వేరము చాలదాయనున్."

—మున్నంగి శర్మ.

# నిజానికెవరిదీపాపం?

౧

వెంకన్న పోతుగడ్డ అనే పొరుగునామంగల కమ్మటూరి ఆసామి. నాగయ్య చౌదరికి లేక లేక ముదివయస్సునకలిగిన కొడుకు. నాగయ్యకు నలుబది యెకరముల సుక్షేత్రమైన మాగాణిపొలం పది యెకరాల తోట నలుబదివేల రూపాయల ఖాతా నాలుగరకల యెడ్లు నలుగురు పెద్దపాలేళ్ళు యింకా యీ సంపత్తుకు తగినట్టు అమాంబాపతు ఒక యిరవై పశువులు ఉన్నవి. ఆ వూళ్ళో యింకెవరికి అంతకన్న పొలం లేకపోవటంచేత అంతడబ్బు లేకపోవటంచేత ఆ గ్రామస్థులంతా షావుకారు నాగయ్య అని ఆయన్ని పిలిచేవారు.

షావుకారు నాగయ్య చాలా మంచివాడు, సరసుడు అనిపించుకున్నాడు. ఊళ్ళో ఏ తగాదాలు వచ్చినా ఆయనదగ్గర పరిష్కారమవుతూ ఉండేవి. యేదైన అవుసరంగలిగి డబ్బుకోసరం వెళితే ఆయన లేదనేవాడుకాడు. డబ్బుయిచ్చి తొందరలు చేసేవాడు కాడు. డబ్బంతా మునిగిపోతూవుంటే యిల్లూవాకిలి వేలంవేయించినా యింట్లోనుంచి వెళ్ళకొట్టేవాడు కాడు. అందుచేతనే ఆయనకు పెద్దమనిషి అనేగౌరవం.

వెంకన్న పెద్దవయస్సులో పుట్టటంచేత ఒక్కడే కొడుకవటంచేత నాగయ్య చాలా చనువుచూపేవాడు. అతనేంకావాలని మారాంచేసినా ఎంత ఖరీదయినా అప్పటికప్పుడు తెప్పించియిచ్చేవాడు. ఒకనాడు వెంకన్న తనకో గడియారము ఒక ఫౌంటేను కలము యిస్తేనేగాని బడికిపోనన్నాడు వెంటనే ఆ వూరి కరణాన్ని బెజవాడ మోటారుమీద పంపించి నలభై రూపాయలుపెట్టి తెప్పించియిచ్చాడు. తల్లికుండే ప్రేమకు అంతులేకపోయినా కొంచెమంత బద్ధకస్తురాలవటంచేత కొడుకంటే అంత పెద్ద శ్రద్ధగా వున్నట్లు కనిపించేదికాదు. ఇంక నౌకర్లు చాకర్లమాట చెప్ప అక్కరలేదు. దొరగారు దొరగారు అంటూ ఎప్పుడూ క్రిందదించేవాళ్ళు కారు. ఆఖరికి ఆ బడిపంతులుగారికికూడా షావుకారుగారి కుమారుడనే గౌరవమే. కొంచెమంత తలనొప్పిగావున్నదండీ అన్నా, మా అమ్మ రమ్మందంటే అన్నా, మా నాన్నతో మాట చెప్పాలండీ ఊరెడుతా డన్నా తప్పక పంపించేవాడు.

ఇంత గారాబము చనువు అవటంచేత ఆ వూరి బళ్ళో వున్న అయిదుతరగతులు చదవడానికి వెంకన్నకు పది సంవత్సరాలు పట్టింది ఇప్పటికి వెంకన్నకు పదహారు సంవత్సరాల వయస్సు వచ్చింది. అయిదోక్లాసు సర్టిఫికేట్టు వచ్చినా వెంకన్నచౌదరికి చదవటం వ్రాయటం సరిగ్గారాదు.

ఇంకా లోగడ మున్నట్లు ఆటలు పాటల్లో వెంకన్నచౌదరి తనచెయ్యే పైనవుండా లనుకొనేవాడు. శరీరంలో బలమున్నదనే అనుకుంటే బుద్ధిబలం ఎక్కడిది. ఏదోబలంతో చెయ్యబోయ్యేటప్పటికి ఎవడో వుపాయంగా చేసేసేవాడు. దానితో వుక్రోషం వచ్చి వెంకన్న వానిని పట్టుకుని కొట్టేసేవాడు. వాడేడిస్తే ఆటలో అరటిపండు అని వూరార్చేవాడు. పెద్దవాళ్ళదాకా పోయినా వాళ్ళు షావుకారుగారి మీద గౌరవంచేత దాన్నిఅంత బయటకు లాగేవారు కారు. ఎవ్వరైనా కొందరుపోయి చెపితే నాగయ్యగారు కొంచెమంత కూకలువేసేవాడే.

౨

ఇక ఆవూళ్ళో చదువులేదు. పొరుగూరు పంపటానికి వెంకన్నను వదిలిపెట్టివుండలేరు. పోనీ నాగయ్య తనూ భార్యా వెంకన్నని పెట్టుకుని ఏబెజవాడలోనైన వుందామా అనుకుంటే యీకామాటం అంతా వదిలిపెట్టి వెళ్ళడానికి వీలులేదు. అయినా ఏంకావాలి పెద్దచదువు తనకొడుకుకు. కొంచెమంత దస్కత్తుచెయ్యటం కూలీపద్దు రాసుకోవటం కొంచెమంత వడ్డీకట్టుకోవటం వస్తే చాలు. మొదటి రెండు కృత్యాలు యేదోవిధంగా రానేవచ్చు. ఇంకా యీ మూడో చదువుకి ఓపంతులుగారిని ప్రత్యేకించి తనయింటికివచ్చి చెప్పేలాగున ఏర్పాటు చేసుకున్నాడు.

వెంకన్నచౌదరి దినక్రమంలో ముఖ్యమైనవి నిద్ర, పేకాట, ఎవళ్ళయినా ఒకళ్ళిద్దరు స్నేహితులు వెంట వస్తే తరచుగా వాళ్ళతో మైనూరుయెడ్లబండిమీద షికారు. ఈకార్యాలలో ప్రైవేటుమేష్టరుకు యెప్పుడూ అవకాశం చిక్కేదికాదు అయినా జీతండబ్బుల కోసం రోజూ షికారు వెళ్ళేసమయానికి హాజరై ఆబండి మీద హుషారుగా వాళ్ళతోటకు వెళ్ళి రెండుమామిడి పళ్ళో రెండు నారింజకాయలో తెచ్చుకునేవాడు.

అది పదియెకరాలతోట గనక అందులో అనేక విధాల ఫలవృక్షాలు పూలచెట్లూకూడా వుండేవి. వాటి సంరక్షణ నిమిత్తం అందులో వీరడనే ఒకపెద్ద మాల ప్రస్తుతం కాపురం వున్నాడు. వాడి తాతా తండ్రులు కూడా ఆ తోటమీద కావలాకాసి జీవనము చేసిన వారే. నాగయ్యచౌదరికి వీరడు మూడుతరముల పాలేరవటంచేత అతనియందు నమ్మకంజాస్తి. వీరడు ప్రతి నిత్యం ఉదయం కాయలుపండ్లు సాయంత్రం పూవులు నాగయ్యగారికి తెచ్చియిస్తూ వుండేవాడు. తనయింటికి సరిపడుపళ్ళు పోను మిగతావానిని షాహుకారు నాగయ్య వీరడిచేతనే అమ్మించి డబ్బుతీసుకొనేవాడు. పూలుమాత్రం అమ్మించేవాడు కాడు.

వీరడు వుండటకు ఆ తోటమధ్య ఒక నిట్టాడిపాక వుంది. అందులో అతను అతనిభార్య రత్తి మరి యిద్దరు పిల్లలు నివసిస్తూవుంటారు. అది వాళ్ళ స్వగృహంగా అవటంచేత వాళ్ళకు సౌఖ్యమంతా అక్కడేవున్నట్లు తోచేది. అయినా యేంతక్కువ. ఆ తోటలోనే ఓ మోటబావి. కావలసినంతస్థలం. చుట్టూ ప్రహరీగోడ. నిత్యం యేవోఫలాలు. అన్నిటికన్న అందమైనవి పూలు ఇవన్నిటిచేత అదోనందనవనం లాగుండేది.

రత్తి అందమైనమనిషి. ఇరువదినాలుగు సంవత్సరాల వయస్సు. కొంచెం కాలిపొడగరి. పలాచటి మనిషి చామనచాయ నీలాలవంటి వెంట్రుకలు ఆ కనుముక్కుతీరు చూచివుంటే భట్టబాణుడు కాదంబరిలో యింకో డోసు తగిలించేవాడే. ఆ రత్తిని పువ్వులలోపెట్టి పూజించుకుంటూ దేవేంద్రుడులా భోగం అనుభవిస్తూఉన్నాడు వీరడు. వీరడికి రత్తిని కానక పోతే జీవితమే లేదు. అతని క్షుద్రజీవితంలో రత్తి ఒక పెన్నిధిలా దొరికింది. వీరడి హృదయంలో తనను స్వర్గానికి తీసుకెళ్ళినా నరకకూపంలో పడద్రోసినా రత్తియే అనిపిస్తుండేది. రత్తి అట్టి తెలివితేటలుగలది కూడాను. అయితే కొంచెం మెత్తనిపిల్ల.

వెంకన్నచౌదరి తోటకు వెళ్ళినప్పుడల్లా రత్తిని కన్నులపండువగా చూస్తూవుండేవాడు. రత్తీ వీరడు కూడా దొరగారు వచ్చారని ఆ తోటలో చెట్లన్నీ చూపిస్తూ యివ్వాళ యీ దానిమ్మచెట్టుకు చిలకలు యెగబడినవని, యీ రోజు యీ బత్తాయి చెట్టుకు బుట్టలు కట్టవలెనని, యీ దినం యీ గులాబిచెట్టు కొమ్మలు కత్తిరించవలెనని, యీ సాయంత్రం యీ మల్లెచెట్టు ఆకులన్నీ దూయవలెనని చూపిస్తూవుండే వారు. అతను వాటిని సంతోషంగాచూస్తూ యింటికి వెళ్ళేటప్పుడు తానుకోసిన పూలలో మంచివియేరి రత్తికి, పండ్లలో కొన్నిమంచివి వీరడికి యిచ్చేవాడు. వాళ్ళు ఒకళ్ళొకళ్ళు ముసిముసి నవ్వులతో పుచ్చుకునేవాళ్ళు.

ఒకరోజున వెంకన్నచౌదరి ప్రొద్దునే భోజనంచేసి మైనూరెడ్లబండిమీద ఒక్కడే తోటలోకి వెళ్ళాడు. నాటిదినం వీరడు నారింజకాయలు చాలా దిగుటచేత గ్రామంలో ఖర్చుకావని బండిమీదకట్టించుకుని బస్తీ వెళ్ళాడు. వెంకన్న బండిదిగి తోటకువెళ్ళి రత్తిని పిలిచాడు. ఇరువురు తోట అంతా తిరిగారు. ఆ రాత్రి పూసిన గులాబిపూలన్ని వెంకన్న తన వుత్తరీయంలోకి కోసుకున్నాడు.

చెట్లన్నీచూచి పాకవద్దకువచ్చినారు. వెంకన్న ఆ పంచాదిలో చదికిలబడి రత్తినికూడ కూర్చోమన్నాడు. రత్తియింట్లో యేడుస్తూన్న చంటిపిల్లవాణ్ణి ఎత్తుకుని వచ్చి పాలిస్తూ కొంచెమంత ఎడంగా కూచుంది. వెంకన్నచౌదరి ఆ మాటలు యీ మాటలు మాట్లాడుతూ రత్తిచేత మళ్ళీ మాట్లాడిస్తూ, తనకు చాలా పెళ్ళిసంబంధాలు వస్తున్నాయనీ, అందులో ఓ సంబంధం కుదరబోతోందనీ, ఆ పెళ్ళికూతురు రత్తి అంతచక్కందని అంతే పొడుగని ఆ కళ్ళుకూడా అట్లాగే మెరుస్తాయని మాట్లాడ్డం ప్రారంభించాడు. రత్తి అన్నివిషయాలు

నిజమే అనుకుంది. తన ఆసామి పెండ్లికి తనుకూడా చాలా సంతోషించింది. కాని అంకలో వెంకన్న చౌదరి అందుకుని 'నాకు యిప్పుడు పెండ్లాడటం అందులో ఆ పిల్లను పెండ్లాడటం అంతగా యిష్టంలేదు. ఎందుచేత నంటే ఆ పిల్ల నీకంటె చక్కంది కాదు. నీకంటె చక్కని పిల్ల దొరికితే గాని పెండ్లిచేసుకోవాలని యిష్టం లేదు' అన్నాడు.

'ఏం నేనంత చక్కనిదాన్నా' అంది రత్తి వెకిలిక లాడుతు.

'నిజంగా రత్తీ' నీ చక్కదనాన్ని వెయ్యికళ్ళతో చూస్తూవుంటా;

పిచ్చిపిల్ల ఆ మాటలలో వ్యంగ్యము గ్రహించుకో లేదు.

'అయినా దొరలను నాతో వంతేమిటి. మా దొర లెప్పుడోయింటికొస్తారా. మాకు కొత్త దొరసాని నమ్మగా రెప్పుడొస్తారా' అని తలచుకుంటూవుంటాము.

'దొరసానమ్మ వచ్చేంతవరకు నువ్వే దొరసాని వెందుక్కాకూడదు రత్తీ' అంటూ కొంచెమంత దాపుకి జరిగాడు వెంకన్న చౌదరి.

'నేనెట్లా అవుతాను దొరా' అంది అమాయికపు గొంతుతో రత్తి.

'నేను నిన్ను చేస్తాను. అవతావా. రత్తీ' అన్నాడు.

'వద్దుదొరా, నన్ను నీపాలేరును యీపసిపిల్లల్ని యిట్ల బ్రతకనియ్యి' అంది.

వెంకన్నచౌదరి నిర్విణ్ణుడైపోయాడు. మామూలు ప్రకారం కొన్ని గులాబిపూలిచ్చి 'రత్తీ, యివి నువ్వు పెట్టుకుంటే బాగుంటాయి పెట్టుకో' అన్నాడు. రత్తి పూలు తననీలాలకొప్పులో సర్దుకుంది. అక్కడ వంకరలావుంది చూడు నేసర్దుతానని చౌదరిలేచి రత్తి తలమీద చెయ్యివేశాడు.

రత్తి గ్రహించుకుని 'చాల్లెండి దొరా' అని చెయ్యి పుచ్చుగుంది.

వెంకన్న రత్తిబుగ్గమీద తట్టుతూ 'రత్తీ' అని యేమో చెప్పబోయాడు రత్తి కొంచెం కోపంతెచ్చుకుని 'వెళ్ళండి కాకుంటే పెద్దదొరతో చెప్తా'నంది.

చౌదరి మాట్లాడకుండా వెళ్ళిపోయివాడు.

## 3

మూడు సంవత్సరాలు గడిచినాయి షావుకారు నాగయ్య కాలంచేశాడు. ఆకాలంలో రత్తికి వెంకన్న చౌదరికి యిట్టి సంఘట్టనము చెప్పతగ్గ జరుగలేదు. వీరడు రత్తి మామూలు సుఖంగా మామూలు ఆనందంతో ఆతోటలో కాలక్షేపం చేస్తున్నారు. చౌదరికి కూడా పెండ్లిఅయింది. ఒకపసిపిల్లవాడు కూడా కలిగాడు.

ఓరోజు వీరడు మామిడికాయలబండీ తోలించుకుని బస్తీ వెళ్ళాడు. వెంకన్నచౌదరి ఆ అవకాశంలో తన తోటలోకి వచ్చాడు. రత్తి వచ్చి కొత్త మొక్కలనీ పాత మొక్కలనీ చూపించింది. అన్నీ చూచింతరువాత వెంకన్నచౌదరి వీరడి పంచాదిలో కేవిణీ వేశినాడు. రత్తిగూడా కూర్చుంది. ఆకబుర్లు యీకబుర్లూ మాట్లాడుతూ వెంకన్నచౌదరి,

'రత్తీ ఎన్నాళ్ళనుంచో నీమీద ఆశ, నెరవేర్చక పోతివిగదా' అన్నాడు. రత్తి భయము ఆశ్చర్యము చూపుతూ' ఏలినవారికే యిట్టిది కలిగితే మాకింకా దిక్కెవరు' అంది.

కాదు రత్తీ నువ్వుచాలా అందమైన దానివి అందుచేత నీమీద ఆశ. కాని నువ్వు వెనక మాఅయ్యతో చెప్తానన్నావుకదూ! భయంచేత వదిలిపోవాల్సి వచ్చింది అనాడు. కాని రత్తీ! నిన్ను ఒక్కపర్యాయము'

దొరా తమపాలేరుదానితో యిట్లామాట్లాట్టం తగదు వదిలివెయ్యండి అంది రత్తి.

వెంకన్న 'రత్తీ నీకు చీరెలు, కావలసిన వస్తువులు నీ పిల్లలకు చొక్కాలు అన్నీ తెచ్చియిస్తాను. నాదీ కోరిక మాత్రం......' అన్నాడు.

రత్తి వెంటనే అందుకొని దొరా ఇప్పుడు అనుభవించేవన్నీ తమరు దయచేసినవి కావా. ఈ అల్లరి ఒకటి కలిగించిన మాదొరవు నిన్ను అల్లరిపాలుజేసి నేను అల్లరిపడటం యిష్టంలేదు అంది అతి దీనంగా.

'మరుమాట చెప్పకు రత్తీ,' నీకొరకు యేమివచ్చినా జంకను. నామాట కాదనకు' మని చెయ్యిపట్టపోయినాడు.

రత్తి పరుగెత్తి తనపాకలోదూరింది. చౌదరికూడా

లోపనూరి రత్తిని పట్టుకున్నాను. రత్తి విదలించుకుంది. చౌదరి కొంచెం కోపంతెచ్చుకుని, 'ఎన్నివిధాలుగా నిన్ను బతిమాలినా నీమంకుతనం విడవవు. పెంకిపిల్లవు నీవు ఒప్పుకపోతే ఏంజరుగుతుందో తెలుసా, మీరు నా తోటవిడిచి పోవలయును. ఇక్కడనుంచి నేనేమీ మీకు యివ్వను. నన్ను కాదని మావూళ్ళో వాళ్ళు వీరడికి ఏమీ యివ్వరు కదా. మీకు చిట్టెడ గింజలుగూడా పుట్టనివ్వను. నువ్వు నీపిల్లలు నీవీరడు అంతా మాడిపోవలసి వస్తుంది. జాగ్రత్తగా ఆలోచించుకో' అన్నాడు చెయ్యివదలి వెనుకకు తిరిగి.

వాస్తవానికి జరిగే పరిస్థితులుగూడా యిటువంటివే. వీరడు రత్తి ఆతోటలో అఖండసౌఖ్యం అనుభవిస్తున్నారు. అచెట్లూ అపూలూ అపండ్లే కాకుండా చాలినంత డబ్బూ బట్టలు అన్నీ దొరుకుతున్నవి సాహుకారుగారింటినుంచి !! ఇదికాదని పొమ్మనుకుంటే ఆ వూళ్ళో గిద్దెడు గింజలైన పుట్టనిమాట వాస్తవమే. పోనీ నోరుమూసుకుపోతే యిల్లు లేదు. వీరడు కూలినాలి చేసి పగలల్లా చమటవోడ్చి చీవాట్లు దెబ్బలుతిన్న దినముకు వచ్చే కూలి మూడణాలు మాత్రం. దీంతో ముగ్గురు పిల్లలు మొగుడూ తనూ జీవనంచేసేదెల్లా అందులో వీరడంటే కళ్ళలో కాస్తోందిరత్తి తను వ్యతిరేకించినా వీరణ్ణి సుఖపెట్టాలనే కోరికగలది.

ఒక్కతనవ పరిస్థితులు తలుచుకుంది నిర్జీవమైన కళ్ళతో చూచింది. ఆతోట బయటిప్రపంచం అంతా అంధకారమయంగా కనిపించింది. తనసౌశీల్యంకోసకు తన ప్రాణంకంటే అధికంగా ప్రేమించే వీరణ్ణి పిల్లలను హింసపెట్టటం న్యాయంకాదనుకుంది. ఆఆలోచనా పరంపలోనే కళ్ళనీళ్ళు కాల్వలై పారుతూంటే అవ్యక్తస్వరంగా 'మీ చిత్తం' అన్నదిరత్తి. పాపం !

## ౪

వీరడికి తనులేకపోతే లోకమేలేదుగనుక రత్తి యీ అవమానానికి ఆత్మహత్యా ప్రయత్నాలేమీ చేయలేదు నిజంగా వాళ్ళిల్లిప్పుడు సమస్తవస్తువులతో నిండిపోతున్నది. సాహుకారుగారింట్లో ప్రవేశస్తున్న వీళ్ళింట్లోనే వుండేది. కొన్ని నెలలు గడిచినాయి.

వీరడికి రత్తి ప్రవర్తనమీద కొంచెంకొంచెము అనుమానం మధ్యమధ్య తగిలింది. కాని ఆయిద్దరికి గల అన్యోన్యప్రేమ దానిని తోలుగావుండేది. ఇట్లుండగా గ్రామమంతా సాహుకారు వెంకన్న రత్తిని వుంచుకున్నాడని పుకారుపుట్టింది. ఇది పాకిపాకి ఓనాడు వీరడి చెవులోకూడా పడ్డది. దీనితో రత్తివిషయం బాగా అనుమానంలోకి వచ్చింది. రత్తి తనవిషయంలో యింత అన్యాయం చేస్తుందా అనుకున్నాడు. కాని సాహుకారు వెంకన్న తనమీద యింత అభిమానం చూపడానికి ఏదో ప్రత్యేక కారణం వుండాలనుకున్నాడు. పోనీ అడిగితే అని అతనికి తోచింది. కాని వారిరువుర మధ్యనున్న ప్రేమ తానే అపవిత్రత చేస్తాడేమోనని తోచిందో యేమో అడుగుటకు సంకల్పించుకోనలేదు. కాని అనుమానపిశాచాన్ని వదులుకోనలేదు.

ఓరోజు వెంకన్న చౌదరి తోట చూడటానికి వచ్చాడు. వీడు రత్తి తోట చూపిస్తున్నారు వీరడు ముందు నడుస్తున్నాడు. వెంకన్నచౌదరి తరువాత రత్తి పక్కగా నడుస్తోంది. సందుచూచి వెంకన్న రత్తిబుగ్గ గిల్లినాడు. రత్తి చిరునవ్వునవ్వింది. అనుమానం అవరించిన వీరడు దీన్ని క్రీగంటచూచినాడు. కోపం తమాయించుకున్నాడు. చూడనట్లే నటించి అ సామిని యింటికి పంపేశాడు

రత్తి దోషిఅని నిర్ధారణయింది. తన్నింతగా లాలించి పూజించే రత్తి యిల్లా అయిపోతుందని స్వప్నేపి అనుకోలేదు. ఇటువంటి కళంకినిని చూడనైనా తలచుకోలేడు. దీన్నెట్లా విసర్జించటమని ఆలోచించాడు. ఇక రత్తిని భరించలేననుకున్నాడు. నమ్మకద్రోహమునకు నమ్మకద్రోహమే ప్రతీకారమని యోచించి నిశ్చయించుకున్నాడు.

సాయంత్రం నాలుగు గంటలయింది రత్తి మామూలుగా నీళ్ళకుగాను నూతబావివద్దకు వెళ్ళింది. వీరడు కూడా వెంట వెళ్ళినాడు రత్తి నీళ్ళకుగాను చేద నూతిలో వైచినది. నీరు పైకిలాగుతున్న సమయం చూచి వీరడు రత్తిని బావిలోకి ఒకతోపు తోశినాడు. అంతే. అయిదునిలువుల నూతబావికి రత్తి ఆహారమయింది.

రత్తి పడేపడటంతోటే వీరడిమనస్సు చలించింది. వాడు వెంటనే చేతులెత్తి మా రత్తి బావిలో పడ్డదండోయని అరవటం మొదలెట్టాడు. నాలుగుపక్కల జనం పోగయ్యారు. వీరడు బావిచుట్టూ పరవళ్ళు తొక్కుతున్నాడు. ఎవరో బావిలోదిగారు. కాని రత్తిప్రాణాలు అదివరకే పోయినాయి. శవాన్ని బైట పారేశారు. వారు వీరు ఎట్లాపడిందని అడగ్గా నేనే తోశాను మాదొర చంపాడు అని ఏడ్చినాడు. ఎవరడిగినా యిదేస్మరణ. గ్రామమునసబు వెట్టీని కాపుపెట్టి పోలీసుస్టేషనుకు తెలియపరచెను. ఆ రాత్రే పోలీసు భటులు వచ్చి వీరణ్ణి పట్టి కట్టుకుపోయారు. సాహుకారు వెంకన్నకూడా వెంట వెళ్ళినాడు.

మరునాడు మేజస్ట్రేటువద్ద వెంకయ్యచౌదరి మీదను వీరడిమీదను రత్తిని చంపినారని కేసుపెట్టినారు పోలీసువారు. వెంకన్నచౌదరి యీ కేసుతో తనకేమీ సంబంధంలేదనీ తానా మధ్యాహ్నం తోటకేసి వెళ్ళనే లేదని వాదించినాడు. వీరడుకూడా వెంకయ్య నాటి మధ్యాహ్నం తోటవైపుకే రాలేదని తనే రత్తిని రెండుచేతులాపట్టి బావిలో త్రోశానని చెప్పుతూ తన దొరగారే చంపారని చెప్పినాడు. మేజస్ట్రేటు యీ అసందర్భంగావున్న వాఙ్మూలాన్ని తఱచి తఱచి అడిగాడు. వీరడు అన్నీ తనేచేశానని ఒప్పుతాడు కాని ఆఖరుమాట దొరగారు రత్తిని చంపారని మరచిపోడు. అతని బంధువులంతా అతని చుట్టూ జేరి 'యేంటీ అవకతవకమాటల'ని మందలించి సరిగా చెప్పుమన్నారు. 'అవును నేనే త్రోశాను, రత్తి చచ్చింది. దొరగారు చంపాడు. సరిగానే సెప్తున్నాను' అని ఆవురుమన్నాడు వీరడు. అక్కడున్నవారందరూ యితనికి పిచ్చియెత్తిందని నిర్ధారణచేశారు. ఆ మాటలువిన్న వీరడు పకాపక నవ్వాడు. కేసు సెషన్సును పంపబడ్డది.

సెషన్సు విచారణలోను వీరడు వాఙ్మూలమీప్రకారమే యిచ్చాడు. కాని సాహుకారు వెంకయ్య ఎట్లా చంపాడంటే యేమీచెప్పడు. పోనీ అమాట మానుమని బోధించారు వాళ్ళువాళ్ళు. అది మానడు.

వీరడిబంధువులంతా ఎల్లాగైనా వీరణ్ణి బ్రతికించుమని ఒకన్యాయవాదిని వేసుకున్నారు. అతడు వీరణ్ణి రహస్యంగా ఒకచోట కూర్చోబెట్టుకొని యెన్నో విధాల బుజ్జగించి బ్రతిమాలి మీదొర ఎట్లుచంపాడో చెప్పుమన్నాడు. వీరడు ఆరహస్యం బయటపెట్ట దలచుకోలేదని నిష్కర్షగా చెప్పాడు. వకీలు 'నీకు వురిశిక్ష విధిస్తారు' అని భయపెట్టాడు. 'నేను దానికి ఎప్పుడా అని ఎదురుచూస్తున్నాను' అన్నాడు వీరడు. వకీలు తెలివిగా 'చచ్చిపోవుటకు పూర్వము నీదోషములు సమగ్రముగా చెప్పుకుంటే భగవంతుడు నిన్ను క్షమిస్తాడు చెప్పుకొమ్మ'ని చెప్పినాడు.

వీరడిబుద్ధి తిరిగింది. భగవంతుడు 'మారత్తినికూడా క్షమిస్తాడా,అని అడిగినాడు.వకీలు ఔనన్నాడు. వీరడు జరిగినవిషయమంతా పూసగ్రుచ్చినట్లు చెప్పినాడు. చెప్పి 'మారత్తిని మాదొరగాదంటండి చంపింది బాబయ్యా నన్ను పిచ్చివాడంటారు'అన్నాడు. వకీలు ఈవిషయమంతా రేపుకోర్టులో చెప్పుకోమన్నాడు కాని వీడు నిరుత్తరుడయాడు. చెప్పకపోతే వురిశిక్ష పడుతుందన్నాడు వకీలు. నేనదేకోరతానన్నాడు వీరడు.

మరునాడు వకీలు జరిగినదంతా చెప్పి ఒకరిద్దరు సాక్షులచేతకూడా చెప్పించాడు. కాని యీవిషయము నమ్మేవారెవరు. వీరడు ఏమీచెప్పడు. తనే తోశానని దొర చంపాడని చెపుతాడు.

తీర్పరుల అభిప్రాయం న్యాయాధికారి అభిప్రాయం ఏకీభవించింది. వీరడు రత్తిని హత్యచేసి మతిచెడి తన దొరమీద త్రోయటానికి అబద్ధములాడుచున్నాడని నిర్ధారణ చేసినారు. ఉరిశిక్ష విధించినారు. వీరడాశిక్షను సంతోషంగా విన్నాడు. పోలీసువారు వచ్చి వీరణ్ణి వెంటపెట్టుకొని పోయేసమయాన వీరడు సాహుకారు వెంకయ్యవంక తిరిగి 'నిజంచెప్పు దొరా' నువ్వుగాదు మా రత్తిని చంపింది? అన్నాడు. వెంకన్నచౌదరి కొయ్యబారిపోయినాడు.

గ్రుడ్డిలోకం ఎలా నిర్ణయించినా నిజానికి ఎవరిదీ పాపం!

—హరి రాధాకృష్ణమూర్తి.

# కథ వ్రాయడం

ఆ రోజు ఆదివారము కావడంవల్ల భోజనాలు త్వరగా అయ్యాయి నేను గదిలో కుర్చీమీద కూర్చున్నాను ఎదురుగానున్న బల్లమీద నాలుగు తెల్లకాగితాలు, కలము, సిరాబుడ్డి ఉన్నాయి. గ్రామఫోన ప్లేట్లిచ్చిన వనితారత్నాల ఫొటోలు కొన్ని గోడను వ్రేల్లాడుతున్నాయి. నా ప్రక్కనున్న ఉయ్యాలలో మాఅబ్బాయి ఊగుతున్నాడు. గోడనున్న గంటల గడియారము లోపల 'మిసెలు హేండు' మాత్రము 'క్వెల్వ్ యార్డ్సు' పందెములో గబగబా పనిచేస్తోంది. ఆయాసంచేత దానికికల్గిన వగర్పు తక్క గదిఅంతా నిశ్శబ్దం. శాంతరసం అంతటా ఆవరించింది. నే నెల్లాగో చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాను.

కొంతసేపటికి నారాజ్యం,

'ఎంతసే పాలోచన ? కాగితాలు కలము ఉంటేసరి మేమెవరం కనపడం అప్పుడప్పుడు గోడలమీద బొమ్మలు తక్క' అంది నెమ్మదిగా.

నేను నిజంగా సిగ్గుపడ్డాను. కాని అల్లాటి మాటలు నాకు తగలడం యిది తొంబది తొమ్మిదో పర్యాయం.

'నీ బాధ పడలేకుండావున్నాను. రేపు నీ చిత్రంకూడా అక్కడ తగిలిస్తానులే' అంటూ ప్రక్కకితిరిగిచూచాను. రాజ్యం ఉయ్యాలమీద అనుకుని చేతిలో తమలపాకులు పట్టుకుని నిలబడివుంది, ఎంతసేపటినుంచో.

'ఏమిటా ఆలోచన!' అందిరాజ్యం మళ్ళీ.

'సువర్ణలేఖకు ఏంకథవ్రాద్దామా అని' అన్నాను తమలపాకులు అందుకుంటూ.

'నే జెప్పనా ?'

'ఇంకేంకావాలి'

'భీముని బలపరాక్రమాలు'

'సీ సౌందర్యమువలెనే అనన్యసామాన్యమైనప్పటికి ప్రజలు అతిశయోక్తి అంటారు.'

'దమయంతి కష్టాలు'

'నేటి భారతనారీమణులకు ఆశ్చర్యంకలిగించలేవు, జాలి బుట్టించలేవు.'

'శివాజీ పౌరుషోదంతాలు'

'ఎడతెరపిలేకుండా పాడి కవికుమారులు విసిగెత్తివున్నారు.'

'అక్బరు పరమత సహిష్ణత!'

'వెయినోళ్ళ కీర్తించవలసిందే కాని యిప్పటివాళ్ళలో మతంకొఱకు దేవుళ్లాడేవారు తక్కువ. మాకు ఏ మతమైనా సరే ఏదోఒకటి ఉండడం కావలసింది అంటారు.'

'బాల్యవివాహాలు వద్దని' అంది రాజ్యం సందేహిస్తూ.

'శారదా చట్టముండగా వాటి అవసరమేమిటి ?'

'పోనీ గయ్యాళిభార్యనుకూర్చి వ్రాస్తే'

'బాగానే వుంటుంది కాని మాయ ప్రపంచం ఆలోచించకుండా వ్రాసినవాడి స్థితియిదంతా' అంటుంది.'

నేను తాంబూలం వేయడం సమాప్తమైంది. రాజ్యం మెల్లిగా మంచంమీద ప్రవేశించింది.

'ఇన్నిచెప్పినా మీకు నచ్చకపోయాక నే నేమి చేసేది ? ఇక రేపు ఆలోచింతురుగాని

యీవాళటికి కట్టి పెట్టండి'

'సరే యీవాళటికి ఆలోచించడం రేపు వ్రాయడం' అంటూ రాజ్యం ప్రక్కన కూర్చున్నా.

'ఇన్నికధలు వ్రాస్తారు ఏంలాభం? ఆడదాని మనసులోని సంక్షోభం తెలిసికోలేకపోయాక! మేం మాత్రం మీ చూపుల్లోని భావాలు తెలిసి ప్రవర్తించకపోతే బయలు వెడలుతాయి ధుమధుమలు, అన్యాపదేశాలూను' అంది రాజ్యం కణతలు రెండూ రెండుచేతుల్లోనూ పట్టుకుని.

నా రాజ్యంమాటలు నా భావాలిని రేపాయి. నవ్వువచ్చి తన కోమలకరపల్లవాలతో మనోహరవదనాన్ని మూసివైచికొందని ఆ రెండుచేతులు పట్టుకుని క్రిందికిలాగాను. కాని రాజ్యం పెదవులమీద చిరునవ్వైనా లేదు. కళ్లు ఎఱ్ఱబడ్డాయి. ముఖం మీద ఏదోబాధ పొడగట్టుతోంది నేను సందేహంతో

'తలకాయనొప్పిగావుందా' అని ప్రశ్నించాను. రాజ్యం తలవూపింది ఔనన్నట్టుగా.

'అమృతాంజనం రుద్దనా?'

'ఎన్నిరుద్దకుండా మీతో చెప్పలా! మీకునుల్లే!' అంది రాజ్యం చురుకుగా.

'ఎప్పటినుంచి ఉంది యీబాధ' అన్నాను ఏమిటో.

'రోజూ రాత్రి ఉంటూంటుంది' అంది నవ్వుతూ.

నాలోఏమిటో విద్యుత్ప్రసారం అయింది.

'కారణం?' అన్నాను వెంటనే.

'కారణం చెప్పనా?'

'ఊఁ'

'కోపపడకనండి'

ఇల్లాగే అన్నాను.

'మీరు తీరుబడిగా వున్న కాస్సేపూ పనికిమాలినకధలు వ్రాయకపోతే...' అని ఆగింది రాజ్యం. నాకు నిజంగా కోపంవచ్చింది. కాని కోపపడనని మాటయిచ్చాను. కనుక కోపపడినట్లు తెలియకుండా ఒక వాడి నారాచం ప్రయోగిద్దామని 'ఆడవాళ్ళకి ఎంత సేపూ కావలిసింది అదొక్కటే' అన్నా, హేళనగా.

అంతలో పిల్లాడు లేచి ఏడుపు ప్రారంభించాడు. రాజ్యం నాకేసి తీక్ష్ణదృష్టులతో చూస్తోంది. నేనేదో మంత్రముగ్ధుడనైపోయి మెల్లిగా ఉయ్యాలదగ్గరికెళ్ళి మా అబ్బాయిని ఎత్తుకున్నాను.

'నాన్నా! అమ్మకి 'ఆకొచ్చింది' చూడమ్మా. ఎల్లావుందో అడుగు' అన్నాను మా చిట్టాడిని.

'అమ్మా! ఆయి' అన్నాడు మావాడు రెండుమార్లు.

రాజ్యం ఆనందం పట్టలేకపోయింది. కుఱ్ఱాడు నా చంకలో ఉండగానే వాడికి ఊపిరిసలుపకుండా ముద్దులవర్షం కురిపించేసి ఓరగా నాకేసి చూస్తో 'లేదురా మా చిట్టి తండ్రీ!' అంది.

'దొంగ తలనొప్పా!' అన్నాను నేను.

రాజ్యం మాటాడక ఊరికే నవ్వుతోంది.

'ఓహో! పిల్లాడిని ఎత్తుకోవడం లేదనా? అవును స్త్రీహృదయం తెలియడం కష్టమే. రేపటినుంచి యిరవైనాలుగుగంటలు అబ్బాయిని వదలిపెట్టనులే' అని మా అబ్బాయిని రాజ్యం ఒడిలో కూర్చోపెట్టాను.

—వేంకటశాస్త్రి.

# పిస్తోలు

## ౧

రాత్రి ఎనిమిదిగంటలసమయము. హాస్టలులోని గదియందు విద్యుద్దీపము వెలుగుచుండెను. ఒక యువకుడు కుర్చీయం దాసీనుడై యుండెను. ఎదురు మేజాపై నొకపుస్తకము తెఱువబడియుండెను. యువకు డప్పుడప్పుడు పుస్తకమునందు గుర్తుల నుంచుచుండెను. ఎల్ల దిశలు నిశ్శబ్దముగా నుండెను.

హఠాత్తుగా గదికవాటము తెఱువబడెను. యువకు డదరిపడెను. గదిలోనికి నవయువకు డొకడు ప్రవేశించి తత్క్షణమే కవాటమునకు గొళ్ళెము వేసెను. ఆ యువకు డటనున్న మఱియొకకుర్చీపై గూలబడెను. వానియుడుపులు ధూళిధూసరితములై యుండెను. ముఖమున భయము తాండవమాడుచుండెను. అతని దీర్ఘావయవములనుండి ముచ్చెమట లుఱులుచుండెను. యువకుడు నవయువకుని యాతురతను జూచి విస్మయముతో ప్రశ్నించెను.

'రామనాథ్! సమాచారమేమి? ఏల భయపడుచున్నావు?'

రామనాథుడు మౌనము ధరించియుండెను. కేవలము వేగముగా శ్వాసించుచుండెను.

కొంతసేపటికి 'విషయ మేమిటో వినదగినదేనా? మేము' అని మరల యువకు డడిగెను.

'సి. ఐ. డి. చేతిలో నుండి తప్పికొని పరుగెత్తుకొని వచ్చితిని.'

'(అసహ్యమును వెలిబుచ్చుచు) నీవు పట్టుకొనబడిన యెడల బాగుండెడిది.'

'సంగమలాల్! ఏల యి ట్లనుచున్నావు?'

నీ వేనో యొకదినమున పట్టుకొనబడుదువనియే. అందుచే నీ వెంతశీఘ్రముగా పట్టుకొనబడిన నంత మేలు.'

'మిత్రుడవై యిట్లు పలుకుచున్నావా?'

'నీ కార్యములే యి ట్లున్నవి. ఈ విధమున నీ బ్రిటీషుసర్కారును తల్లక్రిందులు చేయవలెనని దలచుచున్నావు. ఇంతకుమించిన మూర్ఖత్వ మింకేముండును? ఒక సామాన్యపు సి. ఐ. డి. ని చూచినంతనే నీస్థితి యి ట్లున్నది—సరి; బ్రిటీషు సర్కారును తల్లక్రిందులజేయ దలచుచున్నావు. నీ తెలివి యేమైనదో భగవంతున కెఱుక.'

'పరిణామ మేమైనను ప్రయత్నమేమో చేయుచునే యుండవలయును.'

'ఇది ప్రయత్నమా! దీనిని నీవు ప్రయత్నమందువా? ఇది బ్రిటీషుసర్కారును తల్లక్రిందులుజేయు ప్రయత్నము గాదు. ఆత్మహత్యా ప్రయత్నము. దీనిలో నీకు నిశ్చయముగా విఫలు డగుదువు.'

'ఏమైన నగుగాక! రోటిలో తలదూర్చి రోకటపోటునకు వెఱువనగునా?'

'అట్లయిన వెఱవకుము. కాని యీ దీనునిమాత్రము రక్షించుము.'

'నీవు బ్రతికే యున్నావు. నిన్నెవరిచట తినివేయుచున్నారు? (చిరునవ్వు నవ్వెను.) 'నీ విట్లు సి.ఐ.డి. యొద్ద తప్పించుకొని నాయొద్దకు బరుగెత్తివచ్చుచున్న యెడల నే నెంతకాలము సురక్షితముగా నుండగలను. నీ కింకెక్కడను చోటుదిక్కుదా!'

'మనుష్యు డాపదలయందు మిత్రులసహాయము గోరును.'

'క్షమింపుము. నీ వెప్పుడు విప్లవకారుల సంఘమునందు జేరితివో అప్పుడే మనస్నేహము సమాప్తమైనది. మన యభిప్రాయములు వేరు. ఆదర్శనములు వేరు. ఇక స్నేహ మేల భిన్నము కాకుండును?'

'సంగమలాల్! నీవిద్య, నీపోషణమును, నీజీవనమును, యే నీ అన్నయం దాధారపడియుండునో అతడు కేవల మన్యాయముగా అనుమానముపై బట్టుకొనబడి కారాగారమున నుంచబడియు, నిన్నుగూడ అనుమానించి సి. ఐ. డి. హాయిగ కూర్చుండనీయక నీవెంట

నంటియున్నప్పటికిని నీవు విప్లవసంఘములో నుండక వానియందు సానుభూతిజూపకయున్నపుడు నీవు చెప్పి నదంతయు నిజము. నాస్థితియు నిట్లే యున్నది. నా యన్నను సి. ఐ. డీ. లు పట్టుకొని జైలునం దుంచియు న్నారు. అతడు నిర్దోషియని నే నెఱుగుదును. ఈశ్వ రునకును తెలియును. అతడు జైలునకు పోగానే నా చదువు ముగిసెను. దినము గడచుట కష్ట మాయెను. నేను యెచ్చటనేని నౌకరి చేయదలచితిని—ఒకటి, రెండు చోట్ల చేయనుగూడ చేసితిని. కాని సి.ఐ.డి.ల కృపవల్ల అక్కడను ఉండజాలకపోతిని. నే నెచ్చటికి పోయిన అచ్చటికెల్లను సి.ఐ.డి. చేరుచుండును. వేట కుక్కలు వెంటబడిన కుందేలువలె నాగతి విషమావస్థ యందున్నది. ఇప్పు డేమి చేయవలెనో నీవే జెప్పుము— సంగమలాల్! నా హృదయమునందు ద్వేషాగ్ని ప్రజ్వ రిల్లుచున్నది. చీమకూడ అణగియుండ నిష్టపడదు. నే నన్ననో మనుష్యుడను.'

'ఎవడు విప్లవకారుడని అనుమానము దగులునో వానిని జాగ్రత్తతో కనిపెట్టియుండుట సి. ఐ. డి. ల పని; సి. ఐ. డి. శాఖ ఈ పనికొఱకే జీతమును బొందు చున్నది.'

కనిపెట్టియుండుటకును, వెంటబడుటకును భేద మున్నది. నీ వా భేదమును గ్రహింపలేవు. ఏలనన నీ వా యాపదలకు లోనుగాలేదు. నేను లోనైయు న్నాను. అందువలన నేను ఆ భేదములను బాగుగా ఎఱుగుదును. నేను రెండుసార్లు నౌకరిచేసితిని. సి.ఐ డి. కనిపెట్టియుండినయెడల నా నౌకరి స్థిరముగా నిలచి యుండెడిది. కాని, సి. ఐ. డి. ఏమిచేసెనో నీ వెఱుగు దువా? నేను నౌకరిగా నుండినగానిలో 'వీడు విప్లవ సంఘమునకు చేరినవాడు; వీనిని మీవద్ద నుంచుకొన వలదు' అని తెల్పెను. నే నా రెండుచోట్లనుండియు గెంటవేయబడితిని. నిశ్చింతగా నిలుచుకొని నాలుగు దినములు గడపుకొనుటకు నా కింతస్థలమేనియు లేదు. ఈగతి నన్ను పిచ్చివానినిగా జేసివేసినది. నే నిప్పు డేమి చేయుచున్నానో ముం దేమిచేయుదునో నాకే తెలియదు.

సంగమలాలు (కొంతసేపువఱకు మౌనముగా గూర్చుండి) 'నీస్థితి శోచనీయముగా నున్నదనుటలో సందేహములేదు. కాని నీ విప్పటికైనను విప్లవసంఘ ములో లేనని సి. ఐ. డీ. లకు నమ్మకము పుట్టించుము! అప్పుడే వారు నీవిషయము వదలివేయుదురు.' అనెను దానికి రామనాథుడు 'కాని నే నెచ్చటనుండగలను. నేను నీవద్ద నుండుటకు తయారుగా నున్నాను. చెప్పుము. నన్ను నీవద్ద నుంచుకొనెదవా?' అని ప్రశ్నిం చెను.

'నాయనా! ఇది కానిపని. నే నన్ననో విద్యా ర్థిని. నాకును నీకును ఏమి సంబంధము?'

'(శుష్కముగా నవ్వుచు) అందఱును ఇట్లే యందురు. నా కెక్కడను చోటులేదు......సరి నేను నీసమయ మును వ్యర్థముచేసితిని. నా కొక్కలోటా నీ ళ్ళిమ్ము. నే వెళ్ళెదను.'

రామనాథుడు ఎట్లయిన గదివిడచిపోయిన చాలునని సంగమలాలుడు తలచుచుండెను. కాన అతడు తొందరగా లేచి ఒకగ్లాసులోటా తీసుకొని నీటికొఱకు వెలు పలికిపోయెను

అతడు వెలుపలికి పోవుచుండగానే రామనాథుడు కుర్చీనుండిలేచి తనజేబులోని పిస్తోలును బైటికి దీసెను. గోడ కానించియుండు రెండుట్రంకులలో నొకదానిని జఱిపి రామనాథుడు తన పిస్తోలును పడవేసెను. తా నెప్పటివలె కుర్చీలో వచ్చి కూలబడెను.

అప్పుడే సంగమలాలు గ్లాసుతో నీరుతీసుకొని గదిలో ప్రవేశించి రామనాథునితో 'చూడు! ఎంత చల్లటినీరు దెచ్చితినో! నా నీటికూజా పగిలిపోయినది. అందుచేత యిం కొకచోటనుండి తేవలసివచ్చెను. రేపు కూజాను తెప్పించుకొందును' అని పలికెను.

రామనాథుడు నీరుద్రాగి సంగమలాలుని అభినం దించుచు 'సరి పోయివచ్చెదను' అనెను.

సంగమలాలుడు నవ్వుచు 'నీస్థితి జూచిన నాకు చాల జాలికలుగుచున్నది. కాని యేమి చేయుదును? నీవు మాత్రము యీమార్గమును వదలివేయుట మంచిదని నేను నొక్కి చెప్పుచున్నాను.'

'ఏమి కాగలదో చూచెదను. భవిష్యము నాయధీన మందు లేదు' అనిపలికి రామనాధుడు గది వదలి వెడలి పోయెను. సంగమలాలు డొకసంతోషనిశ్వాసమును విడచి తనస్థానమందు కూలబడెను.

౨

ఇదంతయు జరిగిన మరుసటిదినము ఉదయము ౬ గంటలకు పోలీసులు హాస్టలును ముట్టడించిరి. రామనాధుడు ఇచ్చటికివచ్చినసంగతి తెలిసినందున పోలీసులు సోదాచేయుచున్నారు కాబోలు నని సంగమలాలు తలచెను. రామనాధుడు తనగదిలో కూర్చుండి యుండుట ఎవ్వరును జూడలేదుగదాయని చాల సంతోషించుచుండెను. అతనిగది సోదాచేయబడినంతనే యొకపిస్తోలు చిక్కెను. పోలీసులు సంగమలాలుని రిమాండులో నుంచిరి. సంగమలాలుమీద హఠాత్తుగా పిడుగుపడినట్లాయెను. పిస్తోలు తనగదిలో కెట్లువచ్చెనో యతని ఆకళింతకురాలేదు.

పోలీసులు ప్రశ్నింపగా అతడు 'పిస్తోలు యెచ్చట నుండివచ్చినదో నాకు తెలియదు. నాయొద్ద ఎప్పుడును పిస్తోలు లేదు' అనెను.

'నీవద్ద కెవ్వడైన విప్లవసంఘపుమనుష్యుడు వచ్చుచుండునా?'

సంగమలాలునిధ్యానము రామనాధునివైపు మరలెను. రామనాధుడు నిన్న నావద్దకు వచ్చెనని తెల్పుదునా యని యువకు డాలోచించుచుండెను. కాని చెప్పుటచే మొదట; రామనాధునికి విశ్వాసఘాతము చేసిన ట్లగును. పైగా తాను విప్లవసంఘమునకు సంబంధించినవాడే నని తేలును. కావున ఆతడు 'నావద్ద కటువంటిమనుష్యు లెవ్వరును రారు.' అని చెప్పెను.

'నీవద్ద కెవ్వరెవ్వరు వచ్చుచుందురు' అని పోలీసు ఇన్స్పెక్టరు మరల ప్రశ్నించెను.

సంగమలాలు కొందఱు బంధువులపేర్లను స్నేహితులపేర్లను తెల్పెను కాని రామనాధునిపేరు చెప్ప లేదు.

'నిన్న నీవద్ద కెవ్వరైనా వచ్చిరా?' అని ఇన్స్పెక్టరు మరల నడిగెను.

సంగమలాలునిహృదయము తీవ్రముగా కొట్టుకొనసాగెను. రామనాధుడు ఇచ్చటికివచ్చినసంగతి పోలీసులకు తెలిసినదికాబోలునని అతడు భయపడసాగెను. రామనాధునిపేరు తెల్పుదునా వద్దాయని యతడు జ్ఞప్తికి తెచ్చుకొనుచునివలె నభినయించి ఆలోచింపదొడగెను. రామనాధునిపేరు దెల్పుట యనుచితముగాదని యత డాలోచించి నిశ్చయించుకొనెను. కాన నతడు ఇన్స్పెక్టరుతో 'లేదు నిన్న నావద్ద కెవ్వరును రాలేదు' అనెను.

ఇం కేమిప్రశ్నలు వేయబడలేదు కావలసినది వ్రాసుకొనిన పిమ్మట పోలీసులు సంగమలాలుని తమతో గూడ తీసుకొనిపోయిరి. వారుపోయిన తర్వాత హాస్టలులోని బాలురు తమలో మాట్లాడుకొన దొడగిరి.

మొదటివాడు :—నిన్నటిరాత్రి సంగమలాలుని గదిలోనికి యొకయువకుడు పోవుచుండగా నేచూచితిని.

రెండవవాడు :—నారూమ్‌నుండి వాడు ఒకగ్లాసు నీళ్ళు తీసుకవెళ్ళెను ఎవరికొఱకు నీళ్ళు తీసుకొనివెళ్ళుచున్నావని నే నడుగగా నామిత్రుడొకడు వచ్చియున్నాడు వానికొఱకని చెప్పెను.

మూడవవాడు:—ఈ సంగతి సంగమలాలు పోలీసులతో యేల చెప్పలేదు? ఏదో రహస్య ముండును.

'నీవు పోలీసులతోటి ఈసంగతిచెప్పక మంచిపని చేసితివి.'

'చెప్పేటందుకు నా కేమి పనిగలిగినది. సాక్ష్యములోనికి అన్యాయముగా లాగబడెదను. అంతేగాక సంగమలాలు మనమిత్రుడు గదా. వాడు చాల సజ్జనుడు! అతడు విప్లవకారుడుగా నుండునని మన కెప్పుడును సందేహముదగుల లేదు.'

'అరె బాబోయ్! ఈ రోజులలో ఎవరినిగురించి నిర్ధారణచేసి చెప్పుట బహుకష్టము.'

'పిస్తో లుండినదెచ్చట; ట్రంకువెనుక గదా! బాగు! యెచ్చటనైన యిటువంటివస్తువుల నా విధముగా నుంచెదరా? అనితలచె గాబోలు.'

'చాలా మూర్ఖపుపని చేసినాడు. ఇటువంటివస్తువల నీవిధముగా నుంచగూడదు.'

'ఈ సమయము బహు చెడ్డది. లేకుండిన యెవడిప్పుడీ స్థలములో శోధించుటకు వచ్చును?'

'ఎవడో ముసలివాని బాగుగా నటించియుండును.'

'నిన్న వానివద్దకు వచ్చినవాడు సి.ఐ.డి.ల మనుష్యుడుగా నుండవచ్చును.'

'కాదు కాదు సి.ఐ.డి.ల మనుష్యుడుగా నుండడు, సంగమలాలు సి.ఐ.డి.ల మనుష్యుడైన తనమిత్రుడని చెప్పడు.'

'మిత్రుడుగా నుండవచ్చును సి. ఐ. డి. లలో చేరియుండవచ్చును. ఈ దినములలో నెవరిని నమ్మరాదు. మిత్రులే శత్రువులుగా మారుచుందురు.'

'బాగుగా చెప్పితివి. సమయము చాలా చెడ్డది. ఏమైన నగుగాక సంగమలాలు ఆపదలలో చిక్కుకొనెను. శిక్షింపబడక తప్పించుకొనలేడు.'

'మిత్రమా! మనము కేసువిచారణ రోజులలో పోవుచుండవలెను.'

'అట్లయిన హాస్టలునుండి వెళ్ళగొట్టబడెదవా?'

3

సంగమలాలు జైలునందు తలవంచుకొని కూర్చుండియుండెను. బంధింపబడిన పిమ్మట వానికిప్పుడేకాంతవాసము లభించెను. అతడనేకవిషయముల నాలోచించుచుండెను. తనగదిలోనికి పిస్తోలెట్లువచ్చెనాయని అతడు చాల ఆశ్చర్యపడుచుండెను. రామనాథునిపై వానికి అనుమానముతగిలెను. కాని యిట్లు చేయుటలో రామనాథుని యభిప్రాయ మతడు గ్రహింపలేకపోయెను. రామనాథుడు తనగదిలో పిస్తోలుంచియుండునా? నన్ను చిక్కించుకొనుటకా? తన్ను పట్టించుటలో రామనాథునికి వచ్చు లాభమేమి? బహుశ వాడు సి. ఐ. డి. లలో గలసియుండునా? అందువలన వానికి వచ్చులాభమేమి? సి. ఐ. డి. లు ఈ విధమున నెప్పుడు కేసులబెట్టి తమకార్యసాధనముల జూపించుచుందురా? లేదు! అందఱును మోసగాండ్లు కానేరరు. రామనాథుడు విప్లవసంఘమందున్నాడని నిశ్చయముగా తెలియుచున్నది. సి. ఐ. డి. లలో జేరియుండు ననుసందేహామే వ్యర్థము. ఈ హాస్టలునందు పిస్తోలున్నందువలన నొకడుండవచ్చును. సోదాచేయుటకు వచ్చుచున్నారని తెలిసి వాడు తన పిస్తోలును నాగదిలో నుంచియుంచవచ్చును.

ఇట్లాలోచించుచుండ నతని తల తిరుగ దొడగెను. అతడు నాలోచించుట నిలిపివేసెను. ఇప్పుడు వాని కొకభ్రమ మాత్రము తొలగిపోయినది. నిర్దోషు లెవరును పోలీసులచేతులలో చిక్కరని యతనితలంపు. నేడతని యాభ్రమ దూరమైపోయెను. అతడు నిర్దోషముగా చిక్కుబడియుండునను నమ్మకము సంగమలాలునకు గలిగియుండలేదు. కాని నిర్దోషులుకూడ పోలీసులచేతులలో చిక్కవడెదరని యతడిప్పుడు నమ్మదొడగెను.

ఈ సమయముననే వాని గదిద్వారము తెఱువబడెను. ఇద్దఱు బంత్రోతులు లోప్రవేశించిరి. వారిలో నొకడు—'లెమ్ము; నీ విచారణ జరుగనున్నది' అని సంగమలాలుని పిలచెను.

సంగమ:—ఎవని యెదుట

బంత్రోతు:—అది మాకేమితెలియును. ఎవనియెదుట జరుగునో ముందు దెలియగలదు.

సంగమలాలు లేచి బంత్రోతులవెంట నరిగెను. బంత్రోతులు వాని నొకగదిలో ప్రవేశపెట్టిరి. ఆ గదిలో నొకమేజాయుండెను. దానివద్ద మూడుకుర్చీలుండెను. వానిలో రెంటియందు ఇద్దఱు భారతీయులు కూర్చొనియుండిరి. ఒకడు పాశ్చాత్యవేషములో నుండెను. మఱియొకడు భారతీయులదుస్తుల ధరించియుండెను.

బంత్రోతులు సంగమలాలుని గదిలో ప్రవేశపెట్టి వెలుపటికి వెళ్ళిపోయిరి. పాశ్చాత్యవేషమునుండినవ్యక్తి కుర్చీనిచూపుచు సంగమలాలుని కూర్చొనుడని చాల నమ్రభావముతో పలికెను.

సంగమలాలు కూర్చొనెను. అప్పుడు వ్యక్తి 'ఏమియు కష్టములు లేవుగదా' యని అడిగెను.

సంగమలాలు హృదయమందు ఆశపొడమెను 'నేను నిర్దోషినని వీరికి తెలిసినట్లున్నది. అందువలననే వీరు నాకింతగౌరవము చేయుచున్నారు.' అని

యాతడు తలచి 'కొంచెము కష్టముగా నున్నది' అనెను.

'ఇది శైలునిబంధన. కాని నీవు తలచినయెడల త్వరలో విడుదల చిక్కగలదు.'

'అవును. మీ ర్లుచేసిన బాగుండును. నన్ను చాల కరుణించినట్లు' అని సంగమలాలు తనయామాయకత్వమును వెళ్ళబుచ్చెను.

వారిలో నొకడు సంగమలాలుని ఆమాయకత్వమునకు నవ్వుకొనెను. 'అవునవును. కాని నీవు నాప్రశ్నల నన్నిటికి జవాబు చెప్పినయెడల నిన్ను విడిపించెదను.'

'అడుగుడు అడుగుడు నే నబద్ధము చెప్పువాడను కానని నమ్ముడు.'

'నీజట్టులో నెందరున్నారు? వార్ల పేర్లేమి?'

సంగమలాలునకు ఆశాశిఖరమునుండి ఒక్కతూరి నిరాశాబిలమున బడినట్లాయెను అతడు తడబడుచు 'నాజట్టు! ఏజట్టు? నా కేజట్టును లేదు.' అనెను.

'ఇదిగో! అబద్ధము చెప్పుచున్నావు. అన్నియు దెలుసును. విడుదలబొందగోరినట్లయిన అంతయు విపులముగా చెప్పివేయుము' అని కర్కశస్వరముతో నడిగెను.

సంగమలాలు నిరాశకెందసాగెను. అతనియాశలన్నియు రెప్పపాటులో పొగవలె పైకెగిరి అదృశ్యమైపోయినవి.

'నేను నిర్దోషినని ఈశ్వరునకు దెలియును. నాకేజట్టును లేదు. నేను యేజట్టునందును జేరియుండలేదు' అని దీనముగా బలికెను.

భారతీయులదుస్తులు ధరించినవాడు రెండవవానితో 'ఈవిప్లవకారులు యెంతటి ఆశ్చర్యకరమైన యభినయమును నేర్చియున్నారు.'

రెండవవాడు:—'వీరు ఆరితేరినవాడు సామమార్గమున చెల్లడు.'

వీరిసంభాషణ విని సంగమలాలునకు చాల బాధ గలిగెను. తనసత్యసంధతకు విశ్వాసపాత్రతకు వీరీయర్థము దీయుచున్నారు! మనుష్యునిపై మనుష్యునికి ఇంతటి అవిశ్వాసమా! తాను ఒకకల్పిత జట్టును, దాని కల్పితమనుష్యుల పేర్లును, చెప్పినయెడల యీ అబద్ధమును నమ్ముటకు సంసిద్ధు లయ్యెదరుగదా! కాని నిజముజెప్పి నిర్దోషులగుటయందు వీరికి నమ్మకములేదు. ఇచ్చట దోషము నొప్పుకొనుటయే సత్యత, విశ్వాసపాత్రత! మనజాల తారతమ్యము నెఱుగువాడును, ప్రపంచములో నిర్దోషియును, సత్యవంతులును గూడ నుందురను నమ్మకముగలవారును నుందురను విశ్వాసము గలవాడు వీరిలో నొకడుగూడ లేడా?

సంగమలాలుడు మౌనముగా నుండుటజూచి 'ఏమి టాలోచించుచున్నావు? నీవు ఈ వేషములతో మమ్ముల మూర్ఖులజేయలేవు. మేము మనుష్యులముఖమును జూచి వారెటువంటివారైనది తెలిసికొనగలము.'

వాని యీఅహంకారపూరితవాక్యముల విని సంగమలాలునకు నవ్వువచ్చెను. మరల అతడు వానివైపు జూచుచు 'వీడు మనుష్యుడా లేక కొయ్యబొమ్మయా! దుస్తులవలన నితడు డేవో యొకయుద్యోగి గ నగుపడుచున్నాడు. గొప్పజీతమును బొందుచుండును. అహా! ఈశ్వరా! నీమాయ గూడ అపారమైనది గదా!' అని తలచెను.

భారతీయవేషధారి:—'ఏల నవ్వుచున్నావు? ఇచ్చట వేషములతో కాలముబుచ్చుట సాగదు. మేము రాత్రింబగళ్ళు నీవంటివారితోనే కాలముబుచ్చుచుందుము.'

'మీకు నామీద నమ్మకములేక నన్ను మొదటనుండియు దోషియని నిర్ధారణచేసుకొని యున్నప్పుడు నేనేమి చెప్పదలచుటయు వ్యర్థమేయగును.'

పాశ్చాత్య:—'నిజమైనసంగతి చెప్పినయెడల మాకు నమ్మకము గలుగును.'

సంగమలాలు:—(ఉద్రేకముతో) 'నేను అహింసావాదపక్షపాతిని హింసావాదమైన విప్లవమునందు కొంచెమైనను నమ్మకములేదు కాన నాకు విప్లవసంఘముతోను, విప్లవకారులతోను సంబంధ మెట్లుండును?'

పాశ్చాత్య:—'నీవు అబద్ధము చెప్పుచున్నావు. అందుచే నీమాటలయందు మాకు నమ్మకము గలుగుట లేదు.'

సంగమలాలున కసహ్యముబుట్టి తలవంచుకొనెను. వీరితో మాట్లాడుటగూడ అవమానమని తలచెను. కాని మరల నతడు పాశ్చాత్యవేషధారిని జూచి 'నాగదిలో మీకు పిస్తోలు దొరికినది. మీరు నామీద కేసు చేయుడు. శిక్ష నిప్పించుడు. ఇంతవఱకును మీఉద్యోగధర్మమును నెరవేర్చుడు. ఇందుకు నే నేమి కోపగించుకొనను. కాని మీరు నన్ను విప్లవకారుల సంఘపుమనుజుడనని దలచుచున్నారు. పైగా నాచే అట్లు ఒప్పింప దలచుచున్నారు. ఇది కేవల మన్యాయము. దౌర్జన్యము.'

ఐరోపీయవస్త్రధారి:—'ఏమైనను సరి మేము నీకు ఆలోచించుకొనుటకు అవకాశ మిచ్చెదము. నీవు యీ విషయమై బాగుగా నాలోచించి రేపు మాకు చెప్పుము.'

సంగమలాలు దీని కేమియు జవా బియ్యలేదు.

## ౪

సంగమలాలు బంధింపబడిన నాల్గవరోజున వాని తండ్రి అతనిని చూచుటకు వచ్చెను. అతడు మరియొక ఊరిలో నివసించుచుండెను. అతనికి తంతిద్వారా సంగమలాలు బంధింపబడిన సంగతి తెలిసెను.

సంగమలాలునితండ్రి పుత్రునియెదుటకు వచ్చుచుండగనే 'పుత్రా! నీ విదేమి చేసితివి? అని కరుణస్వరముతో నడిగెను.

'నే నేమి చేసితిని! నే నేమియు చేయలేదు' అని కలవరపాటుతో సంగమలాలు ఉత్తర మిచ్చెను.

'నీ వేమి చేయనియెడల పోలీసులు నిన్ను వూరకే బంధించిరా?'

'నాగదిలో పిస్తోలు చిక్కినది. అందువలన చిక్కితిని.'

'కారణములేక పోలీసు లెట్లు బంధింపగలరని నేను చెప్పినదాని తాత్పర్యము. చాల సంతాపకరము! నీకు పిస్తోలు నుంచుకొనవలసిన యవసర మేమి వచ్చినది?'

'పిస్తోలు ఎప్పుడు ఎట్లు వచ్చినదియుగూడ నాకు తెలియదు.'

'నాకుగూడ అబద్ధము చెప్పుచున్నావు! నేను పోలీసులమనిషిని కాదు గదా?'

(సంగమలాలు ఉలికిపడి) 'అయితే మీకుగూడ నామీద నమ్మకములేదా?'

(దుఃఖముతో) 'ఎట్లు నమ్మెదను. నీవు నీ జీవితమును చెడుపుకొంటివి. నీమీద నాకెన్ని ఆశలుండెనో వాని నన్నిటిని మట్టిలో కలిపితివి.'

సంగమలాలుని కండ్లముందట చీకటి వ్యాపించెను. వానికి జైలుఖానాలోని సమస్తవ్యవహారములు తనకు విరుద్ధముగా నగుపడుచుండెను—నే నీజైలుఖానాలోనుండి నంతవఱకు ప్రపంచమంతయు నాకు విరుద్ధముగానే యుండును. ఎవడును నామాటనమ్మడు. (తండ్రితో) 'తండ్రీ! నాయెదుటనుండి కదలిపొండు. లేనియెడల నేను పిచ్చివాడనై పోదును.'

* * * *

పదునైదుదినముల పిదప సంగమలాలునికేసు విచారణకు వచ్చెను. సంగమలాలునకు విప్లవసంఘమునకు సంబంధమున్నదని పోలీసుల కేమియు ఆధారము చిక్కనందున 'లైసన్సు' లేక పిస్తోలునుంచుకొనెనని వానిమీద కేసుపెట్టిరి.

న్యాయాధికారి:—(పిస్తోలును చూపించి) 'ఈ పిస్తోలు నీదియా?'

సంగమలాలు:—'నాది కాదు'

న్యాయాధికారి:—'అయితే ఇదిఎవరిది'

'అది నాది' యని దర్శకబృందమునుండి ఎవడో అఱచెను. దానివెంటనే ఢాం! యను శబ్దము గలిగెను.

* * * *

రామనాథుడు జైలునందు బంధింపబడియుండెను. సంగమలాలు వీనిని చూచుటకువచ్చెను. రామనాథుడు సంగమలాలుని జూచి నవ్వుచూ—'ఏమి మిత్రమా! నీవు విడుదలచేయబడితివిగదా? ఇప్పుడు నీమీద ఏమియు నేరములేదు గదా?'

'లేదు! ఇప్పు డేమియు లేదు. నా గదిలోని పిస్తోలును నీవే యుంచితివని యొప్పుకొన్నప్పుడు ఇంకనూ నామీద యేముండును? కానీ ఇదంతయు నీవెందుకు జేసితివి?'

'సంగతి ఏమిటన - నిన్న హాస్టలులో కలసికొనిన

రోజున సి. ఐ. డి. నావెంటనంటియుండెను నన్ను పట్టుకొని సోదా చూచినయెడల నావద్దనుండు పిస్తోలు బయటబడునని తలచితిని. అందువలన యొకటి; రెండు దినములవరకు ఈపిస్తోలు నెచ్చటనైన మరల తీసుకొన గలుగునటువంటిచోటునం దుంచుదునాయని యాలోచించితిని. ఆఉద్దేశ్యముతో నేను నీగదిలోనికి వచ్చి పిస్తోలునుంచి వెళ్ళితిని. ఒకటిరెండుదినముల పిమ్మట మరల నేను వచ్చి పిస్తోలు తీసికొనిపోయి యుందును గాని ఇంతలో నీవు బంధింపబడితివి. నీవు బంధింపబడినసమాచారము వినినప్పుడు నాకు చాలదుఃఖము గలిగినది. నిన్ను తప్పింపవలయునని కోరిక గలిగినది. కాని సాహసింపలేకపోతిని, నీకేసు జరుగుచుండెడిదినమున నే నిక నుండలేకపోయితిని. నేను దర్శకబృందముతో కలసి కోర్టురూమునందు ప్రవేశించినపుడు 'అది నాది' అని చెప్పితిని.'

సంగమలాలు :—'కాని పిస్తోలును నీవు యెవరివైపు కాల్చితివి ?'

రామనాధుడు :—'ఎవరివైపును గాదు. కప్పువైపున కాల్చితిని'

'ఏమి ?'

'నావద్ద పిస్తో లుండెను. కాన దాని నుపయోగించుటకోఱకు—అది కాలినప్పుడు నాకెంతటి యానందము కలిగెను. గొప్పకల్లోలము జరిగినది. న్యాయాధికారి తనకుర్చీనుండి దొర్లిపడెను' అనిచెప్పి పక్కున నవ్వెను.

'నీవు ఎవ్వరిని చంపక మంచిపని చేసితివి.'

'నీమాటలను చాల విచారించిచూచితిని. కడపట ఈనిరపరాధులైనయుద్యోగులను చంపుటవలన ఏమియు లాభములేదనియు, వీరత్వముగా దనియు, యీవిధమున మనము దేశమున కెట్టి లాభమును చేకూర్పజాలమనియు తలచితిని. అందువలననే నేను పిస్తోలును కప్పువైపు కాల్చితిని.'

'నీవు పరుగెత్తనుగూడ లేదు! నీవు తలచినయెడల వెళ్ళిపోయి యుందువు.'

'పరుగెత్తిపోవుట యెక్కడకు? రాత్రింబగళ్ళును చింతాగ్రస్తుడనై ప్రాణముల నరచేతిలో బెట్టికొని ఇచ్చటచ్చటకు తిరుగాడవలసియున్నది. ఆకలిదప్పులకు చావవలయును. కూర్చొనుటకును ఇంతపాటిస్థలము లేదు. నిద్రించుటకును ఇంతపాటిచోటు లేదు. ఇంతపాటి స్వతంత్ర జీవనముకంటె ఈజైలులోని జీవనమే నూరురెట్లుమేలు! సమయమునకు అన్నము, నీరు, నిద్ర దొరకుచుండును. ఇది నిర్భయమైనట్టి నిశ్చింతమైనట్టి జీవనము.'

'నీవు స్వయముగా నిన్ను చిక్కించుకొని నన్ను విడిపించితివి. ఇందులకు నేను ఎల్లప్పుడు నీకు కృతజ్ఞుడగా నుండెదను.'

'మనస్నేహపుబాంధవ్యమువలన ఇట్లుచేయుట నా కర్తవ్యము. పైగా నేను నాజీవితముపై విసిగిపోయి యుంటిని. జైలులోనే సుఖముగా కూర్చొనుటకు వీలుండునని తలచితిని. నీవు నాకు కృతజ్ఞుడ వగుటకు ఏమియు కారణములేదు. కాని మిత్రమా! నేను కోర్టురూమ్‌యొక్కదృశ్యమును యెప్పుడును మరువను —చాల ఆనందముకలిగినది!'—అని చెప్పి పకపక నవ్వసాగెను. (అనువాదము)

—వాకాటి రాధాకృష్ణయ్య శ్రేష్ఠి.



# శాంతిసమరస న్నాహము

### ఉదంకుడు

అక్రోధనా! నిరపరాధులగు వీరి నిట్లు శత్రుఘ్నులచే సంహరింపఁ జేతకాని వారియట్లు ఊరకుండఁ దగునదే? వారిపాటి శక్తి సామర్థ్యములు మనకు లేకపోయెనా? ఖడ్గమునకు ఖడ్గమే సమాధానము జెప్పవలయును గాని నీ కారుణ్యము సరిపడునా?

### అక్రోధనుడు

ఉదంకా! ఏల భ్రమపడియెదవు? మనవారల యప్రతిహతశౌర్యము నే నెఱుంగనా? మనము వీరులమని నమ్ముటయగు మనుట లేదు, వారికి భయపడియుగాదు ప్రతీకారము సేయకుండుట. శౌర్యవంతులమని యెఱింగియుండియే సమరంబున జేసుడంటిని. శక్తియుతులమని దెలిసియే వారి క్రౌర్యమును సైపుడంటిని. ఉదంకా! బలసమన్వితులమగుటకు సార్థకము పరోపకారము సేయుట గాని యొరులం బరిమార్చుట యగునే? వ్యాఘ్రమున్నకుండు తీక్ష్ణనఖంబులు; మహిషంబునకు గల్గు సునిశిత శృంగంబులు నిజప్రాణ రక్షణమునకేగాని పరపీడనమునకు గాదుగదా! అవి బలాన్వితములని తమ మార్గము వీడివచ్చి మనల బాధించుచున్నవా?

మృగములకు రక్షణోపాయము గల్పించిన దయామయుండు మనకేల యొసంగకుండు? తీక్ష్ణనఖంబులు లేవని మనము ఖడ్గముల ధరింపనేల? శృంగములు లేవని మనలములను దాల్పుదుమా?

ఉదంకా మృగములకు లేని యాత్మ మనకుగలదు. అదియే మన రక్షణోపాయము. దాని దెలియలేక యీ యాయుధము నాశ్రయించుటేల? నీ యాత్మను నీ వెఱింగితివా దానిని మించినకవచము లేదు. బ్రహ్మాండంబు సృజించిన భగవంతు డిచ్చిన సాధనముకంటె నీచేసినవి ప్రబలంబులగునే? ఉదంకా! ఆ తలపులు మానుము. వారేమి చేసినను నీవు క్రౌర్యము పూనకుము. నిన్ను బంధించిరా పట్టువడుము బాధించిరా ప్రసన్నుడవుకమ్ము. మన రిపుల జయింపగల్గు నస్త్రమిదియే. దీనింబొందియే సమరమున జేసుము.

—వేమూరి శ్రీనివాసరావు బి ఏ.,బి ఎల్.

# కన్నీళ్లు

ఇది తమోనీలయామిని—ఈతమస్సు
తెఱలు వడకెడి చలిగాలి తరగలందు
కలతవెలుగులలో తారకలు లయించు
ప్రాయుకొన్నది గంభీరమధురశాంతి
అక్కటకట!
ఊరకే జలధారల హోరుమనుచు
మెడ్చియేడిచి అలసిపోయినది బ్రతుకు
శ్రావణవినీల జలధరస్వామివోలె
గడచిపోయినరోజులు కదిపి కదిపి
కష్టగాథల నంతన్ను కలచి కలచి
స్మృతిపథమ్మున ఆరని చిచ్చులుమిసి
ఈమహాబాధ నిదుర లేచినది నేడు
కలవరము లేని యీ నిశాగర్భమందు
అలసి నిద్రాణమైనటు లడగియున్న
హృదయదుఃఖాల నెవరొ్ఘి రేపినారు?—

—కస్తూరి రాజా మాణిక్యము.



# జన్మనిరోధము

సృష్టిలో ప్రతిజాతికిని కొంతకొంత మితి యున్నది. పాము నూరేసి గ్రుడ్లు పెట్టినను పులి మూడేసి పిల్లల నీనినను ఉపయోగకరములైన గోవులు, నశ్వములు మొదలైన వానికంటె అవి అభివృద్ధి నొందుట తక్కువగుచున్నవి. తొలకరివానకు గోడలకు జేగురు వేసినట్లు తోచించు రోకలిబండలును, నొకొక్క గాలికి ప్రపంచమంతయుఁ గంబళ్ళు పఱచినట్లు కనిపింపఁజేయు గొంగళిపురుగులును మఱియొక ఋతువులో మఱియొక గాలికి మాయమగుచుండును. సృష్టిలో నల్పప్రాణులు వానికంటె బలవత్తరజంతువుల కాహారముగా వినియోగపడుటచే వానిసంఖ్య యథాయోగ్యమగు స్థానము నొందుచుండును.

కాని మానవుడు తనకంటె ఉత్తమజాతి సృష్టిలో లేని కారణముచే నితరజంతువులనన్నిటిని దనకు లోబరుచుకొని బలవన్మరణాపాయములేక యోగ్యుడైనచో ప్రపంచసేవ చేయుచు నయోగ్యుడైనచో నిరుపయోగియై బొమ్మజెముడు మొదలగు ముళ్ళకొంపలవలె జనకంటకుడగుచున్నాడు. అనగా భూమికి బరువగుచున్నాడు.

కొన్నికొన్ని సమయములందొకొక్కజాతి తన యుపయోగమునకు కావలసినకంటె నెక్కుడుగా నభివృద్ధిపొంది తాను దుఃఖమనుభవించి ప్రపంచమునకును దుఃఖభాజనమగును. ఇది యెట్లు తెలియుననగా బలవంతులు విద్యావంతులునైన జనులు సంఘసేవచేయుట కవకాశములేక వ్యర్థజీవనులై దుఃఖించుటయును, నాహారము నిమిత్తము దుఃఖించుటయును సంభవించినప్పుడు వారు సృష్టిలో తమ యథార్థసంఖ్య నతిక్రమించిరని యూహింపవలసియున్నది. అప్పుడే భూభారము సహింపరానిదై భగవన్మాయవలన యుద్ధములు, మహామారి మొదలగు జాడ్యములును సంభవించి 'పెరుగుట విరుగుటకొఱకే' యను ధర్మము ప్రతిపాలింపబడును. ఇట్టి పరిస్థితులలోనే భగవంతుఁడు శ్రీకృష్ణాద్యవతారములనెత్తి దేవదానవులకును కురుపాండవులకును యుద్ధములు పురికొల్పి భూభారము నపనయించినట్లు పురాణములు ఘోషించుచున్నవి; మానవదేహములో నొక కాలో, చేయియో తలయో తన యథార్థపరిమితి నతిక్రమించి వృద్ధిపొందినచో నది రోగకారణమై చికిత్స చేయబడునట్లే యీశ్వరదేహమైన సృష్టిలో నొకజాతి యతివృద్ధి నొందినచో నది దోషమై భగవంతునిచే సంస్కరింపబడును.

ప్రస్తుతము భూమి పాశ్చాత్యులచే పాలింపబడుచో, నరులకపాయకరములగు క్రూరజంతుజాలము సంహరింపబడి ఘోరారణ్యములు జననివాసయోగ్యములయి, మహామారి మొదలగు జాడ్యములు సైతము పారిశుద్ధ్యసంఘములచే నుపశమింపబడి, జనసంఖ్య నభివృద్ధిచేసినది. అందుచేతనే పశువులచే లాగబడు బండ్లు మొదలైన వాహనములు మనుష్యులచే నడపఁబడుచున్నవి. పందులు కుక్కలు మొదలగు జంతువులుచే యదగిన స్థలసమ్మార్జనము మనుష్యులచే జేయబడుచున్నది.

మఱియు బి. యే. యమ్. యే. డిగ్రీపరీక్షలలో నుత్తీర్ణు, లెందులకు నక్కఱకురాక గ్రాసవాసోదైన్యము ననుభవించి దుఃఖించుటకు నిదియే కారణము.

కావున జనసంఖ్యను ధర్మవిధమున యథార్థస్థానమునందుంచుట యొక్క విధియై యున్నది. ఇట్టి పరిస్థితులలోనే యాంజనేయుఁడు, శ్రీ శుకుఁడు భీష్ముఁడు

మొదలగువారు బ్రహ్మచర్యము నవలంబించిరి. పూర్వ యుగములందు గృహస్థులు కొంతకాలము జరిగినపిదప సన్యసించుచుండిరి. నేటికిని హిందూసుందరు లొక పర్యాయము భర్తృవియోగము కలిగినచో వైధవ్య మను సన్యాసాశ్రమము నవలంబించుచున్నారు.

మఱియును జన్మనిరోధమునకు మఱియొక కారణ మున్నది. సంఖ్యకంటె సారము ప్రధానమైనది. ఆకాశ మునందలి నక్షత్రము లన్నిటికంటెను జంద్రుడు యామినీ విలాసమునకు ముఖ్యము. కీసఅరటిచెట్టు గెలలో నాలుగేసివందల కాయలు యున్నను తక్కువకాయలు గాయు బొంతయరటిచెట్టునే తోటలందు విశేషముగా నాటుదురు. మఱియును వంగవఱుగు తయారుచేయు టకు చెట్టున కొకటి రెండు కాయలుమాత్రము నిలిపి తక్కినకాయలను గర్షకులు పెరుగనీయరు. తాళవృక్ష ములను గాయనీయక కల్లుదీయుచుందురు. అప్పుడప్పు డాచెట్టు నొకసారి కాయనిచ్చిరేని యది విశేషముగా సారవంతములైన కాయలుగాయును. మఱియును సేద్య గాండ్రు పొలముల నప్పుడప్పుడు బీడుపెట్టి వ్యవసా యము చేయునప్పుడే యవి చక్కగాఫలించును. ప్రతి సంవత్సరము నొకపంటనే పండించినను జేను చెడిపో వును. దోహదముచేసి విశేషముగా బండించు పంటలును దుర్బలములై రుచిలేక యుండును. ప్రశస్తములైన యంటుమామిడిచెట్లను పూతపట్టిన యొకటిరెండు సంవ త్సరములు కాయనీయరు. కాయనిచ్చినచో నా చెట్లు పుల్ల విఱిగిపోవును.

కాని ప్రపంచములో వీనియన్నిటికంటె అత్యుత్తమ మైన మానవసృష్టిలో నీనియమములంతగా హిందూ దేశమునఁ బాలింపఁబడుటలేదు. పదునారు సంవత్సర ముల బాలునకు బదునాలుగేండ్లబాలికను బెండ్లిచేసి కాపురములుచేయించు దురాచార మీదేశమున విశేష ముగాఁగలదు. పరిపూర్ణ యౌవనము రాకమునుపే కాపు రముచేయు దంపతులను దుర్బల సంతానముకలిగి నశిం చుటేకాక వారికి నైతము మాయుఃక్షీణ మగును. ఇట్లే యిరువది సంవత్సరములపైన వివాహమై నూత్నదంప తులవలె గాపురములుచేయు గృహస్థులకు దుఃఖములు కలుగును. కావున నకాలగార్హస్థ్యమువలెనే యతికాల గార్హస్థ్యమును వర్జనీయము. ఇట్టిధర్మములు పరిపాలిం చుటచే జనసంఖ్య కొంతవఱకు మితమగుటయు, నున్న వారి కాయుర్వృద్ధియు నగును.

ప్రతిసంవత్సర మొక బిడ్డనుగను స్త్రీకిని దత్సంతాన మునకును బలహీనత హెచ్చుగానుండును. ఒకొ్కక్కప్పు డెడపిల్ల పాలబీదపడి చనిపోవుటయు దటస్థిం చును. ఇట్టి వైపరీత్యమును దొలగించుటకు బ్రయత్నిం చుట స్త్రీపురుషుల కర్తవ్యము. తమ విషయాసక్తిచేఁ దమ గారాబుపట్టిని జంపుకొనుట యెట్టి నికృష్ట కార్యము! ఎట్టి రాక్షసకృత్యము.

మఱియును యాచనవలన జీవించు బ్రాహ్మణాదు లును, తమ సంస్థానములు విభాగములై తమసంతతి బీద పడనొల్లని రాజకుటుంబముల వారును మితసంతాన వంతులై యుండుట యందము. తమవిషయ లాలసత్వ మునకై యనేకజీవులను తృణ్ముల జేసి యలయించుట పశుధర్మము. అందులకే పూర్వము జరత్కారుమహా ముని ఒక కుమారుడు కలుగువఱకే కాపురముచేయు నరతుపై నొక నాగకన్యను వివాహమై కుమారసంభవా నంతరము తపస్సునకై లేచిపోయెను. కుచేలుడు ధనా ర్జన మార్గమును విడిచి తపస్సుచేసికొనుచు సంతాన విషయమున మాత్రము మనవలెనే యుండుటఁజూచి భార్య యనేక నిష్ఠురాలాపములాడి యాతపస్సును మా న్పించి కృష్ణునొద్దకు ధననిమిత్తము పంపించెను. బుద్ధిమంతుఁడైన కుచేలుఁడు భార్య హితోపదేశము నంగీకరించి తపస్సుకంటె శిశుహింసా నివారణమే ప్రశస్త ధర్మమని తెలిసికొని బిడ్డల కుపాధి యేర్పరచి విరక్తుడై తిరిగి తపస్సుచేసికొనెను. కావున భార్యల కెనమండ్రేసి బిడ్డలనప్పగించి తగిన జీవనోపాధిలేకుండ జేసి, సన్యసించుటగాని, యుద్ధములలో రాజులనెది రించి మరణించుటగాని కారాగారావాసము నభిలషిం చుటగాని యప్రశస్తమేయగును. ప్రతిసంఘ సేవకుడును పరిమిత సంతానవంతుఁడుగా నుండవలెను. లేని యెడల నూరకార్యములఁ జేసిరైనను శిశుపోషకుడు కావలసి వచ్చును. పిల్లలుగలవాడని తన్నే యందఱును జాలితో జూతురు.

పూర్వకాలమున సంతాననియమము బ్రహ్మచర్యము వలనను మనోనిగ్రహము వలనను, హఠాదియోగముల వలనను పాలింపఁబడెడిది. ఇప్పుడు కలియుగమున దేహమనోదుర్బలులగు మానవుల కవి క్లేశకరము గానుండి యసాధ్యము లట్లు గన్పట్టుచుండుటచే, హిందువు లౌషధాదులచేతను, పాశ్చాత్యులు శస్త్రచికిత్సలచేతను, మఱియు ననేక కృత్రిమ సాధనములచేతను కావలసినప్పుడు బిడ్డలను గనుటయు లేనియప్పుడు మానుటయుఁ జేయుచున్నారు. అనేక పుత్రీపుత్రులున్నపుడు కొందరు దురదృష్టవంతులును, గొందరు బాలవితంతువులును గొందరు దీర్ఘరోగులునై యావజ్జీవము దుఃఖించుట కవకాశముండును. కొందరు బీదలై పరాన్నభోజనము నాశించి దైన్యము పాలుకావలసివచ్చును.

ఇట్టి విపత్తుల నివారించుటకు ప్రయత్నించుట మానవధర్మము గావునఁ దమకు సాధ్యమైన నిర్దుష్ట మార్గముల సంతాననియమమును బాలించుటకు ధర్మజ్ఞులు కడంగుదురు గాక.

—జె. శ్రీరామమూర్తి, బి. ఏ. యల్. టి.

## కవిత

కవిత్వము సౌరభమువంటిది. ఒకానొక పుష్పస్వరూపమును వర్ణింపగలము కాని దాని తావి 'ఇట్టిది' అని నిరూపింపనేరము కదా? ఉదాహరణమునకుగాను ఒక మల్లెపువ్వు. మల్లెపువ్వునే ఎఱుగనివానితో మనము మల్లెపూవును గూర్చి చెప్పవలెననుకొందము. అప్పుడు మల్లెపూవు రూపమును, రంగును, బరువును, నిర్మాణమును మొదలగు విషయములను గూర్చియే చెప్పగలము కాని దాని సౌరభము 'ఇట్టిది' అని మనము నిర్ధారణ చేసి చెప్పనేరము కదా! అట్లనే ఒకానొక కవిత్వములోని ప్రభావమును.

కవిత్వము చిదానందస్వరూపము. అట్టి ఆనందమును చిత్రకారుడు రంగులద్వారా ప్రచురించును, కవి భాషలో ప్రకటించును, నటకుడు ఆడును, గాయకుడు పాడును, అట్టి ఆనందమును మనము గ్రహింపగలమే కాని నిర్ణయింపలేము. అట్టిప్రభావము కలిగియున్నదే ఉత్తమకళ. అట్టికళయే కవిత్వమును. పదములకూర్చి భావమును కోల్పోయినను భావముల కనుగుణమగు పదములు లేకపోయినను ఉన్నతకవిత్వ మనిపించుకొనదు. పద్యములు కేవలపదలాలిత్యము తోడనే సింగారించుకొని తాత్కాలిక జీవితము కలిగినను కలుగునోపుకొని, స్వతంత్రభావములతో నలరాలి 'పదవాక్యప్రమాణము'ల కోల్పోయినను అట్టికవిత్వము చిరస్థాయియై విరాజిల్లక మానదు అజంతా చిత్రములును, త్యాగయ్య కీర్తనలు, తిక్కనార్యుని ప్రతిభయు జగద్విదితములు.

కవిత్వము వాచ్యము వ్యంగము అని ద్విధాబప్పును. వాచ్యమగు కవిత్వము చదువరులకు వారసత్వపు ఆస్తివంటిది. వ్యంగము చమత్కోక్తి గడించిన రాగినాణెము. ఇదియే భవభూతి కాళిదాసులలోని తారతమ్యమును.

ప్రపంచమున నేడు వ్యంగమును కోల్పోని భావపూరితమగు కవిత్వమున్నతస్థానము నలంకరించుచున్నది, అభివృద్ధి ప్రపంచవిధానమునకు మూలాధారము. అట్టి అభివృద్ధి మంచియందును చెడుగునందును ఉండును. అభివృద్ధికూడ ఆంధ్రకవిత్వమందు కలదు. కేవలము ప్రణయమే తిలకముగా ధరించుచు పదిపదిహేను పడికట్టురాళ్ళవంటి పదముల బుజానవైచుకొని దిగుచున్నను భావపూరితములగు కవిత్వముం దభివృద్ధినొంది, ఆంధ్రభాషామతల్లి యున్నతపదముల నలంకరించుచుండుట సంతోషదాయకము.

—ఆలమూరు రాజగోపాలరావు, ఎం. ఏ.

# అర్థశాస్త్రము : వాంఛలు

అర్థశాస్త్రము మనదేశమునకు క్రొత్తగాదు. కాని మన యర్థశాస్త్రములు సాంఘికములుగాక రాజకీయములు. ప్రత్యేకము రాజకుమారుల పాఠ్యగ్రంథములు. కౌటలీయార్థశాస్త్రము, మనుస్మృత్యాదులందలి యార్థికప్రకరణము లిట్టివే. అర్థశాస్త్రము రాజనీతిశాస్త్రమందు లీనమైనది. రాజెట్లు ధనమార్జింపవలసినదియు నెట్లు వ్యయపరుపవలసినదియు దెలిపిరేకాని యర్థోత్పత్తి, సంఘమునకు దానితోడి సంబంధమును మనవారు వివరింపరైరి.

పాశ్చాత్యులు దీనిని 'పొలిటికల్ ఎకానమి' అనెదరు. 'ఏకానమి' అనగా తక్కువవ్యయముతో నెక్కువ లాభమునుదీయుట. కాలము, శక్తి, ధనము వీనిని సాధ్యమైనంత స్వల్పముగా వ్యయపరచి యమితలాభమును బడయగలిగెనేని అది 'ఏకానమిక్ యాక్షన్' అందురు. మానవు డుత్పత్తిసాధకములను జాగ్రత్తతో వినియోగపరచి స్వల్పవ్యయముతో నధికలాభమును దీయుటయే 'ఏకానమి' అందురు. వారు దీనికొక విశేషణమునుగూడ చేర్చిరి. 'పొలిటికల్ ఎకానమి' అనగా జనసంఘము తమ శక్తులను ఉత్పత్తియందును, వ్యయపరచుటయందును, సేకరించుటయందును, ఎట్లు వినియోగింపవలసినదియు దెలుపు శాస్త్రము. 'ఏకానమి' అనునది కేవలము కుటుంబ సంబంధముగా గ్రీకుపండితులచే తలంపబడెను. కాని యిటీవలివారు కుటుంబమునకే కాక జాతి (నేషన్) కత్యావశ్యకమని తెలిపికొనిరి. 'పొలిటికల్' అను పదమునకు రాజకీయమను నర్థమున్నను 'పొలిటికల్ ఎకానమి' అనగా సాంఘికార్థిక చరిత్రమనియే భావము.

నేటి యర్థశాస్త్రమును సూక్ష్మదృష్టితో బరిశీలించిన యీ క్రిందివిధమున వివరింపనగును

అర్థశాస్త్రమున మానవుడు తన వాంఛలను దీర్చుకొనుటకై యొనరించుపనులను వివరించునది. యంత్రాగారములు, వాణిజ్యము, కృషి, సేవకావృత్తి — యివి యవి యననేల జీవనాధారమగు ప్రతిపనియు నేదియో యొక వాంఛను దీర్చికొనుటకే. కావున మనుజునకును వాంఛలకును గల సంబంధమును నిర్ణయింపదగును.

ఆర్థికవాంఛలు :— ఆర్థికదృష్టితో జూచిన వాంఛను దీర్పగలుగు ప్రతివస్తువు నుపయోగకరమే వాంఛలు హెచ్చుకొలది మానవునకు వలయు వస్తువుల సంఖ్య హెచ్చుచుండును. అందులకై యాతడు శరీర మానసికశక్తుల నధికముగా వినియోగింపవలెను. దాన దేశము భాగ్యసంపన్నమగును. పై సంగతులను బట్టి చూచిన వాంఛలు హెచ్చుకొలదిని దేశము భాగ్యసంపన్నమగుననియు వాంఛ లధికములగుటకు నాగరకతయే కారణమనియు దెలియుచున్నది. నాగరకతకును వాంఛలకును గల సంబంధమేమి? అనాగరికుడు తన పూరిగుడిసెతోను మానసంరక్షణకు మాత్రమావశ్యకమగు నల్పవస్త్రముతోను నాగరికులకు సహ్యముగాని యాహారముతోను ప్రాణధారణమును మానరక్షణమును నొనర్చుకొనును. కాని నాగరికు డట్లుకాదు. అతని వాంఛలనంతములు. నాగరకప్రపంచమున నేడు మనము గాంచు మేడలు, సౌధములు, ఉద్యానవనములు, క్రీడాసరోవరములు, బండ్లు మోటారులు, యంత్రాగారములు, రైలుబండ్లు, నాటకశాలలు, సినీమాలు, మొదలగునవియు, దేహశీతబాధానివారణార్థము గాక విలాసమునకు ధరించుదుస్తులు మొదలగునవి నానాటికి పెరుగుచుండుటకు మానవునివాంఛయే కారణము. అతడు వాంఛించెనేని శ్రమనుగణింపక సాధ్యమగు ప్రతివస్తువును సాధింపగలుగును.

వాంఛలకుగల రెండవ స్వభావము వాంఛల పరిమాణమునకు మితముగలదు అర్థశాస్త్రజ్ఞున కిది మిగుల ముఖ్యమైనది. దీనివలననే యాతడు వాంఛితముల విలువ గనుగొనగలుగుచున్నాడు. మనుజుడు కోరినవస్తువు

లకో కొంతభాగ్యము లభ్యమైన నాతనివాంఛ పూర్తి యగును. అతడు వాంఛించునవన్నియు లభ్యమగుటకు వీలుగలదు. అలభ్యములగువానిని వాంఛించుటకాని యట్టి కోర్కెగల్గినను దానియందు తదేకధ్యానముగాని గల్గుట పొసగదు. గావున వాంఛలన్నియు సాధ్యములే. వానిని సాధింప శక్తియుండును. వానికి మితము గలదు. ఆకొన్నమానవుని యాకలిదీరుటకు కొంత (ఇంతయని మనము 'సుమారు'గా చెప్పగలపరిమాణము లేక యాతని యాకలిదీర్పజాలినంత) ఆహారము చాలును. దప్పిగొన్నవాని దప్పిదీర్చుటకు కొంతజలము చాలును. మొదటిముద్దకు గాని మొదటిగ్రుక్కకుగాని యాతని వాంఛ యధికమగును. అనగా తీవ్రత దాల్చును. కాని క్రమక్రమముగా తృప్తిగలుగువరకు నాతని వాంఛ తగ్గుచు దృప్తియగుపిదప నశించును. తృప్తిగల్గినవెనుక వానియెడ నాదరముండదు. పిదప నాతని బలవంతముగా తినిపించినను త్రావించినను అతనికి సౌఖ్యము గల్గుటకు మారు వేదనయు, దుదకు ప్రాణాపాయమును సంభవించును. దాహములేక మరణించునట్లే ఎక్కువగా త్రాగుటచేతగూడ మరణింతురు. పూర్వకాలపు యూరోపునందిదియొక విధమగుశిక్ష.

ప్రకృతిసిద్ధమైనవాంఛలకు తుది నిర్ణయించుట చాల సులువు. ఆకలి, దప్పిక, చలి మొదలగునవి యిట్టివి. కాని యస్వాభావికవాంఛలకు తుది నిర్ణయించుట చాల కష్టము. కొంతయాహారముతోను కొంత నీటితోను ప్రకృతిసిద్ధమగు వాంఛను దీర్చగలుగుదుము. కాని యొక విలాసవతికి భూషణములపైగల వాంఛయు నొక యలంకారప్రియునకు వస్త్రములపైగల వాంఛయు నొకలోభికి ద్రవ్యముపైగల యాసయు నిర్ణయింపగలుగుట కష్టము. ఐనను వీనికిగూడ మితిగలదు. కాని యట్టిస్థితి కొంతకాలమునకు గాని రాదు. ఒక్కొక్క నూత్నభూషణము, నూత్నవస్త్రము, ద్రవ్యము వాంఛను తగ్గించును. ఇతరవిషయముల నెట్లయినను ద్రవ్యకాంక్ష నశించునా యనుప్రశ్న కలుగవచ్చును. ఆవాంఛ నశింపజాలదు. కారణమేమన వివిధవాంఛాసిద్ధి కాధారమగుటచేతనే ద్రవ్యము వాంఛింపబడుచున్నది. ఒకవిధమగు వాంఛకొక వివిధములు ననేకములునగు వాంఛాసముదాయమును దీర్పగలిగియుండుటచే ద్రవ్యవాంఛ శమింపజాలదు కాని దానియందలి ప్రియము మప్రియముగా గాక నిరసనభావముతో గణించుటయే యీ వాంఛకవధి. ఒక కోటీశ్వరునకును ఒక పేదవానికిని తమకు లభించిన యొకనాణెము విడ తలనొప్రభేదమును బోల్చిచూచిన నీవిషయము విశదమగును.

స్వాభావిక అస్వాభావిక వాంఛలకు చాల భేదము గలదు. స్వాభావికవాంఛలు మానవజీవనమున కావశ్యకములు. అస్వాభావికములు మానవుని భోగపరాయణతకు చిహ్నములు, నాగరకతాసూచకములు. మొదటి తరగతి వస్తువులధర యెంత హెచ్చినను వాంఛస్థిరముగా నుండును. తవ్వెడుబియ్యము ధర అణాయైనను వరహాయైనను చేత నైకమున్న కొనితీరుదురు. ద్రవ్యము లేకున్నను వాంఛ శమింపదు. అస్వాభావిక వాంఛలట్లుగాదు. ఒకరూపాయి విలువగల 'ఆటోడిల్బకోర్' సెంటు రెండురూపాయలైన కేవల భోగపరాయణులు దక్క సామాన్యులు వాంఛను మళ్ళించుకొనగలరు. వీనియెడ వాంఛ స్థిరముగాక చంచలము.

వాంఛలలో నొండొంటికి పోటీగల్గుట మూడవ గుణము ఇట్టి సందర్భముల నొకవాంఛ నశించినగాని రెండవవాంఛ విజృంభింపదు. తరచుగా నూతనవాంఛ నశించిన వాంఛకంటె * యుత్తమముగానుండును. ఆముదము నుపయోగించుటమాని కీరసనాయిలు ఉపయోగించుట దీనికి దృష్టాంతము. విదేశములందు ప్రజలలో త్రాగుడు దురభ్యాసమును మాన్పుటకై కాఫీ, టీ మొదలగువానిని వారికి సులువుగా దొరకునట్లొనర్చి ప్రయత్నముల చేయుచున్నారు. పేక, జూదము మొదలగునవి కేవల ద్రవ్యాపేక్షతో నాడునట్టివారు క్రమముగా శిక్షాస్మృతివిధేయములగు మార్గముల ద్రవ్యాన్వేషణ తత్పరులగుచున్నారు.

---

* ఉత్తమమనగా నారోగ్యవిషయకమున నని కాదు. ధర స్వల్పమగుటయు, శ్రమతక్కువగుటయు, ప్రస్తుతకాలపుటుపకరణముల కనువుగా నుండుటయు, ఆర్థికదృష్టినిజూచిన యుత్తమమని నాయభిప్రాయము,

ఇదియు. నార్థికశాస్త్రజ్ఞునకు మిగుల ముఖ్యము. ప్రత్యామ్నాయసూత్రము (లా ఆఫ్ సబ్‌స్టిట్యూషన్) నకిదియే యాధారము.

వాంఛకుగల నాల్గవస్వభావము. ప్రత్యేకముగా ప్రతివస్తువును వాంఛనీయమయ్యు అధికమగు తృప్తి గల్గుటకు కొన్నివస్తువులు కలిసిననేగాని పొసగదు అవి గుంపులుగుంపులుగా నుండును. ఆహారముతోబాటు వివిధములగు వస్తువు లావశ్యకము యూరోపియనులకు నాగరికత హెచ్చినకొలదిని బల్లలు కుర్చీలు గాజు సామాను కత్తులు (రొట్టెకోసికొనునవి) యావశ్యకము లైనవి. మనకుకూడ పీటలు మొదలగునవి వాంఛనీయములగుచున్నవి. కేవల మాహారముతో మనము తృప్తి జెందజాలము. ఆ యాహారము మనకు తృప్తియొసంగుటకు వివిధములగు పదార్థము లావశ్యకము.

వాంఛకుగల యైదవస్వభావము. అస్వాభావిక వాంఛకూడ కొంతకాలమున కభ్యాసవశమున ప్రకృతిసిద్ధమగు వాంఛవలెనే విడువరానిదగును. పొగాకు, తాంబూలము, కాఫీ, టీ, నల్లమందు మొదలగునవి యిట్టి తరగతిలోనివే. పూర్వ మలవాటులేని కొన్ని మార్పులు (దుస్తులు మొదలగునవి) నేడువిడరానివై యున్నవి. ఈ యలవాట్లవలన మానవునకగు వ్యయము హెచ్చుటవలన నాతడు మానసిక శారీరక శక్తుల నధికముగా నుపయోగింపవలసియుండును. ఇదియుగాక కూలీలు మొదలగువారికి వేతనము పెరుగుచుండును. వాంఛ మొట్టమొదట భోగపరమయ్యు కాలక్రమమున విడువరానిదగుచున్నది. అది తరతరముల మానవులకావశ్యమగుచున్నది. పైన నుదహరించిన మూడవకారణమున వాంఛలలో పోటీగల్గిన తరతరములనుండి వచ్చుచున్న యభ్యాసమైనను తగ్గుట కవకాశముగలదు. * అనాగరికస్థితిలోని మానవున కెడబాయరాని రాతి పనిముట్లు నేడు కేవలము వినోదమాత్రములై నిష్ప్రయోజనములగుచున్నవి. బలీయమగు మహోకవాంఛ కాని, మిగుల నుపయుక్తములగు నూతనోపకరణములు గాని యాతని మొదటివాంఛ నణపగలవు.

—ఆకవిల్లి నరసింహాచార్యులు బి. ఏ.

* వాంఛాపరిమాణము నిర్ణయించుట కష్టము. వాంఛగల్గినవెనుక వస్తువుపయోగింపబడు నా వస్తువు లభించినవెనుక వాంఛగల్గునా యను ప్రశ్న పుట్టును. గమనసౌలభ్యముకొఱకు మానవుడు వాహనాదుల నిర్మించుకొనును. తమలపాకు, పొగాకు మొదలగునవి మానవునకు లభించినవెనుకనే వాని నాతడుపయోగించును. వేట మొదలగువాని కుపయోగించు పూర్వపు టాయుధము కాలక్రమమున నిరుపయోగములై వినోదార్థము మ్యూజియముల నుంచబడుచున్నవి. అప్పటి యాభరణములును, అప్పటి కట్టడములు, రక్షణోపాయము, ఆహారము క్రమముగా నణగిపోయినవి. క్రొత్త వాంఛలు, క్రొత్తవస్తువులు ప్రబలినవి.

## కోకిల

పసులకాపరితోడను పంతమాడి
మాల కన్నియపదములో కలసిపాడి
కర్షకుని కృషికొక్క వికాసమిచ్చి
బీదలకు పాటకచ్చేరి పెట్టితీవు.
పొంగిపాడెదో! సొదవెళ్ళబోసికొనెదో!
నీదుభావమేదియొ కనన్ లేముకాని
భావమెఱుగకుండిన, బోధపడకయున్న
ఆత్మకునుగూడ అవ్యయానందమిడుదు.
విలువయిడలేని స్వాతంత్ర్యవిభవమెల్ల
కోలుపోయినజాతి కెక్కునె కవిత్వ
గానములు: పాడితిన్నాళ్ళు: కంఠశోష:
లేమి యామనిమాచిత్త సీమలందు.
కర్మయోగి: మహాత్ముత్యాగమున నేడు
భరతవర్షము పుష్పించి పరిమళించె
ప్రబలచైతన్యశక్తి యుద్భవమునొందె
అరయ నీపాటకున్ శ్రుతి యబ్బెనేడు.

—పోతాప్రగడ శ్రీరామారావు,
బి.ఏ., బి.ఎల్.

స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.





# మహిళాలోకము

## రషియా దేశపు స్త్రీలు

వ్యవసాయమే రషియాలో ప్రజలకు జీవనోపాధి. అట్టి వ్యవసాయ దేశమును పారిశ్రామిక దేశముగ చేయుటలో స్త్రీలెంతయు తోడ్పడిరి. వారి కొసగబడిన యవకాశములను వారు చక్కగ వినియోగించుకొనిరి.

నేడు రషియాలో పనివాండ్రందరిలోను మూడువంతులు స్త్రీలే. అయిదు సంవత్సరముల నిర్మాణ కార్యక్రమము వలన పరిశ్రమలయందు కూడ స్త్రీల సంఖ్య రెండింట అయిదురెట్లు హెచ్చెను. గత మూడు సంవత్సరములలో 3,500,000 స్త్రీలు అదనముగ పనులలో నియమింపబడిరి.

అచిరకాలములోనే రషియాలో అద్భుత పారిశ్రామికాభివృద్ధిని గాంచుటకు సోవియటు ప్రభుత్వము నిశ్చయించెను. రషియాకు నైసర్గిక సంపద అపారము. సారవంతమగు భూములు సమృద్ధిగ గలవు. అడవులు విస్తారముగ నున్నవి. పెక్కుమంది పనివాండ్రను నిపుణులుగ తయారుచేయుటయే ప్రభుత్వము వారి సంకల్పము. అదియే వారిపని. ఈ నిర్మాణ కార్యక్రమ కాలమున అందరకును స్త్రీపురుషులకు ఏదో ఒక విధమగు పని యుండవలెను.

పరిశ్రమలందు స్త్రీపురుషులను నియమించుటకు ప్రభుత్వము తీర్మానించెను. వివాహితులైన స్త్రీలు కూడ పనిచేతురనే యభిప్రాయముతో వేతనములను నిర్ణయించిరి. పిల్లల తల్లులు పనిచేయు సమయమున వారి పిల్లలను కాపాడి సంరక్షణచేయుటకు ప్రత్యేకముగ సంస్థలను నెలకొల్పిరి. వీటినే నర్సరీను అనెదరు. వీటికగు వ్యయమునంతను ప్రభుత్వమువారే భరించెదరు. పారిశ్రామిక శాఖలన్నిటియందును నిపుణులగు స్త్రీలను పనిచేయుటకు ప్రభుత్వము నియమించెను. ఇతర దేశములందు ఇంతగా మనము చూడము. సాంకేతిక వృత్తి పాఠశాలలందుకూడ స్త్రీలు నియమింపబడిరి.

ఇండస్ట్రియలై జేషను పత్రిక ఇట్లు వ్రాయుచున్నది. 1928 లో రషియా దేశమున నిపుణులగు స్త్రీలు అరుదు. నేడో వారు ఇంజనీరుశాఖయందు నూటికి 22 మంది స్త్రీలు పనిచేయుచున్నారు. రసాయన పరిశ్రమయందు నూటికి 20 మంది యుండిరి. పారిశ్రామిక పరిశోధన పనివాండ్రా అందరిలోను సగము కంటె స్త్రీలే ఎక్కువ.

స్త్రీలు ఇంజను డ్రయివర్లుగ పనిచేయుచున్నారు ట్రాములలో మోటారు డ్రయివర్లుగ కూడ స్త్రీలు గలరు. ఉక్కుయంత్రాలయములందును గనులు, నేత, ఒడుకు, యంత్రాలయములందు కూడ స్త్రీలు పనిచేయుచున్నారు.

సాముదాయక వ్యవసాయమున స్త్రీలు

ఎక్కువగా పనిచేయుచున్నారు. ఇదెంతయు ముఖ్యవిషయమని స్టావిను వచించెను.

సాముదాయక షొలములలో 6000 మంది అధ్యక్షురాండ్రుగ నున్నారు. వ్యవసాయ నిర్వాహకవర్గమున 60,000 స్త్రీలు సభ్యురాండ్రుగ నున్నారు. 100,000 మంది కొన్ని శాఖా నిర్వాహకులు 7000 నాగళ్ళతో దున్నెదరు.

వృత్తి సాంకేతిక విశ్వవిద్యాలయములందు కూడ స్త్రీలు పనిచేయుచున్నారు. ఉన్నత పాఠశాలలందు కూడ స్త్రీలు ఉన్నారు.

విశ్వవిద్యాలయపు విద్యార్థులలో నూటికి దాదాపు ముప్పదిఇద్దఱు స్త్రీలే. మధ్యమిక సాంకేతిక పాఠశాలలయందు నూటికి దాద్దాపు నలుబదిమంది స్త్రీలు విద్యనభ్యసించుచున్నారు. 1928 లో సాంకేతిక పాఠశాలలయందు 449,000 స్త్రీలుండిరి. 1933 లో 1562000 మంది యుండిరి. ఉన్నత వైద్య పాఠశాలలయందు నూటికి డెబ్బదిఇద్దరు స్త్రీలు గలరు వ్యవసాయ సంస్థలయందు స్త్రీలు నూటికి ముప్పదియొక్క మంది గలరు. పారిశ్రామిక తర్బీతు పాఠశాలలయందు నూటికి ఇరువదిమంది స్త్రీలు తర్బీదును పొందుచున్నారు. నేడు ఉన్నదానికంటె ఎక్కువగా దేశాభ్యుదయమునకు ఎక్కువగా కృషి సల్పుటకు స్త్రీలు పాటుబడుచున్నారు.

రాజకీయ శాఖలయందును స్త్రీలు పనిచేయుచున్నారు. స్త్రీలు రాయబారులుగ నున్నారు. శత్రుసేనలను చెండాడగలరు. సైన్యములను నడుపగలరు. పోలీసు శాఖయందు రహస్యశాఖయందుకూడ స్త్రీలు పనిచేయుచున్నారు.

—జరుగుమిల్లి సాంబశివరావు, బి.ఏ.

# కళ : శాస్త్రము

కళకర్థము సృష్టి: శాస్త్రమునకర్థము ఖండనము. కళ హృదయవేద్యము: శాస్త్రము బుద్ధికి సంబంధించినది. కళ సౌందర్యమునకు: శాస్త్రము సంఘోపయోగమునకు. కళ యన సంయోగము: శాస్త్రమన వియోగము. కళ ఆనందదాయిని: శాస్త్రము స్తనశల్యపరీక్ష చేసి వస్తుతత్వమును నిర్వచించునది. కళ నిర్మితమైన సుందరగృహమును బోలును: శాస్త్రము వెన్నెముకవంటిది; పునాదివంటిది.

బాహ్య సౌందర్యమును అందిచ్చి ఆనందమును గొల్పునది కళ; నిత్యమును నవీనరుచుల వెదజల్లునది కళ: శాస్త్రము చాంధసమూర్తి.

రెండింటిలో సైద్ధానికిని ప్రత్యేకవ్యక్తిత్వములేదు.

ఐనను: శాస్త్రమునకును కళకును అవినాభావ సంబంధముకలదు. ఒకటిలేనిదే రెండవది నిర్జీవమైనది. అంతియగాక శాస్త్రము నాధారముగ జేసికొనిన కళలు మిక్కిలిగ శోభించును.

కళ: కళాభరితం సృష్టి.
కళకోసమే సృష్టి.

కళే మానవజీవితానికి నిగ్గు; నాగరికతకి ప్రాణం; కళలేనిదీ విజ్ఞానంలేదు. సభ్యతలేదు. జీవితమేలేదు.

దరిద్రమంటే ఏమిటి? 'కళ' యందలి ఆనందమును ఆస్వాదనము చేయటానికి అవకాశం లేకపోవటం!

నరకంఅంటే ఏమిటి? పరలోకంలో కళానుభవానికి అవకాశాలు లేకపోవటమే!

కళకి సంబంధించిన ధర్మసూత్రం 'సత్యము' సభ్యత అనగా కళయొక్క సముచితవినియోగం.

'ధర్మం కళకి అతివ్యాప్తి, అవ్యాప్తి, మిథ్యావ్యాప్తి కలగనివ్వని కొలబద్ద.'

కళ మానసికశక్తులకీ వ్యవస్థలకీ అందేదికాదు: హృదయానికిమాత్రమే హత్తుకొని మానవుణ్ణి ఆనంద సముద్రంలో ఓలలాడిస్తుంది.

కళయందలి రసాన్ని ఆస్వాదింపలేని వ్యక్తికి హృదయమే లేదన్నమాట!

—దేవగుప్తాపు విశ్వేశ్వరరావు,
(శ్రీ నవ్య సాహిత్య మండలి).

# సత్యాన్వేషణ

'......అయితే తిరుపతి బిచ్చగాళ్ళను కూడా నమ్మవలసినదే అన్నమాట! వాళ్ళ దూది ముక్కలు, మొండిచేతులు, మూగిచేష్టలు,—అన్నీ నిజమే అని ఎందుకనుకో కూడదు?' అని అడ్డువాదనకి దిగింది లక్ష్మి.

'నీ ఉపమానం క్రూరంగా ఉంది. బిచ్చగాళ్ళ కృత్రిమవేషాలకూ, పత్రికావిలేఖరుల అతిశయోక్తి వ్రాతలకూ సామ్యంలేదు.' అన్నాను తల ఊపుతూ.

'రెండూ మోసమేగా? ముష్టివాడి దొంగవేషాలు చప్పున బయలుపడతాయి; న్యూస్ పేపరువాడి అబద్ధాలు ఒకంతట రుజువుకావు! అంతే తేడా. పొట్ట పోసుకుందుకు వీళ్ళు ఎన్నెన్ని కాని కూళ్ళయినా తింటామంటారు. ప్రపంచంలో సహజంగా అనునిత్యమూ జరిగే విడ్డూరాలతోను, వింతలతోను, ఘోరాలతోను తృప్తిలేదు మన వార్తాప్రచారకులకు. విశ్వామిత్ర సృష్టిచేసి, అబద్ధాలు, అసందర్భాలు కల్పించి ప్రచురించాలని చూస్తారు, లోకాన్ని భ్రమింపజేయడానికి!......ఇట్టి విపరీతం రాతలు ఎట్లా నమ్మాలో బోధపడకుండా ఉంది నాకు.' అంటూ ఆ వార్తాపత్రిక నా ముందుకు విసరింది.

తీసి చదివాను. అందులో 'అద్భుతవార్తల'నే శీర్షిక క్రింద ఎన్నెన్నో చిత్రాలు ఉన్నాయి. రెక్కలు గల మహాసర్పమొకటి ఎగురుతూ ఉండగా ఎవరో చూసినారనీ, 'ఈజిప్టు'లో నైల్ నది నీళ్ళన్నీ ఒకనాడు రక్తంగా మారిపోయినవనీ, ఒకానొక అరవబాలికకు ఐదవయేట కవలబిడ్డలు కలిగి మాతాశిశువులు క్షేమముగా నున్నారనీ, హిమాలయ ప్రాంతమున నొక వైరాగి అన్నపానములు ముట్టక ఏడేండ్లనుండి గాలిపీల్చి బ్రతుకుచున్నాడనీ, అమెరికాలో ఒక మిస్సమ్మకు కలలో కడుపువచ్చినదనీ, మిరపమొక్కకు ఒక 'జర్మన్ సయంటిస్టు' మామిడిపండ్లు పండించినాడనీ, అస్ట్రేలియాలో ఒక కుక్క-కడుపున తెల్లని ఏనుగుపిల్ల జనించినదనీ, మలబారులో ఒక బిడ్డలతండ్రి హటాత్తుగా తన మగతనము కోల్పోయి స్త్రీగా మారి యిప్పుడు గర్భము దాల్చియున్నాడనీ,—యిట్లాటి ఆశ్చర్యకరమైన వార్తలు ఎన్నో ఉన్నాయి ఆ పత్రికలో. చదువుతూ నాలోనేను నవ్వుకున్నాను.

టేబిల్ వద్ద నాకెదురుగా కూచుని, ఓరగా నావేపు చూస్తూ, కొంటెనవ్వుతో, 'ఏం? ..బాగున్నాయా వార్తలు? ఇవి వ్రాసిన ప్రముఖుడు సాక్షాత్తూ సత్యహరిశ్చంద్రుడనేనా మీ వాదన?...అబద్ధాలని తెలిసి కూడా, మీరు వాటిని 'అతిశయోక్తుల'ంటూ సమర్థించాలని చూస్తారు—నాకు తెలుసు.' అన్నాది లక్ష్మి.

'అదికాదు లక్ష్మి! బాగా యోచించకుండా మనం ఏసంగతినైనా 'నాన్‌సెన్స్', అని కొట్టిపారవేయ కూడదు మన ఊహాశక్తికి, అనుభవానికి, అందని విషయాలు ఎన్నిలేవు యీ విశాలప్రపంచంలో? అయితే, యితగాడెవరో యీ పత్రికలో వ్రాసిన వృత్తాంతాలన్నీ నిజమైయుండి తీరాలనికాదు నేజెప్పేది. కాని, నిజాన్నిపోలిన అబద్ధాలు ఉన్నట్లుగానే అబద్ధాలేమో అనిపించే నిజాలుకూడా ఉంటాయని నా మనవి.' అన్నాను ఏవేవో దృష్టాంతాలు జ్ఞాపకంతెచ్చుకుంటూ:

'వెనుకటివలెగాక యిప్పుడు మీ ధోరణి అంతా అనోచిత్రంగా ఉంటూ వుంది. మూఢనమ్మకాలు, పిచ్చి సిద్ధాంతాలు, మెట్టవేదాంతాలు నేర్చుకుంటున్నట్లున్నారు పెద్దవాళ్ళవుతున్న కొద్దీ!...అసాధ్యాలు సాధ్యాలవుతాయనీ, అసందర్భాలు సత్యములౌతాయనీ క్రొత్తగా కనిపెడుతున్నట్లుంది మీబోటి విద్యావంతులంతా! 'కాకులెక్కడైనా తెల్లటివి ఉంటాయా?' అంటే, 'ఎందుకు ఉండకూడదు?' అని అడిగే తంతుకి దిగింది మీవరస' అన్నాది వెర్రివాడివైపు చూస్తున్నట్లు నావేపు జాలిగా చూస్తూ.

'అవును, తెల్లకాకులుమాత్రం ఎందుకుండకూడదూ? భగవంతుడిసృష్టికి అవి నిషేధమా?' అన్నాను నవ్వుతూ.

'చాలులెండి యీ మొండితర్కం' అన్నాది కసిరే గొంతుకతో.

క్షణం ఊరుకొని, పరధ్యానంగా చేతివేళ్ళు జుట్టులో గ్రుచ్చి క్రాపింగు ఎగదువ్వుకుంటూ. నేను, 'ఏమో, శాస్త్రజ్ఞుల పరిశోధనలవల్ల క్రొత్తగా మన కిప్పుడు అనేక చిత్రమైన సంగతులు తెలియవస్తూ ఉండడం లేదూ? ఒకప్పుడు తాము వెక్కిరించిన మన మంత్రశాస్త్రాలు, జ్యోతిషం, దెయ్యాలు, దేవతలు, శకునాలు, మొదలైనవాటినే పెద్దపెద్ద సయంటిస్టులు నమ్ముతూ ఉన్నప్పుడు, యీ యిరవయ్యోశతాబ్దంలో దేనికీ ఆశ్చర్యపడవలసిన అగత్యంలేదు. అబద్ధాలనుకున్నవి నిజాలవుతున్నాయి; నిజాలనుకున్నవి అబద్ధాలవుతున్నాయి. మానవబుద్ధికి సాధ్యం కానిదేదీ ఉన్నట్లు తోచకుండా ఉంది. దేనినీ అసందర్భమనీ, 'నాన్సెన్స్' అనీ కొట్టిపారవేయడానికి వీలులేకుండా ఉంది. ఎడిసన్ అనే గొప్ప సయంటిస్టు చచ్చిన వాళ్ళతో మనం మాట్లాడవచ్చునని చెప్తున్నాడు! నక్షత్రశాస్త్రజ్ఞులు అంగారకగ్రహంలో మనవంటి మనుషులున్నారని తలచి, వాళ్ళతో ప్రశ్నోత్తరాలు నడపడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు! అమెరికాలో పరిశోధకులు కొందరు పురుషసంపర్కం లేకుండా స్త్రీలు బిడ్డల్ని కనవచ్చునని రుజావు చేస్తున్నారు! ఇవన్నీ విడ్డూరాలు, విపరీతాలున్నూ; కాని అక్షరాలా నిజాలు!' అని చెప్పాను. నా వాదం బలపరచుకుంటూ.

'చిత్రం! ఈ కలియుగంలో అన్నీ యిట్టి విపరీతాలే పుట్టుకొస్తాయని మనవాళ్ళు చెప్పనే చెప్పారట గ్రంథాలలో!......మొన్న మొన్నటిదాకా మీ అభిప్రాయాలు ఎంతో భిన్నంగాఉండేవే! ఇంతలో నే యిట్టి చోద్యమైన మార్పా?......బహుశః, ఆ మశయాళం వాడెవడో ఆడదై పోయినట్లు, యింక కొన్నాళ్ళకు మీరేమైనా మరొక వ్యక్తిగా మారిపోతారేమో!' అన్నాది లక్ష్మి, నవ్వు ఆపుకోలేకుండా.

నాకుకూడా నవ్వువచ్చి, 'ఏమో, ఎవరు చెప్పగలరు?' అన్నాను వేళాకోళానికి.

ఆ మాటమీద పెంకెలక్ష్మి నన్ను ఎగతాళిచెయ్యడానికి ప్రారంభించింది, చిన్నపిల్లలు తమతో జట్టు కూడని అబ్బాయిని చప్పట్లుచరిచి, ఉడుకుబోతు మాటలని విసిగించినట్లుగా.

మన కథలలో రాచకుమారులు అట్లా మారిపోతూ ఉండేవారటలెండి. విష్ణుమూర్తి దశావతారాలు యెత్తినట్లు, శత్రువులను జయించడానికి వీళ్లు అనేకరూపాలు దాల్చేవారట. సాధారణంగా కథానాయకుడు పక్షి రూపంతో చెట్లు, కొండలు దాటి, జలచరరూపంతో సప్త సముద్రాలు యీది, భరిణలో యీగరూపంలో ప్రాణాలుదాచుకున్న రాక్షసుణ్ణి సంహరించి, దోమగానో నల్లిగానో నరుడికంట పడకుండా పోతుటీగైనా దూరలేని రాజాంతఃపురం జొరపడి, కలలో చూచిన ప్రియురాలిని కలుసుకో గలిగేవాడు! అట్లానే,—'

'నువ్వు వేళాకోళంచేసి మాట్లాడితే నేను చెప్పలేను కాని, యిన్నాళ్ళూ మానవశక్తికి అసాధ్యాలనుకున్న అద్భుతకార్యాలెన్నో యిప్పుడు చేయగలుగుతున్నారు సయంటిస్టులు. ఇంతెందుకూ, 'టెస్టుట్యూబ్' పిల్లల్ని నిర్మిస్తున్నారంటే, ఎంత ఆశ్చర్యకరమయిన విషయమో ఆలోచించు. ఈమధ్య అమెరికాలో ఎవతో ఆవిధంగా కవలబిడ్డల్ని కన్నదట, మొగవాడిని తాకకుండా!' అన్నాను.

తల తమాషాగా వంకిస్తూ, 'ఆశ్చర్యమేముంది? మన పురాణాలలో అనేక దృష్టాంతాలున్నాయి. అట్టివి. కుంతి కొడుకులంతా మరి గాలికిపుట్టినవాళ్లేగా? మనం మన అజ్ఞానంకొద్దీ ఆయిల్లాలునుగూర్చి పాపం మాటలనుకుంటాం కాని, నిజంగా ఆమె టెస్టుట్యూబ్ పిల్లల్నే కన్నది! పూర్వం మన ముసలిరాజులంతా సంతానాలెట్లు పొందేవారని? తపస్సుచేయడానికని యేఅడవులకో పోయేవారు కొన్నాళ్ళపాటు. అప్పుడు మన దేవుళ్ళు వాళ్ళకు ప్రత్యక్షమై, పండో కాయో చేతిలోపెట్టి, బిడ్డల్ని వరమిచ్చేవారు. తపస్సు చాలించి భర్తలు యింటికిరాగానే యథావిధిగా రాణీలు గర్భవతు లయేవారు! అవునా?' అన్నాది లక్ష్మి.

నేనేమీ మాట్లాడలేదు.

తిరిగీ ఆమె, 'మొగుడుచచ్చిన సావిత్రికి వందమంది కొడుకులు కలిగేటందుకు వరమిచ్చిన యముడి ఉద్దేశం ఏమిటని మీ ఊహ? ఆమెకు టెస్టుట్యూబ్ పిల్లల్ని యిద్దామనే అతనిసంకల్పం!......టెస్టుట్యూబ్ పిల్లల్ని పుట్టించే మహావిద్య మీకొమ్ములు తిరిగిన సయంటిస్టులకే తెలుసునని అనుకోకండి. మన బైరాగులు, స్వాములవార్లు, కోవెల పూజార్లు, భూతవైద్యులు మొదలైనవాళ్ళంతా కొంతవరకు యీ విద్యలో ప్రవీణులే! మంత్రించి యింత విభూతో, కుంకమో, తులసిదళమో, తీర్థమో యిచ్చి, సంతానాపేక్ష గల అమాయకులను తరింపజేస్తారు, యీ మహానుభావులు.' అన్నాది ఉద్రేకస్వరంతో.

'అయితే నీ అభిప్రాయంలో టెస్టుట్యూబ్ పిల్లల గూర్చి సయంటిస్టులు ప్రకటించినదంతా అబద్ధమూ, దొంగవేషమూ, అనా!' అన్నాను కోపంతో మొగం చిట్లిస్తూ.

'కాకపోవచ్చును. కాని, ఎందుకొచ్చిన పరిశోధన యిది? మాటవరసకి, పురుషసహాయంలేనిదే స్త్రీలు బిడ్డల్ని కనడానికి సాధ్యమవుతుందనే అనుకుందాం. ఏంలాభం? సంతాననిరోధసాధన కబుర్లతో ప్రపంచమంతా మారుమ్రోగుతో ఉన్న యీ యిరవయ్యో శతాబ్దంలో యీ టెస్టుట్యూబ్ పిల్లలు ఎవరికి అవసరమని? అట్టిసంతానం పొందడంలో ఆడదానికి ఏమిటానందం? ఇక మానవసంఘంలో దాంపత్యం, ప్రేమ, తండ్రితనం అనేమాటలకు అర్థమేముంటుంది? బిడ్డలంటే 'ఫోర్డుకార్లు', రాస్కోప్‌వాచీలు కావుకద, ఫాక్టరీలలో తయారుకావడానికి? ప్రకృతి విరుద్ధంగా టెస్టుట్యూబ్ బిడ్డల్ని కనేటందుకు ముచ్చట పడడానికి స్త్రీలంటే మానాభిమానాలు, హృదయమూ లేని యంత్రాలనుకున్నారా? శరీరంలోని ప్రతిరక్తకణము, ప్రతినరము మగవాడికోసం గోలచేసి, హృదయము, ఆత్మ అతనితో ఐక్యమై, ప్రేమఫలితంగా సంతానంపొందితేనే తప్ప, ఆడదానికి తృప్తిఉండదు!......ఊసుపోని మంగలి పిల్లిబుర్ర గొరిగినాడని సామెత చెప్పినట్లు, మీ సయంటిస్టులకు వేరేవ్యాపకాలేవీ లేక, యిట్టి మతిభ్రమ పరిశోధనలన్నీ చేస్తూఉంటారు! ఇక గోరంతలు కొండంతలుచేసి, లోకానికి ప్రకటించడానికి ఉండనే ఉన్నారు యీ న్యూస్ పేపరువాళ్ళు.'

అని కొంతసేపు ఊరుకొని, నిట్టూర్పుతో, 'ఈ ప్రపంచంలో ఉండే అశాంతికి, అసౌఖ్యాలకు, రోగాలకు, అబద్ధాలకు, జరిగే ఘోరాలకు, హింసలకు, యుద్ధాలకు, మోసాలకు —అన్నిటికీ యీసయన్సు, యీ న్యూస్ పేపర్లే కారణమని నమ్మండి!' అన్నాది ముక్కుపుటా లెగరవేస్తూ.

చెంపమీద చరచినట్లు నొచ్చాయి నాకామె మాటలు. విని కొంతసేపు ఆలోచిస్తూ ఊరుకున్నాను. సయిన్సు అంటే నాకు ఎంతో అభిమానము, భక్తిన్ని. వార్తాపత్రికల నెవరేమన్నా సరేకాని, సయన్సును గూర్చి అన్యాయం మాటలాడితే నేను సహించలేను.

'లక్ష్మి, ఏదో ఒక్కవిషయంగూర్చి నీకు ఒళ్ళుమండినా, యిట్లా సయన్సు అంతటినీ తూలనాడడం ధర్మంకాదు. సరే, టెస్టుట్యూబ్ శిశువులగురించి నీ వాదం కొంత సబబుగానే ఉన్నదని ఒప్పుకుంటాను. కాని నన్ను మరొక ఉదాహరణను చెప్పనియ్యి. అప్పుడు నీ అభిప్రాయం మారవచ్చు.' అన్నాను.

'చెప్పండి.'

'ఇప్పుడు క్రొత్తగా 'హార్మోన్ థియరీ' అని ఒకటి అమలులో ఉందిలే. అది యేమిటీ అంటే,—'అని ప్రారంభించాను.

సన్నని చిరునవ్వుతో,'ఆ థియరీయేదో అంతా నాకు చెప్పి యిప్పుడు తలనొప్పి పుట్టించనక్కరలేదు. మీ పుణ్యముంటుంది, టూకీగా దాని పర్యవసానమో, ఫలితమో నిరూపించే ఉదాహరణలు రెండు చెప్పండి; చాలును.' అన్నాది లక్ష్మి.

సరేఅని, లోగడ నేనెప్పుడో 'నాష్' పత్రికలో చదివిన గోబిందబిహారీలాల్ గారి వ్యాసంనుండి కొన్ని ఉదాహరణలు ఎంచి చెప్పినాను.

'ప్రపంచంలో ఏయిద్దరు మనుష్యులూ సమాన లక్షణాలు గలవారుగా ఉండరు. మనిషికీ, మనిషికీ భేదము తేడా ఉంటుంది. ఈతేడాలను కలుగజేసే పదా

గ్రాలు కొన్ని మన శరీరాలలో ఉంటాయి, వాటిలో కొన్నిటిని హార్మోన్స్ అంటారు. ఇప్పుడు గొప్పగొప్ప దేశాలలో డాక్టర్లు 'హార్మోన్ చికిత్స' లతో అద్భుతమైన పనులు చేస్తున్నారు. రెండుమూడు చినుకుల హార్మోన్ను రక్తంలోకి 'యింజెక్టు' చేసి రోగి యొక్క శరీరాన్ని, స్వభావాన్నికూడా మార్చివేయ గలుగుతున్నారు.

'ఈమధ్య 'లారీ' అనే అమెరికన్ డాక్టరొకడు చిత్రమైన కేసొకటి చెప్పినాడు. ఒకానొక స్కూలు బాలుడు తల్లిదండ్రులకు అసాధ్యుడై తుంటరిగా ప్రవర్తిస్తూ ఉండేవాడట. ఇంట్లోని డబ్బులు, తినుబండాలు దొంగిలించేవాడట. అన్నీ అబద్ధాలే చెప్పేవాడట. ఇల్లుతీసి పందిరివేసే పాడుపనులు చేసేవాడట. తోటి బాలురను చితకదన్నేవాడట. పెద్దవాళ్ళచేత చచ్చే దెబ్బలు తినేవాడట. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పే ఉపదేశాలను, విధించే శిక్షలను ఏమీ లక్ష్యపెట్టేవాడు కాడట. డాక్టరు లారీ ఆ అబ్బాయిని పరీక్షించి, కుర్రవాడు దుబ్బుగా, పొట్టిగా, ఆడంగిగా ఉండడం కనిపెట్టి, వెంటనే హార్మోన్ చికిత్స ప్రారంభించినాడు. ఆ అబ్బాయిలో అప్పుడు అద్భుతమైన మార్పువచ్చింది. లావుగా, కురుచగా ఉండేవాడల్లా సన్నంగా పొడవుగా అయినాడు. వాడి కీచుగొంతుక, ఆడచేష్టలు, దొంగగుణాలు, పెంకెతనం అన్నీ నిష్కాలమైనాయి. కుర్రవాడు అన్నివిధాలా బాగుపడినాడు!

'ఈ హార్మోన్ చికిత్సవలన 'ఎడిసన్ వ్యాధి' వంటి అసాధ్యరోగాలు సహితం నిమ్మళిస్తున్నట్లు చెప్తున్నారు వైద్యులు. ఈమధ్య ఒకానొక అమెరికన్ ఆసుపత్రికి యీ వ్యాధితో బాధపడుతున్నవాళ్ళు కొందరు వచ్చియుండిరట. వాళ్ళు తిండితినేవారు కారట. కృశించి నల్లగా అయినారట. మెదడు చెడిందట. ఎప్పుడూ బద్ధకంగా, స్పృహతప్పి, చచ్చినట్లు పడి ఉండేవారట అప్పుడు డాక్టర్లు ఎవరికో సయంటిస్టులకు తంతియిచ్చి, విమానంమీద కొద్దిగా 'వైటల్ హార్మోన్'ను తెప్పించి, రెండుమూడు చినుకులు శరీరంలోనికి యింజెక్టుచేసేసరికి, యీ రోగులంతాలేచి కూచున్నారట. 48 గంటలలోగా వాళ్ళకు పూర్ణారోగ్యం కలిగి, బలమైన గొడ్డుమాంసం తిని జీర్ణించుకొనేశక్తి ఉదయించిందట!

'సహజంగా ఉండవలసిన వైటల్ హార్మోనులు వాళ్ళ శరీరంలో నశించినందువల్లనే, వాళ్ళకా వ్యాధి వచ్చినదని డాక్టర్లు కనిపెట్టినారు. ఒంట్లో యీరకం హార్మోన్లు లేకపోతే, రక్తంలోవుండే ద్రవపదార్థమంతా ఊటగా పైకివచ్చేసి, రక్తంపేరుకొనిపోయి, చావువస్తుంది.

'అయితే, ప్రాణతుల్యమైన యీ రసాయనం మన శరీరంలో ఉండడం అవసరమేకాని, కాస్త అధికంగా ఉన్నాదంటే మళ్ళీ ప్రమాదమే. ఆడదాని శరీరంలో యీరకం హార్మోన్స్ జాస్తీ అయితే, ఆమెకు మగలక్షణాలు అంకురిస్తాయి. అంటే, గొంతుక బొంగుబోరడం, పై పెదవెమీద, గడ్డంమీద వెంట్రుకలు మొలవడం, ఒళ్ళు మోటుబారడం,—యిత్యాదివి. ఇంకా మన మన శరీరాలలో ఉండే మరికొన్ని కొన్నిరకాల హార్మోనులమీద ఆధారపడి ఉంటాయి, మనలో ఉండే కొన్ని కొన్ని ఆడలక్షణాలు, మగలక్షణాలున్నూ. 'ప్రోలాక్టిన్' అనే హార్మోను మగవాళ్ళదేహంలో ఉండదు. ఆడవాళ్ళశరీరంలో అది ఉండితీరుతుంది కనుకనే, వాళ్ళకు చనుబాలు ఉంటాయి. ఈమధ్య డాక్టర్ రిడిల్ అనే ఆయన యీ హార్మోన్ను కొన్ని మగగిన్నీపందులకు యింజెక్టుచేసేసరికి, అవి ఆడపందులవలె పాలివ్వడం ప్రారంభించాయట!

'కేంబ్రిడ్జిలో 8½ ఏండ్లవయసుగల ఒక కోడిపెట్ట పుంజుగా మారిపోయినదని వ్రాస్తున్నాడు డాక్టర్ హార్ట్సు — దాని కండరాలలో ఒకదాని యందేదో సంచలనం కలుగుటవలన పిల్లల తల్లిగా ఉండిన ఆ కోడి మగతనంపూని తిరిగి పిల్లలతండ్రి అయినదట!'

చేతిమీద గడ్డం ఆనుకొని, బొమ్మవలె రెప్పవాల్చక నన్నుచూస్తూ, శ్రద్ధగావిన్నాది లక్ష్మి.

'అయితే యికనేం? మనలోఉండే హార్మోన్స్ కూడా ఏదైనా గడబిడ చేశాయంటే, మనకూ సంభవించవచ్చునన్నమాట, యిట్టి సెక్సు మార్పులు?...

కొంపదీసి ఏనాడో నిద్రలేచేసరికి మీరు హఠాత్తుగా ఆడమనిషి అయిపోతే,...ఎట్లా?' అన్నాది విరగబడి నవ్వుతూ.

'అయిపోనులే, బెంగపడకు!' అన్నాను నాకు కూడా నవ్వొచ్చి 'మనలో ఉండే హార్మోన్స్ అట్టి తల్లక్రిందు మార్పులను కలిగించవు. కాని కొంతవరకు మనమన సెక్స్‌గుణ తేడాలను నిర్ణయిస్తాయి.'

'అంటే?' అన్నాది లక్ష్మి బొమలు పైకెత్తి.

'అంటే, వ్యక్తులయొక్క శరీరతత్వాన్నిబట్టి— అనగా, వారి రక్తంలోఉండే హార్మోన్స్‌వంటి రసాయనాల మూలాన—ఏమనిషిలో ఏయే ఆడలక్షణాలు, మగలక్షణాలు ఉండేటందుకు అవకాశం ఉన్నదో మనం తెలుసుకోవచ్చు. కొన్నికొన్ని పరీక్షల వలన ప్రతిమనిషిలోను గల ఆడతనాన్ని, మగతనాన్ని వివరంగా కొలవవచ్చును!' అని చెప్పాను.

'ప్రతీ మనిషిలోను ఆడహార్మోన్సు కొన్ని, మొగ హార్మోన్సు కొన్ని, (అంటే, ఆయాలక్షణాలను కలిగించేవి) ఉంటా యన్నమాట?'

'అవును. అట్లా మిశ్రమమై ఉండడమే శరీరారోగ్యానికి మంచిదికూడా!' అన్నాను.

'మగవాడికి కొంత ఆడతనం, ఆడదానికి కొంత మగతనం, ఉండడమే మంచిదనా, మీ రనేమాట?' అన్నాది లక్ష్మి, చిరునవ్వుతో.

'అదికాదు. మగవాడిని ఆడహార్మోన్సు, ఆడదానిని మగహార్మోన్సు, కొన్నికొన్ని వ్యాధులనుండి, యిబ్బందులనుండి కాపాడుతూఉంటాయి. ఉదాహరణకి చెప్తున్నాను: 'హెమొఫిలియా' అనే రక్తస్రావవ్యాధి వలన కొందరు పురుషులు బాధపడతారు. అట్టివాళ్ళకు శరీరంమీద ఏభాగమందైనా ప్రమాదవశాత్తూ చిన్నగా యం తగిలితేచాలు—రక్తం ఆగకుండా ధారకట్టి కారుతుంది; ఎంతసేపటికీ పేరుకొని గడ్డకట్టదు. వెనకటి రష్యన్ రాకుమారులకు, స్పెయిన్ రాకుమారులకు యీ వ్యాధి ఉండేదట. డాక్టర్లు అప్పుడు 'ఈ జబ్బు సాధారణంగా మగవాళ్ళకే వస్తుందికాని ఆడవాళ్ళకెవరికీ రాదు. ఎందుచేత? బహుశః, స్త్రీలను యీ వ్యాధినుండి కాపాడడానికి వాళ్ళరక్తంలో ప్రత్యేకంగా ఏవైనా హార్మోన్స్ ఉన్నాయేమో? ఒకవేళ ఆడహార్మోన్స్ కొన్ని యీ రాకుమారులకు, యింజెక్టుచేస్తే లాభం ఉంటుందేమో?' అని ఆలోచించి హార్మోన్‌చికిత్స ప్రారంభించారట. గారడీవలె జబ్బు వెంటనే నయమైనదట!' అని చెప్పాను.

'ఈ హార్మోనులకథ నిజంగా అద్భుతంగానే ఉంది!' అన్నాది లక్ష్మి, యేదో యోచిస్తూ.

సయన్సుయొక్క మహిమను ఆమెకు నచ్చజేయ గలిగినందుకు నాలోనేను గర్వపడ్డాను. నా ముఖమందు తాండవించిన సంతోష చిహ్నాలను గమనించి కాబోలు, '—కాని, సయన్సునుగూర్చి నాకుగల అభిప్రాయాలను మార్చుకోవలసిన అగత్యం కనబడదు!... మీరు చెప్పేవిదల్లా సయన్సుకూడా మానవసౌఖ్యానికి అప్పుడప్పుడు కొంత తోడ్పడుతూ ఉంటుందని; అంతేకదూ?...పాము విషంకూడా మానవుడికి అప్పుడప్పుడు ఉపచరిస్తూ ఉంటుంది!' అన్నాది చిరునవ్వుతో.

'సయన్సు అంతేనా?' అన్నాను నిర్ఘాంతపడి.

ఆమాటకు జవాబులేదు; ఒకటే నవ్వు!

నవ్వుచేత కొంతసేపు మాటలెమలక, పిమ్మట మళ్ళీ, 'అబ్బా! ఎంత గొప్పసంగతి కనిపెట్టారు మీ సయంటిస్టులు!...మొగవాడి రోగం ఆడదే కుదర్చాలన్న సంగతి యీనాటికైనా తెలుసుకున్నారు.—అదెంతకాదు?' అన్నాది విషయాన్ని మార్చేస్తూ.

ఆమాట విని పక్కున నవ్వాను.

అసలు విషయం విడిచి, మా సంభాషణ అంతటితో అరణ్యమార్గం పట్టింది. జపం విడిచి లొట్టలలో పడి నట్లు, నేను చెప్పాలనుకున్న విషయాలు అన్నీ మరచిపోయి,...ఆమె ముద్దుమొగం, నవ్వుకళ్ళు చూస్తూ, ఆమె పెంకెమాటలను, నవ్వుతాలను వింటూ, ఆమె జడలోని గులాబీల మత్తువాసనలకు ఒళ్ళే మరచిపోయాను!

—తాత. కృష్ణమూర్తి, బి. ఏ., యల్. టి.

# శిక్ష

చింకిబొంతలో పడుకుని మూలుగుతున్నాడు నాలుగేండ్లవయస్సుగల జగం. అతని దేహంలోని అస్థిపంజరం పైకి కనబడుతూంది, కన్నులు లోతుకుపోయి మూసుకుపివున్నాయి. అతను బలువుగా వూపిర్ని పీలుస్తున్నాడు. గుండెలో నొప్పి లేస్తూండడంచేత కాళ్ళు వుండుండి కిరకిర చుట్టుకుపోతున్నాడు. జ్వరతీవ్రంచేత కలిగిన మమతలో అప్పుడప్పుడు 'అమ్మా!' అని పలవరిస్తాడు. ఆ నాలుగేండ్ల జీవితన లేతనోరుతో యెంతో ఆశతో 'అమ్మా' అని పలవరించు తే పలకడాని కతనకి అమ్మ యెక్కడుంది? కాని అక్కడనే అతనిపక్కనే కూచుని కళ్ళల్లోనికి పరువులిడుతున్న నీళ్ళన్నింటినీ యెండిపోయిన గొంతుకులోనే దిగమింగుకుంటున్న నీలాద్రి, అతను పలవరించినవెంటనే చటాల్న లేచి 'నాన్నా! నా నాయనా! నాతండ్రీ! నాజగం! ఎందుకమ్మా పిలుస్తున్నావు?' అని యెంతో ఆతృతతో అడుగుతాడు. కాని అతనిప్రశ్నకి జగం ఉఁ ఉఁ అనే మూలుగే జవాబు.

నీలాద్రి లేచి ముక్కాలిపీటమీద వెలుగుతున్న మినుకుమినుకు బుడ్డీదీపం పురపురలాడుతూవుండగా దాన్ని హెచ్చుచేశాడు. మళ్ళాకూచుని జగంవేపు చూస్తున్నాడు.

జగం కిరకిర చుట్టుకుంటున్నాడు.

నీలాద్రి మనస్సులో డాక్టరు అరగంట కిందట చెప్పినమాటలు మెరుపుల్లా పరుగెత్తాయి. 'నీకొడుకు యింక గంటన్నరా.... లేక రెండుగంటలకన్నా హెచ్చు....కాని యిరవై రూపాయలుగాని నువ్వు యిచ్చావంటే ఇంజక్షనిస్తాను. మరి ఫరవాలేదు.' అన్నాడు డాక్టరు. తను డాక్టరు పాదాలమీదపడి 'డాక్టరుగారూ! నేను నిరుపేదను. నామీద నా జగంమీద దయతలచండి. నా జగాన్ని బతికించండి' అని బతిమాలాడు. డాక్టరు 'ఇరవై రూపాయలు—మందు ఖరీదు' అంటూ తన మొరలను వినకుండానే చింకిబొంతలో జ్వరబాధచేత మూలుగుతున్న ఆ దీనజీవినయినా చూడకుండానే చరచర వెళ్ళిపోయాడు....ఇలాగనే గడచిన సంగతుల్ని స్మరించుకున్నాడు.

తన జగం....తన జగం....తన్ను విడిచి యింకోగంటలో—వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

ఇరవై రూపాయలుంటేనా....ఒక్క యిరవై యుంటేనా ...తన జగం చక్కాలేచి కూచుంటాడు. 'నాన్నా' అంటూ యెంతో ముద్దుగా పిలుస్తూ కిచకిచ నవ్వుతూ వచ్చి తనవొళ్లో కూచుంటాడు. కాని యిరవై రూపాయలే! ఎలాగునవస్తాయి? తిరిగి యేడుస్తున్నాడు.

ఏడుపును బలవంతంగా వొక్కసారిగా దిగమింగుకున్నాడు. మంచందగ్గిరకి వెళ్లాడు. జగం యిందాకటిలాగునే ఉఁ ఉఁ అని మూలుగుతున్నాడు. నీలాద్రి అక్కడనుంచి కదిలి ద్వారందాటాడు.

అవతల, మృత్యుదేవత కేశపాశంలాగుంది చీకటి. ఆ చీకట్లో యెక్కడికో యెందుకో బయలుదేరాడు. రెండుమూడు వీధులు తిరిగాడు. ప్రతివీధీ నిర్జనంగావుంది. అవును అంత రాత్రివేళ నిద్రమానుకుని వీధుల్లో యెవరుతిరుగుతారు తానుతప్ప? నీలాద్రి వొకమేడదగ్గర నిలబడి పోయాడు.

రెండుమూడుసార్లు తనచుట్టూ పరికించి వొకసారి మేడమీదికి తన చూపులను సారించాడు.

*   *   *   *

ఆ మేడమీద వరండాలోనుంచి చప్పుడు కానట్లు యెత్తియెత్తి మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు నీలాద్రి. అతను గదులో ప్రవేశించాడు. కిటికీదగ్గరున్న మంచంమీద శాలునకప్పుకుని గుర్రుతీస్తూ నిద్రిస్తున్న ఆయింటియజమాని వేపొకసారి, చిలుకకొయ్యకు తగల్చబడివున్న ఆ యజమాని సిల్కుకోటువంక నొకసారి చూశాడు. ఆసిల్కుకోటులోని పర్సులో యిరవైరూపాయలుండవా—రెండు పదేసి రూపాయల నోట్లుండవా?—జగం... తనజగం బతికిపోతాడు! బతికిపోతాడు. అడుగు ముందువేశాడు. టేబిలుమీద తగ్గించబడివున్న లాంతరు అతన్ని బెదరకొట్టింది. అతను లాంతరునార్పి చిలుకకొయ్యదగ్గరకు వెళ్తున్నాడు. ఆ చీకటిలో అతని కాలుతగిలి పీకుదానా తిరగబడి చప్పుడుచేసింది.

యజమాని త్రుళ్ళిపడిలేచాడు. గది నిండా చీకటి. చీకటిలో యెవరో? 'దొంగ! దొంగ' అంటూ బెదురుగొంతుకుతో కేకలువేశాడు యజమాని. దొంగ గదులోనుంచి అవతల కొక్కదాటు వేశాడు, కాని—

వరండాలో నీలాద్రిని యిద్దరు బంట్రోతులు పట్టుకున్నారు. నిమిషంలో అందరూ అక్కడ పోగైనారు. యజమాని తన కాలిచెప్పును తీసి దాంతో నీలాద్రి దవడమీద చరిచాడు. నీలాద్రిపళ్ళు రెండు వూడినాయి. అక్కడనున్న ప్రతిమనిషీ అతన్ని తంతున్నారు. ఆఖరికి యజమానికొడుకు, నాలుగేండ్ల అబ్బాయికూడా నీలాద్రిని తన్నాడు. నీలాద్రి ఆ అబ్బాయివేపు అదేపనిగా చూస్తూండగా అతని కన్నులవెంబడి నీళ్ళు జలజల ప్రవహించాయి. 'నాయనా! నన్ను మరోసారి తన్నవూ?' అని ఆ అబ్బాయిని అడిగాడు నీలాద్రి.

పోలీసులు వచ్చారు. చేతులకు బేడీలను బిగించి నీలాద్రిని స్టేషనుకి తీసుకుపోతున్నారు.

—మల్లాది అవధాని.

# తీర్థ సేవ

సీ. పాడిదగ్గు కంఠంబుఁ బొరిపుచ్చకయమున్న తలప్రకంపంబుఁ బొందకయమున్న
బొమలు కన్నులమీఁదఁ బొదవిర్వాలకమున్న పొర నేత్రములకడ్డు చొరకమున్న
శ్రుతి పుటంబులశక్తి సురిఁగి పోవకమున్న వళు లాననమునఁ బర్వకయమున్న
హృదయంబులో జాగ పదను దప్పకమున్న గాత్రంబు శిథిలంబు గాకమున్న

గీ. పండ్లు వేర్వాసి కదలుచూపకయమున్న కాకి కడకంటిపై చూపు రాకమున్న
కాలుసేయాడు తఱి యంద కదలవలయుఁ దీర్థసేవకు దేహ మస్థిరముగాన.

—కాశీ ఖండము.

# తుంబాచార్యులు గారి వారపత్రిక

## (వినోదము కొఱకు)

నేను స్వప్నములోఁ గాశీయాత్రకుఁ బోయియుంటిని. గయ, ప్రయాగ, కాశి మూఁడు క్షేత్రములు సేవించితిని. వారణావత మెక్కడనో తెలిసికొని లక్కయింటిపురాదులు చూచితిని. ఇంకను నేతిజిడ్డు వదలని అక్కరాలు గాజురాలు గుర్తులు కనఁబడుచున్నవి. మహాశ్మశానము. వీరబాహుఁడు కూర్చున్న మంచెగుంజల గలకలు చూచితిని. వ్యాసుఁ డుముకమీఁద దాఁటజాలక నిచ్చెనమీఁద నడుగులుపెట్టుచు నాకుఁ గనఁబడినాఁడు. తిక్కనసోమయాజిగారు కనఁబడలేదు. కాశిలోఁ గల్లంగళ్ళు సురాభాండేశ్వరము కథ జ్ఞప్తికిఁదెచ్చిన వెళ్ళిచూచినాఁడను. బందరు చల్లబజారునకు దానికి భేదము లేదు. గయలో మఱ్ఱిచెట్టు, ఒకటి గాదు, ప్రాఁతఢిల్లి, ప్రాతయయోధ్య, క్రొత్తమధుర, క్రొత్తయయోధ్య, క్రొత్తఢిల్లి, చక్కఁగాఁ బరిశీలించినాను. నేను వెళ్ళినకాలము కలియుగ ప్రారంభముగా నా కగపడినది. తర్వాత మొన్న మొన్నటిదాక నున్నట్లు తోఁచినది. నేను దిరిగి వచ్చునపుడు చూచిన దృశ్యములలో ననేక విచారసూచకము లగునవి కలవు. ఉత్తర దేశములో - ఒక్కని మహారాజ్ అనినమాటచేతనే గాక యితరసమయములలో నతఁడు బ్రాహ్మణుఁడని సాక్షా లాగవచ్చినవానిని దెలిసికొనలేక పోయితిని. బ్రాహ్మణేతరోద్యమము మనదేశములోకంటె నక్కడనే ముందు వెలువడెనని గ్రహించితిని. ఇది చెన్నరాష్ట్రములోనె ముందు పుట్టినదని చెప్పుకొనుట గలదు. ఓయి వెఱ్ఱివాఁడా! నోటికి వచ్చినట్లెల్లఁజెప్పి దానినే నిర్ధారణచేయకుము, ఇక్కడ స్వాతంత్ర్య జీవనము చేయువారు మెండు. ఒక్కరియొద్ద దాస్యముచేయ నెంచువారు తక్కువయని యెవ్వరో యచ్చట నన్నుఁ గూర్చి పలికిరి. ఇప్పటివలె నప్పుడచ్చటఁ బత్రికాప్రచారము లేదు. వినోదమునకై కొనఁదలఁచి యూరెల్లఁ దిరిగితిని గాని యొక్క పత్రిక దొరకలేదు. నేనేమియైన నంగడిలోఁగొనినను బొట్లముకట్టిన కాగితమైనను ఏ డైలీస్కెచ్చిదో యేడైలీ మిఱ్ఱరుదో దొరకుననుకొంటినిగాని, ఆకులోనె కట్టియిచ్చువారు. పత్రికలవాసన లేదు. నాకుఁ జాలదుఃఖమువచ్చినది.

ముగ్గురు మనుష్యులలో నొక్క ముద్రాయంత్రశాల కనఁబడినది. లోనఁ బ్రవేశించితిని. ఏయూరది యని యడుగకుఁడు, పేరుగల పెద్దపట్టణమే. నే నేదో యచ్చువేయింపుకొన వచ్చితినని నాకెదురువచ్చి కొనిపోయి కూర్చుండబెట్టికొనెఁ. అన్యోన్యప్రశ్నములలో 'మీకేమి లాభము వచ్చుచున్నది. చిన్న వారపత్రిక కూడ నడుపరాదా' యంటిని. ఊహయున్నదిగాని నాకుఁ దగిన సహాయములేదు. ఎవ్వరినైనఁ జేర్చితినా నేను జెప్పునది యొకటి వారుచేయునది యొకటి. నాకిష్టము లేనివి, నాకు లాభములేనివి వ్రాసి తగవులుతెచ్చి తప్పుకొనుచుందురు. నేను స్వతంత్రించి వ్రాయఁజాలను. వారినే నమ్మియుండఁజాలను. ఒక్క వైద్యుఁడువచ్చి వైద్యవిషయములు మీ పత్రికలో లేవేమియనును. వర్తకుఁడువచ్చి యేనాఁటివానాఁడు మళిగధరలు వేయరాదాయనును. చెప్పనేల యెవరివెఱ్ఱి వారి కానందము. ఎవ్వరిని మెప్పింపగలను; అని ముద్రాక్షరశాలాధికారి యంగలార్చినాఁడు. అన్నగారు: మీరు చెప్పనక్కఱలేదు, నాకనుభవమే. నేనును జూచుచున్నాఁడను. ధనవంతుఁడు పత్రికపెట్టుటయు నిర్ధనుఁడును విద్యార్థికుఁడును దుర్గర్వియై సర్వజ్ఞుఁడని సిద్ధపడి యజమానునకు మాటదెచ్చుటయు జరగుచున్నది. నే నట్టివాఁడనని తలంపకుఁడు. మీ యాజమాన్య మిందువలదు. నేనే సర్వమును నిర్వహించుకొందును. అచ్చువేసినందుకు మీకు భృతి యిచ్చెదను. లాభనష్టములు నావి. నేనీ

యూరికి గ్రొత్తవాఁడను. నాకు సహాయము కావలయును. తిండి పెట్టవలదు. అప్పియనక్కఱలేదు. మాటసాయము — మీకు మాటవచ్చు విషయములు వ్రాయను. ఒక్కరిని నిందింపను, మూలచ్ఛేదపాండిత్య ముపయోగింపను. అని నచ్చఁజెప్పి పత్రిక మొదలుపెట్టవలయునని — ముందుఁ బ్రకటనయొకటి చేయఁదలఁచి యిట్లొక ప్రకటన ముద్రించితిని.

'లెండులెండు!. మేల్కొనుఁడు. ఆదరింపుఁడు. ఆనందింపుడు. వార్తయందు జగము వర్తిల్లుచున్నది. యద్దిలేనినాఁడు అఖిలజగము సంధకారమగ్న మగును గాన వార్తనిర్వహింపవలయుఁ బత్రిక. అని మహాభారత ప్రయోగముగలదు. ఉన్నను దేశములో నొక్క భూపతియును వార్తా పత్రికను బ్రకటించుటలేదు. రాజులూరకున్న మాబోఁట్లేమిచేయఁగలరు. వార్తయనఁగ వేఱర్థముచెప్పువారు నన్ను మన్నింపవలయును. నేనెందునను సమర్థుఁడను గాను. ఉండ నిల్లులేదు పండ మంచము లేదు. మీ యాదరముననే నేనీ పట్టనములో నొక వార్తాపత్రికను బైలువెడలింప నెంచితిని. ఇంతటి ప్రసిద్ధ పట్టనము - హిందూదేశములో నేదీ! అయోధ్యయనిన దెసలు తెల్లవాఱుచున్నవి. వాల్మీకి కాలము నుండియు నాగరకతకు మిక్కిలి ప్రసిద్ధికెక్కిన యీ యయోధ్యలో నీసాకేతపురములో, స్త్రీనాటక సంఘములు కూడ వెలసిన యీ కోసలరాజధానిలో నొక్క వార్తా పత్రికయైన నుండినట్లు మన కాధారములులేవు. హిందూదేశములో ముద్రాయంత్రములున్నట్లు పుస్తకము లచ్చుపడుచున్నట్లు పూర్వగ్రంథములలో నగపడును. నిర్వచనోత్తర రామాయణములో 'బాలశిక్షలిట్లచ్చుపడునె' యనికలదు. భారతములో 'వర్ణసమితి యచ్చుపడఁగ' ననికలదు. పరిశోధకులు, పుర్వముండినట్లు గాని, యున్న పరిశోధకులు పత్రికానిర్వహణము మున్నెప్పుడో యున్నట్లుగాని తెల్పలేదు. వారికేమి ప్రతిబంధకము లున్నవో, నాకేల పత్రికాప్రచురణము మానిరో — వారికంటె నీ వేమి ఘనుఁడవా యనవలదు. ఉడుత భక్తి నాచేతనైనంత చేసెదను. నేనే లాభనష్టములు వహించెదను. మీ యాదరము నాకు ముఖ్యము. నేను ప్రచురింపఁబోవు పత్రిక పేరు, 'ప్రపంచసమాచార'ము. నాకీ పత్రికానిర్వహణములోఁ బ్రపంచమంతయు సాయపడవలయును. ఈ భూప్రపంచమే గాదు. పాతాళాది పదునాల్గు భువనములును — ఎవ్వరేమే సహాయ్యము చేయవలయునో స్థూలముగ వివరించుచున్నాఁడను.

మాకుఁ బృథివీభూతము, భూకంపములు గలిగించి గనులుపుట్టించి, అగ్నిపర్వతములు ప్రబలించి నదులవలన దేశములకు సస్యసమృద్ధి, జలప్రళయములు, జననాశము గావించియు సాయపడవలయును దీనికి సముద్రాది జలభూతములు, అన్ని పర్వతాదులలో నగ్నిభూతమును, బృథ్వికిఁ దోడ్పడవలయును. గ్రహములు, గ్రహణములు, గ్రహవక్రగతులు, తోఁకచుక్కలు, మొండికొఱళ్ళు, ఉల్కలు మేఘములు వర్షములు, పిడుగులు, ఱాళ్ళవానలు గలిగించి యాకాశభూతము తోడుపడవలయును ఫలవృక్షములు, మహావనములు, కొండపోళ్లు అడవిచెలికలు, తోఁటలు, దొడ్లు - ఘోరమృగములకు స్థానములను మార్గములలో నడ్డుకొని, దొంగలు దాయలు కాచి - తలలు పగలుగొట్టి - వేఁటకాఱు తన్మృగములను, ఆ రక్షకభటులా దొంగలనుబట్టియు, నధికారులు వారికి బహుమతులిచ్చియుఁ దోడ్పడవలయును. పాములు, తేళ్ళు, ఆళువలు, పులికోచలు, ప్రాణులకు హానిగలిగించియు; మిడుతలదండు, చిలుకలు, ఎలుకలు, అనావృష్టి, అతివృష్టులఁ బృథివికి దిగిచేయుసాయము మా పత్రికకొఱకే యుపయోగింపవలయును. రాజులు యుద్ధములుచేసి, పౌరుషశాలులు, శూరత్వము కనఁబఱిచియు, జెట్టిలు, మల్లులు, గొలుసులు త్రెంపి ఱాళ్ళబండ్లు గొంతుపై నెక్కించుకొనియును, అనాయపకులఁ జోరులును, బరధనముల హరించియు, జారులు పరస్త్రీలను మోసగించియుఁ; గులటలు సంసారధనికపురుషుల బీదలఁజేసియు; మోసగాండ్రమాయికుల వంచించియుఁ; బతివ్రతలు చెడిపెలకు బుద్ధిచెప్పియు; నలిచన్రలు గనినవనితలు ముగ్ధలను దుస్మార్గమునకు మరలించియు; బందీకృతులు కారాగారాధికారులను వంచించి తప్పించుకొనియు (తప్పించుకొన్నందుకు శిక్షింపబడుచున్నారుగాని యంతెత్తుగోడ నిరా

ధారముగా దుమికినందుకై బహుమతిఁబొందుటలేదని విచారించుచున్నాము) ఉరిస్తంభమెక్కి త్రాడుతెగినవారు బ్రతికియు, ఉరిశిక్ష బొందఁబోవువారు 'నీ కడపటికోరిక యే'మనిన - చెఱసాలనాయకుని మఁగనాలిం గోరియు - వ్యాపారులు పుడుచ్చేరిలో, ఏనాములో నివసించియు; గ్రామములు, గర్భాగారములుఁ, గాలియు, వైద్యులు రోగుల బాగుచేసియు, శస్త్రవైద్యము చేసి చంపియు, గ్రుడ్డికన్నూడదీయుమనిన మంచికన్ను దీసి వైచియు, త్వరలో మా స్వప్నముని రసవిషగంధకములు ప్రయోగించి, యపథ్యముచేసినావని రోగిని నిందించి కాలుగీలు పడఁగొట్టియు; నోరుపట్టి, వాతముచేసి, యవస్థ్యులై మంచమెక్కినరోగులను వారిబాధయుఁ బత్రికలోనికెక్కినట్లు చేసియు; (శతమారులు సహస్రమారులు వారివారి సమాచారములు రహస్యముగానైనను దెల్పవేఁడెదము). అత్తలవలనఁ గోడండ్రును, గోడండ్రవలన నత్తలు నాఁడుఁబడుచులు, నూతఁబడి గోతఁబడి, నల్లమందు నూనెత్రాగి, చచ్చి-గొంతునులిమి నూతఁబడవైచి కడుపునొప్పిబాధచేఁ దాళఁజాలక యాత్మహత్య చేసికొన్నదని నిర్ధారించుటకై యనేక యత్నములుచేసియు; ముంతపొగలు, మానికపొగలు పెట్టియు; పరీక్షలలో నుత్తీర్ణులుగాని విద్యార్థులు ద్రావకములుద్రాగి, రైలుక్రిందఁ దలపెట్టి శాంతిచిత్తులై - ఏకపుత్రులైన యువకులు, దత్తులుఁ, దలిదండ్రుల కలజడి కలుగులాగున విధవావివాహములుచేసికొని, మతాంతరప్రవిష్టులయి - అనేకు లనేకవిధముల నగలకై చిన్నబిడ్డలను బొరుగింటినుండితెచ్చి ముద్దాడుచుఁ దలలు దువ్వుచుఁ జంపి నట్టింటను గోడలలోను బూడ్చినపుడు పసిగట్టిన రుక్కలుద్యోగుల కీగడనిచ్చియుఁ; జట్టెక్కి పడి యిండ్లు గోడలు గూలి మరణించి - నమ్మి దాపఁ బెట్టినధనము హరించి, తన యుద్యోగ మీయలేదనియో, పసపుఁ జెలియింటికేగ డబ్బడిగిన నీయలేదనియో, యధికారులను దండ్రులను జీఁకటిచాటునఁ బొడిచియు; దయ్యములను వదలఁగొట్టెదమని, భూతవైద్యము చేసెదమని, మంత్రోపదేశము చేసెదమని, యేకాంతమునందును తెరలలోను - దాసురాండ్రను జేసికొని - పరికెముగ్గులవాండ్రు మేకపేగులుదాల్చి పద్మములువైచి బిందినాదములుచేసి చిందులుద్రొక్కి ధనముగడించి, స్త్రీలను బురుషులుఁ బురుషులను స్త్రీలు మోసగించియు, ఘోరహత్యలుచేసి తప్పునాశెములు సృష్టించియుఁ; బరభార్యలనింటఁ బెట్టుకొని సిగ్గువిడిచియుఁ, బరునియింటనుండి వాఁడలసవదినెనైయై చక్కట్లుదిద్దియు - శిక్షాదులనుండి తప్పించుకొనివచ్చి నిష్కళంకముగా నప్పుడే యాకాశమునుండి దిగివచ్చినట్లు నటించియుఁ, భగినీప్రియుఁడైన దుర్మార్గునివెంట నుద్యోగాశచేఁ దిరిగియు, బిరుదములుగొనునపుడు, సభాధ్యక్షత నొందినపుడు-సంపుటకత్తె కొడుకులచేఁ బద్యములు చదివించికొనియు - సిగ్గుమాలి వారు చదివియు నిదియది యని వీరువారని కాకుండ సమస్తప్రపంచము మా కుపకరింపవలయును అన్నియు మేమిందే చెప్పివైచిన రసము లేదు.

మఱియు మోటారులు, స్టీమరులు, రైళ్ళు, ఫ్యాక్టొరీలు, మహానదులు, వానిమీఁదివంతెనలు, లోకమున కుపకరించి మాపత్రికకు హారము కల్పింపవలయును. మాకేలయని మీరూరకుంటిరా మాయత్నము సాగదు. లంచగొండులగు పెద్దచిన్న యుద్యోగులు, న్యాయవాదులు, జూదగాండ్రు, ఎఱుకలసానులు, (స్త్రీల పాలింటి ధర్మవైద్యశాలలు) పత్రికాధిపతులు; అయథార్థములు ననుమానములు నగు విషయములు వ్రాసి తగవులుపడి; చిఱుతిండి యంగళ్ళవాండ్రు, చుట్టలుఁ దములపాకుల నమ్మువారు; గంజాగృహములవారు నరువుపద్దులలో నెక్కువవ్రాసి యంకెదిద్ది - రహస్యముగాఁ దమయొద్దకి వచ్చువారీయవలసిన స్వల్పద్రవ్యమునకై నడివీధిని బొడ్డుకొంగులోఁ జేయివెట్టినిలిపి - నిరుద్యోగులు గౌరవకుటుంబములవారి కాకాశరామన్న యుత్తరములు వ్రాసి - విద్యాధికులు సదుద్యోగములు చేసియుఁ, బండితులు సత్కవిత్వముఁ జెప్పియు, సదుపన్యాసములిచ్చియు, విద్యార్థులను దమయంతవారిం జేసియు - సత్ప్రభులు సత్పరిపాలనము గావించియు, దాతలు పేదలం దనిపియుఁ, బుణ్యాత్ములు ధర్మము లొనర్చియు, బిచ్చగాండ్రు యాచించియు, బట్లు పొగ

డియు, సద్వ్యాపారులు న్యాయార్జిత విత్తమున నింద్ర
భోగము ననుభవించియు, ధనవంతులు దరిద్రుల బ్రది
మికి సాయపడియు, కృతజ్ఞులు కృతఘ్నులు గాకయు,
విత్తవంతులపుత్రులు దుర్వ్యాపారములచే శిక్షులై
ఉద్యోగముచేయను, జుట్లలయంగడి పెట్టను, సాహసిం
చియు, సేవకులు స్వామిద్రోహులు కాకయు, శిష్యులు
గురుద్రోహులు గాకయు, కాంతలు పురుషుల నుపచరిం
చియుఁ, బురుషులు మగనాండ్ర సన్మానించియు,
నాటకశాలలు, అందు డబ్బీయకుండవచ్చు ప్రేక్షకులు,
వారు తెలియమనోళ్లు—గర్భిణులు విచిత్రసంతానము
చేతను, బహువులు సజాతీయేతరముల నీనియు, మాపత్రి
కకు సాయము చేయవలయును. ధాన్యపుమరలు, కాగి
తపుమరలు, నాటకశాలలు, మొదలగునవి కట్టుటకై
లక్షలువెచ్చించి పని ప్రారంభించునాఁటికి భాగస్వా
ములు డబ్బీయకయు; నిచ్చినది వృధావ్యయముజేసియుఁ
దత్సంఘములవారు; రెట్టి వెలపెట్టి కొనిన భూములలోని
కర్మాగారములను బంధులకుఁ గాడిదెలకు నద్దెలేకుండ
కొన్నికొన్ని, ధర్మసత్రములవలె మూఁడునాళ్లకంటె
నెక్కుడుకాలముండఁగూడదను నియముపెట్టక - యా
జన్మాంతము నుండనిచ్చియు - మాపత్రికకుఁ గొంతవిష
యము దొరకనీయవలయును. మాపత్రికలో జనులంద
ఱును వారివారి సందేహములు తీర్చికొనవచ్చును :—
నక్క ముదిరి వఱదగునా ! తొండముదిరి యూసరవెల్లి
యగునా ! గ్రద్దముదిరి పులుగగునా? భ్రమరము కీటక
మును దెచ్చి తనపిల్లనుగా జేసికొనునా? త్రాఁచును
జెట్టిగొడ్డును బోలముపారునా ! జాత్యంతర వివాహ
ములు గావించుకొన్నవారిబిడ్డ లేవర్ణమువారగుదురు—
ఇట్టివి మీ శంకానివర్తులు - తీఁగలు, గుల్మములు, దోహ
దవిశేషమునఁగాక, మల్లె గులాబిని పూచియుఁ; జంద్ర
కాంతము జాజిపూవులు పూసియుఁ; తాటిచెట్టు పలవలు
చిలువలు వేసియు, సీతచెట్టు పగలుపండుకొని రాత్రులు
లేచి నిలువఁబడి మాయుద్యమమున కుపకరింపవల
యును.

ఒక్క రేమి, యొక్కలేమి? వివిధవృత్తులవారు,
తమ కృత్రిమ వ్యాపారములచే నితరులను మోసపుచ్చి
మాపత్రిక కింతగతి కల్పింపవచ్చును. అధాత్తుగా వానకు
నాని గోడలుకూలి యక్కడ నల్పశంకకుఁ గూరుచున్న
వారిమీఁదఁబడి మాపత్రికలోని కడపటివార్తలకని
విడిచిపెట్టిన స్థలము పూర్తిచేయింపవలయును. ఒక్క
పుట పూర్తిగా భీమాలసఁ బ్రకటనలకు విడిచెదము.
కొంతభాగము మమ్మొకరు తిట్టుటకు; మేము మరల
వారిని దిట్టుటకు—మృదువైన బూతులకు, అసంబద్ధ
ప్రలాపములకొఱకు, మంచివానిని జెడ్డవాఁడనుటకు,
పొట్టచేతవానిని గుంటికాలివాఁ డాక్షేపించుటకు, నిలువ
యుంచెదము. వివిధ కవులకు మంచితరుణమిది. పురాణ
కవులు, ప్రబంధకవులు, గద్యకవులు, ఖండకావ్యకవులు,
నాటకకవులు, నవలాకవులు, భావకవులు, శుభలేఖ
కవులు, ప్రామిసరీనోటుకవులు, సృష్టిపత్రకవులు, చచ్చు
కవులు, చావుకవులు (చచ్చుకవులనఁగాఁ జచ్చినవారి
మీఁదఁ బద్యములు వ్రాయువారు, చావుకవులనఁగా
వీరుగొప్పవారు - చావు నిత్యముగనుక - యెప్పటికైనఁ
జత్తురు. అప్పటికేవైన నాల్గుపద్యములల్లి పెట్టుకొంద
మని - తానంతవఱకు బ్రతుకుదునను నమ్మకములేఁ
బద్యము లిప్పటినుండి యల్లువారు) హాస్యకవులు వీరి
క్రింద సర్వత్ర తావున్నచోటనెల్ల నవకాశమీయఁ
బడును. స్వేచ్ఛాకవులు, నిష్టానుసారకవులు, చోర
కవులు, యక్షగానకవులు, హరికథాకవులు, యాచక
కవులు-తమ్ముఁ బై వారిలోఁ జేర్పలేదని మమ్మునిందింప
వలదు. మాపత్రికలో వారికి సర్వస్వాతంత్ర్యములుం
గలవు. నాటకములలో వేషములు వేయువారికిఁ గావల
సిన బిరుదులు - ఉన్నవారికిఁగాక లేనివారికి నూతన
ముగాఁ గల్పించి స్వల్పద్రవ్యమునకే మేము ప్రకటిం
చెదము. మాకొక్కరు కావలయుననియు నొక్క
రక్కఱలేదనియు లేదు. పిపీలికాది బ్రహ్మపర్యంతము
స్థావరజంగమములు - ప్రాణులు నప్రాణులు - (శవ
ములు, రాత్రిచచ్చి ప్రొద్దునలేచి - చితిమీఁదఁ బెట్టిన
దేహము సెగదగిలి లేచి యముఁడు నన్నుఁగాదఁట పిలి
చినదని) తోడుపాటొనర్చినగాని మేము నెగ్గఁజాలము.

అని యింతటితో ముగించి ప్రకటనపత్రికలు ప్రచు
రించితిని. మఱియు నందు వ్యవధిలేక, తావుచాలక

విడిచిపెట్టిన విషయములు - అధికారులతో, వారి భార్యలతో, వారి వంటబ్రాహ్మణులతోఁ నొద్దె మంగళ్ళతోఁ బగటివేసగాండ్రతోఁ జెప్పితిమి. భ్రమనొంది తొందరపడఁబోవు కొందఱు ముగ్ధాంగనలతో - తల్లీ; నీవు వెఱ్ఱిదానవు - నాటకములో వేషము వేసినపుడే యట్లుండునుగాని యతఁడు సుందరుఁడు కాఁడు, ఆ యీ విషయములు మాపత్రికలోఁ జూడవచ్చునని సమాధానపఱచితిని.

రెండవసారి యింకొకప్రకటన చేయించితిని గాని, అయోధ్యాధికారులు - ఎన్నఁడును లేని క్రొత్తపద్ధతి మాపట్టణములో వలదు. ఒక్కరిని బొగడి యొక్కరిని దెగడి మంచివిషయము వ్రాసిపంపినను దమకిష్టములేక ప్రకటింపమాని - ఎవరికిఁ దోఁచినదానిని వాఁడు వేదమని యందఱు నిట్లే పిచ్చిలోఁబడవలయునని లోకమునకుఁదెల్పి యలజడిపాలు చేయుచుండును గావునను, ఎవ్వరేదియిచ్చినను బ్రకటించుననుటచే రాజదూషణములు, నిరపరాధ దూషణములు, దుష్టభూషణములు వ్రాసిపంపినఁ బ్రకటించి లోకాపకారము చేయుదువు కావునను - ఎందఱో చెప్పినను వినక ధనవ్యయము చేసికొని, యున్న యుద్యోగము విడిచికొని పత్రికాప్రకటనము మొదలిడియు, ముద్రాయంత్రములు నెలకొల్పియు నెగ్గక చెడినవారిని గొన్నితావులఁ జూచుచున్నాము. కావున - నీ వెంతవఱకు నిర్వహింతువో సందేహము కావునను- రామాదులనుండి యిప్పటివఱకు లేని యీ పత్రికాప్రకటనము మా యయోధ్యలో వలదు. అని యుత్తరువు చేసిరి. ప్రకటనకై ముద్రాక్షరశాలను నేను సొమ్మిచ్చుటకు నాయొద్దను లేకపోవుటచేతను - మొదటిప్రకటన సొమ్మయినను మా కిపుడిచ్చితివా కొంత యదనునకాధారముగా నుండును - నెల చివర - జీతములకుఁ గావలయునని ముద్రాక్షరశాలాధికారి బాధించుచుండుటచేతను - ఒక్కరికిని దెలియకుండ నర్ధరాత్రమున నా స్థానమువిడిచి యెందో దయచేసితిని.

—కొత్తపల్లి సూర్యారావు.

# చింతా జ్వరము

సీ. భేషజం బద్దాని భేదింపఁ జాలదు
లంఘనంబున నెద్ది లావుచెడదు
తఱిగించు బుద్ధినిద్రామహోత్సాహశు
ధాకార తేజోబలాది నెద్ది
నాసత్య చరక ధన్వంతరి ప్రభృతి వై
ద్యులకు నసాధ్యమైయుండు నెద్ది
దివసంబు లాఱే డతిక్రమించినయప్డు
జీర్ణత్వదశ నధిష్ఠింప దెద్ది

గీ. ప్రత్యహంబు నవత్వంబు వడయు నెద్ది
యట్టి చింతాజ్వరంబు నన్నలముకొనియె.

—శ్రీ నాథ మహా కవి.

# వాయసము

సీ. వసుధ నెవ్వనిసదన్వయకర్త జేజేల
ఱేనికిఁ గులముద్ధరించు కొడుకు
పితృకార్యములు సమర్పింతు రెవ్వానికి
నాదిత్యరుద్రవస్వగ్రభుక్తిఁ
బొదలు నెవ్వనిగృహంబున మనోహరభార
తీభారవహ ముఖద్విజకులంబు
పధికసంతతి కేరుపఱచు నెవ్వని కంఠ
మిశ్రితారావంబు మేలుగీల్పు

గీ. ప్రజ్ఞపెంపున నెవ్వాని బలమునకును
బ్రహ్మకొడుకైన లెక్కఁజెప్పంగఁజాలఁ
డతఁడు నగరోపకంఠ చైత్రాగ్రవర్తి
పక్షిమాత్రుండె వాయస పరివృఢుండు.

— వేంకటనాథుడు.



సరోవర ప్రాంతము



సర్ జోసెఫ్‌లాయిస్సు.

# సర్ జోసెఫ్ లాయిన్సు

## [ఆంగ్లదేశపు గొప్ప వంటపూటి వర్తకుడు]

'ప్రమాదభయమున ప్రారంభమును మానవలదు. చేసినప్రారంభము తప్పినచో చింతింపవలదు మొదటి నుంచి తిరిగి ప్రారంభింపుము' అను ఉపదేశము జోసెఫ్ లాయిన్సు తఱుచుగా ఇతరులకు చెప్పుచున్నాడు. అతనికి విజయమునుగూర్చిన వ్యాపారరహస్యములలో నిది యొకటి. 'పనిచేయుటవంటి వేడుక మఱియొకటి లేదు' అని అతని మఱియొక ఉపదేశము. ఉపదేశించుటయే గాదు. తాను జీవితాంతమువఱకు అనుసరించినాడు.

వ్యాపారశిఖరమంటిన పలువురివలెనే జోసెఫ్ లాయిన్సుకూడ తన జీవితారంభదినములలో మిక్కిలి పేదవాఁడై యుండెను. లండనునందలి కెన్‌సింగుటన్‌లో అతనిగృహము. లాయిన్సు బాల్యమున కెన్‌సింగుటన్ ప్రాంతము అందమైనదిగాదు, అభివృద్ధినందుచున్నదియు గాదు. నేఁడా ప్రాంతమున చూపఁదగు అభివృద్ధి చిహ్నములేమియు నాఁడు గానరాకుండెను. సాధారణముగ పేదబాలురు నోచి పుస్తు సామాన్యపు విద్యాలాభముమాత్రము అతఁడు పొందెను. అయితే సామాన్యులగు బాలురనుండి అతనిని అతని రెండుగుణములు వేఱుపఱచుచుండెను. సుందరవస్తువులయెడ అతనికి ప్రేమ అగ్గలము. నిశ్చితార్థము విడువకుండుటలో అతఁడు నిపుణమతి.

కళ్ళజోళ్ళు తయారుచేయు ఒకానొక వర్తకునికడ అప్రెంటిసుగా నుండుట అతని మొదటి ఉద్యోగము. ఈ ఉద్యోగమున నుండినప్పుడే అతఁడొక క్రొత్త మోస్తరు స్టీరియోస్కోపును కనుగొనెను. దీనివలనగాని కళ్ళజోళ్ళవలనగాని ధనార్జనముచేయుట సుకరముకాదని అతఁడు గ్రహించెను. చేసినప్రారంభము తప్పినది. కాని అతనికి చింతలేదు. వృత్తిమార్చినాడు. కళ్ళజోళ్ళ నిర్మాతకడ అప్రెంటిసుగా నుండినవాఁడు ఇపుడు చిత్రకారుఁడైనాఁడు. నీటిరంగులతో కృషిసల్పినాఁడు. పెయింటరుగా మంచిపేరు సంపాదించినాఁడు. అతని చిత్రములు కొన్ని రాయల్ ఇన్‌స్టిట్యూట్‌నందు ప్రదర్శింపబడినవి. అట్లు ప్రదర్శింపబడిన చిత్రములలో పెక్కులు అమ్ముడుపోయెను. సర్ స్పెన్సర్ విల్సు, ఎడ్మిరల్ సర్. ఇ. విల్‌మాట్ మొదలగు పెద్దలు అతని స్కెచ్చిలను కొనువారు. లాయిన్సు అతిదీక్షతో చిత్రములను చిత్రించువాఁడు. నిజమైన చిత్రకారుల అందఱివలెనే లాయిన్సుకూడ తాను చిత్రించిన చిత్రములను అమ్ముటకు కక్కసించుకొనువాఁడు. 'నాఆత్మకు ఇంపైన చిత్రమును చిత్రించినపుడును, మనసుపడి చిత్రమును చిత్రించినపుడును దానిని నాణెములకు బదులుగా ఇచ్చివైచుట నాకు ఘోరమనిపించునది.' అని లాయిన్సు చెప్పువాఁడు. కావున అతఁడు ఉదరపోషణార్థము వేఱొకవృత్తి నవలంబించి విలాసార్థము మాత్రమే చిత్రకళ నవలంబింప కృతనిశ్చయుఁడయ్యెను.

చిత్రకారులు వ్యాపారకుశలులు కాజాలరని ప్రజల నమ్మకము. తమచిత్రములు అమ్ముకొనుట ఎట్లో ఎఱుంగక సిద్ధహస్తులగు ఎందఱో పెయింటర్లు జీవితాంతమువఱకు పేదవారై యుందురు. ఎట్లో తమచిత్రములను అమ్ముకొనగలుగు చిత్రకారులు పోడిమి ఎఱుఁగక ఎంత వచ్చిన అంతయు ఖర్చుచేసికొని అవసరసమయములందు నకనక పడుదురు, ఇట్టిస్థితిలో చిత్రకారుఁడొకఁడు వణిక్పుంగవుఁడయ్యెనని చెప్పుచో నమ్మరానిదిగా నుండును. చిత్రకారుఁడు వర్తకుఁడయిన నిదర్శనము ప్రపంచేతిహాసమున మఱియెచ్చటను కానరాదు. అదియునుగాక ఇప్పటికి లాయిన్సునకు ముప్పదియేండ్లు నిండినవి. అట్టి వయస్సులో క్రొత్తవృత్తి నవలంబించుటయు కష్టమే అగుగాక! జీవితమును తిరిగి మొదటినుండియు ప్రారంభించుటకు ముప్పదియేండ్లు నిండిన ఆ లాయిన్సు కృతనిశ్చయుఁడయ్యెను. కళ్ళజోళ్ళ నిర్మాతకడ అప్రెంటిస్‌వృత్తి యైనది. చిత్రకారకవృత్తి యైనది,

ఇప్పుడు తిరిగి మఱియొక క్రొత్తవృత్తికి అన్వేషణము. ఈ అన్వేషణములో లాయన్సు అదృష్టరేఖ బయలు పడినది. శాల్మన్ అండ్ గ్లక్ స్టీన్ అని ఒకఫరము. ఆఫరమువారు చుట్టలనిర్మాతలు. చాలరోజులుగ వర్తకము చేయుచుండిరి. ఆఫరము భాగస్వాములలో నొకడగు మాంటేగ్యూగ్లక్ స్టీన్ అనువాడు కాఫీహోటేళ్ళ వర్తకము ప్రారంభింప ఉవ్విళ్ళూరుచుండెను. ఆదినములలో తన ఫరముయొక్క వ్యాపారాభివృద్ధినిమిత్తము గ్లక్ స్టీన్ దేశమున ప్రయాణముసల్పుచుండెను. వ్యాపారాభివృద్ధినిమిత్తము దేశమున ప్రయాణము సల్పువాడు ప్రజాసామాన్యము ఏదికోరుచున్నదో కనిపెట్టుచుండవలయును గదా. నాడు ప్రజాసామాన్యము చౌక, సరియైన కాఫీహోటళ్ళను హెచ్చుగ వాంఛించుచుండుట గ్లక్ స్టీన్ కనిపెట్టినాడు.

నాడు అనగా నేటికి ఏబదిఏండ్లకు పూర్వము హోటళ్ళస్థితి దుర్భరముగా నుండెను. మంచిహోటళ్ళు లేకపోలేదు, కాని అందలి పదార్థములు విశేషవ్యయమూలకముగ నుండెను. సామాన్యులకు అవి ఎంతమాత్రము అందుబాటున లేకుండెను. పైగా ఆహోటళ్ళ సంఖ్య బహుళముకాదు. ఇందుచే లండనులో జనులు మధ్యాహ్నభోజనములకు కాలహరణమైనను ఇంటికే పోవువారు. పోవుటకు వీలుచాలనివారును, ఇల్లు మిక్కిలి దూరమున ఉన్నవారును ఉదయమున వచ్చునపుడే తమతోకూడ ఏదియో ఇంత తెచ్చుకొని ఆ మధ్యాహ్నముపూట కడుపులు నింపుకొనువారు.

ఇట్టి శోచనీయ పరిస్థితులలో తగిలియుండి మధ్యాహ్నభోజనమునకు ఎక్కువ ఇబ్బందిపడిన లండను పౌరులలో మాంటాగ్యూగ్లక్ స్టీన్ ఒకడు. ఒక్కొక్కప్పుడు అతనికి మధ్యాహ్నభోజనము ఉండునదికాదు. ఒక్కొక్కప్పుడు అతడు ఆజీర్తికి లోనగువాడు కాగా చౌకయైనవి సరియైనవి అయిన రెస్టారెంటులను స్థాపించునో ప్రజలబాధ చాలవఱకు నివారణయగుటయే గాక ధనసంపాదనకు కూడ విశేషావకాశముండుట అతడు గ్రహించెను. అతడు ఈవిషయమును తనసోదరులతో చెప్పెను. చుట్టలవర్తకములో స్థిరప్రతిష్ఠ ఆర్జించిన ఫరము ఇపుడు క్రొత్తగా రెస్టారెంటుశాఖను నెలకొల్పుట గౌరవహీనమని ఆసోదరులు భావించిరి. అన్నవిక్రయము గౌరవహీనమైన వృత్తియను నమ్మకము నేటికీ ఆంగ్లప్రజలలో లేదు. పైగా నేడెవరైన అన్నవిక్రయము గౌరవహీనమైనవృత్తి అనుచో వారు అపహాస్యము గావింతురు. కాని ఏబదిఏండ్లకు పూర్వము విక్టోరియా మహారాజ్ఞి పరిపాలించుచున్న దినములలో ఆట్టివృత్తి గౌరవహీనమైనదేనని ఆంగ్లప్రజలు విశేషముగా నమ్మియుండిరి.

నమ్మియుండిరిగాక! మాంటాగ్యూ తనతలంపును విడనాడలేదు. అతని పట్టుచూసి అతని సోదరులు అతనితో రాజీ చేసికొనిరి. ఈక్రొత్తవ్యాపారమునకు వలయు ధనమును వారు పెట్టుబడి పెట్టుటకు అంగీకరించిరి. వ్యాపారమునకు మాత్రము కుటుంబనామము జతపఱుపరాదు. ఈవ్యాపారమునకు తనపేరిచ్చి వ్యవహరింపజాలు వానిని సేకరించుకొని వచ్చుట మాంటేగ్యూ గ్లక్ స్టీన్‌పని. ఇక్కి తమ్ముళ్లతో ప్రారంభించిన ఆవ్యాపారము ఒకజీవితకాలమున దినము ఒక్కంటికి ముప్పది వేలమంది కార్మికుల పనిని గొనజాలు రీతిని, ఎనుబది లక్షల పౌనుల మూలధనమును సేకరింపజాలు రీతిని అభివృద్ధినందునని మాంటాగ్యూ అయినను భావించియుండడు.

ప్రారంభింపబడిన వ్యాపారమునకు పేరు ఈయగల వ్యాపారికొరకు మాంటాగ్యూ అన్వేషణ ప్రారంభించెను. అతనిదృష్టి మనప్రస్తుత కథానాయకుడగు జోసెఫ్ లాయన్సుపై బడెను. జోసెఫ్‌గ్లక్ స్టీనునకు దగ్గఱ చుట్టము జోసెఫ్ చుఱుకుతనము, తెలివితేటలు, రూపురేఖలు మాంటాగ్యూ బాగుగా ఎఱుగును. కావున అతడు జోసెఫ్‌ను కలుసుకొనుటకు ప్రయాణమయ్యెను. అప్పుడు జోసెఫ్ లివర్పూల్‌నందు ఒకానొక ప్రదర్శనములో నొకస్టాలు నిర్వహించుచుండెను. మాంటాగ్యూ లివర్పూల్ వెళ్ళి జోసెఫ్‌ను కలుసుకొనెను. ఇరువురును సంప్రదించుకొనిరి. వ్యాపారము నిర్వహించుటకును, దానికి తనపేరిచ్చుటకును లాయన్సు సంసిద్ధుడయ్యెను. రెస్టారెంటు స్థాపనయను ఉద్దేశము అతనికి బాగుగ

పట్టినది. ఏమన సరియైన రెస్టారెంటులు లేక పోవుటచే బాధపడినవారిలో జోసెఫ్ యొకడు. శుచిదేవతకు విహారమందిరమై విశాలమైన తేనీటిపానశాలలతో, శుభ్రవస్త్రములతో ఆచ్ఛాదింపబడిన మేజాలతో, సొరుగా దుస్తులుధరించి పదార్థములను తెచ్చియిచ్చు వడ్డనకత్తెలతో అలరు రెస్టారెంటులనుగూర్చి ఆతని భావములు క్రేళ్ళు ఊయుచునవి. కాగా కొద్దిగంటల సంప్రదింపుతో వ్యాపారనిర్వహణ క్రమమంతయు నిర్ణయమైనది. మామూలు కాగితపు అట్టాపుపై ఒడంబడిక వ్రాయబడెను. భాగస్వాముల చేవ్రాళ్ళు ఆ కాగితముపై ఉట్టంకితము చేయబడెను. న్యూకాసిల్ పట్టణమున త్వరలో ప్రారంభింపబడనున్న జూబిలీ ప్రదర్శనమున తేనీటిపానశాల, రెస్టారెంటు స్థాపించు ప్రత్యేకమగు హక్కును సంపాదించుటతో వ్యాపారమునకు అంకురార్పణమైనట్లుగ నిర్ధరింపబడినది.

నూత్నవ్యాపార నిర్వహణమున లాయన్సు పూర్తి దీక్ష నుపయోగించెను. ఆతడు బాసగి మాటలాడగలడు, క్రమవిధానమును ఏర్పఱుపగలడు, చిత్రములు వ్రాయగలడు. కాగా న్యూకాసిల్ ప్రదర్శనమున రెస్టారెంటునడుపు హక్కు సంపాదించినతోడనే ఆతడు నొక మందిరమున హోటలు స్థాపించి మంచి తేనీరు కప్పు రెండుపెన్నీలవెలకు అమ్మదొడంగెను. మంచి తేనీరు ఆదినములలో ఇతరతావులయందు కప్పు మూడు పెన్నీలకు అమ్మబడుచుండెను. లాయన్సు మందిరమున తేనీరు చవకయగుటయేగాదు. పానశాల గాలి, వెలుతురు గలిగి చక్కగ అలంకరింపబడి శుచిగా నుంచబడెను. మేజాలపై ధవళవస్త్రములు కప్పబడియుండెను. వానిపై నడుమ క్రొత్తగాకోసిన పూలతో నింపబడి గాజుకూజాలు, వడ్డించుటకు సౌందర్యరాసులగు పడుచులు, వారు శుభ్రవస్త్రధారిణులు. ఆదినుండియు వ్యాపారము జయపథమునందెను. అగుటచే నిర్ణీతకాలము కాకుండగనే ప్రదర్శనము మూయబడు పరిస్థితులు ఏర్పడినను తేనీటిశాలను యథాప్రకారము నిర్వహించుచుండుటకే నిర్ణయించిరి. పైన వివరింపబడిన క్రొత్త ఆకర్షణలుగాక లాయన్సు హోటలునందు మధ్యాహ్నమును, సాయంత్రమును గానవినోదము కల్పింపబడెను. ఈ వినోదము బహుజనాకర్షమయినది.

పూర్వపద్ధతులతో రెస్టారెంటులను నడుపువారు లాయన్సు రెస్టారెంటునుచూచి తల అడ్డముగ త్రిప్పసాగిరి. లాయన్సుది ఒట్టి కొసవెఱ్ఱియని వారు నొక్కిచెప్పసాగిరి. 'రెండుపెన్నీల తేనీటికప్పులవలని లాభములో లాయన్సు ఆర్కెస్ట్రా గానపు ఖర్చును భరింపజాలడు. మేమియుండిచూచెదము. కొద్దిరోజులలో లాయన్సు దివాలాతీయును.' అని వారిమాట.

కాని లాయన్సు దివాలాతీయలేదు. పైగా నాతడు పేరుమోగిన ఒక హంగేరియన్ బ్యాండుమేళమును కూడ కుదిర్చినాడని విని ప్రాతపద్ధతిని హోటళ్ళనడుపువారు అప్రతిభులైరి. ఈ ఆర్కెస్ట్రావలన వారమునకు 150 పౌనులు సెలవగుచుండెను. లాయన్సు ఇంతటి విశేషవ్యయమును ఎట్లు భరింపగలుగుచున్నాడో అని ఎల్లరును ఆశ్చర్యపడజొచ్చిరి. కాని ఆతఁడా విశేషవ్యయమును తేనీటికప్పులు, రొట్టెలు, వెన్నమున్నగు వాని అమ్మకమువలన కలుగు లాభమునుండియే భరింపగలిగెను. ప్రదర్శనాంతరమున లాయన్సు రెస్టారెంటు చాల లాభమును చూపెను. అదిలో ఈరీతి వ్యాపారముయెడల విముఖులైయుండిన గ్లక్‌స్టీన్ సోదరులు కూడ ఇపుడీ వ్యాపారాభివృద్ధికి సంతృప్తులైరి. కాని అచిరకాలముననే తమ ఈవ్యాపారము ప్రపంచమునందలి రెస్టారెంటు వ్యాపారములకు తలమానికము కాగలదని వారు తలంపలేరు.

న్యూకాసిల్ ప్రదర్శనమున హోటలు విశేషలాభప్రదమయినది. కావున గ్లాస్గో ప్రదర్శనము నకూడ హోటలు నడుపు హక్కును సంపాదించుటకు వారు పూనుకొనిరి. 1862 లో లండనునందు జరిగిన ప్రదర్శనము తరువాత ఈగ్లాస్గో ప్రదర్శనమువంటి పెద్దప్రదర్శనము మఱియొకటి జరుగలేదు. ఈప్రదర్శనము జరిగిన ప్రదేశముయొక్క వైశాల్యము పదునారు యకరములు. విక్టోరియా మహారాజ్ఞి ఈప్రదర్శనమును స్వయముగ దర్శించెను. విశాలాంగ్ల సామ్రాజ్యపు నలుమూలలనుండియు ఈప్రదర్శనమునకు ప్రేక్షకులువచ్చిరి. వచ్చిన ప్రేక్షకులసంఖ్య ఆరు మిలియన్లు (అఱువదిలక్షలు) ఆ ప్రదర్శనమున హోటలునడుపు కంట్రాక్టును వారు

పొందిరి. పాకశాల నడుపుటకు తీసికొనబడిన మందిరము సర్వాంగసుందరముగ అలంకరింపబడెను. వెనుకటి ఆకర్షణలతోడు ఇప్పుడు మరియొక క్రొత్త ఆకర్షణ అతడు కల్పించెను. వడ్డనకత్తెలకందఱకును ఒకటేమోస్తరు దుస్తులు. అందఱును మేరిస్టూఆర్టు టోపీలను ధరించిరి. ఈ క్రొత్తదుస్తులు తయారుచేయుటకు విశేషధనము వ్యయమయ్యెను. కాని జరిగిన ప్రకటన మాత్రము అనంతమయి యుండెను. వడ్డనకత్తెలకు చేతులు నిండినపని.

ఆప్రదర్శనము వేసవిలో జరిగెను వాతావరణము అనుకూలమయియుండెను. అనుకున్నకంటె మిక్కిలి ఎక్కువగ ప్రేక్షకులు వచ్చిరి. కాగా లాయన్సును, అతని భాగస్వామియు ఒక్కొక్కప్పుడు తమపనిని మానుకొనికూడ వడ్డనవిషయమున కలుగచేసికొనవలసి వచ్చుచుండెను. ఈబత్తిడిని ఎట్లో కష్టపడి తట్టుకొనుచుండగా ప్రదర్శనము తుదిదినము వచ్చుసరికి ఆహారపదార్థముల నిలవ అంతయు అయిపోయినది. ఇంకి గంటలోపుగ క్రొత్తగ ఆహారపదార్థములు రానిచో హోటలు మూయవలసి వచ్చును.

ఆ దినములలో మోటారులు లేవు. అనుకున్నంతలో సరుకు గొనివచ్చుట నేటికివలె నాడు సుకరమయి యుండలేదు. కాని జోసెఫ్ ఎట్టి అలజడినిపొందలేదు. దొరికిన బండ్లనెల్ల కుదిర్చినాడు. గుఱ్ఱపుబండ్లు, చేతిబండ్లు. పట్టణమునందలి ప్రతిప్రొవిజన్ షాపునకును జోసెఫ్ మనుష్యులు పరుగులెత్తినారు. ఒక గంటలో ఇరువదివేల తూకముగల ఆహారపదార్థములు సమకూర్చబడినవి. వివిధపానీయములుకూడ విశేషముగ సేకరింపబడెను. నాటిరాత్రి ప్రదర్శనము ముగియులోపల ఏబదివేలకు మించినజనులు తమ క్షుద్బాధను అచట నివారించుకొనిరి. గ్లాస్గో ప్రదర్శనమునందే లాయన్సు తేనీటివర్తకుడగు సర్ థామస్ లిప్టన్ తో ప్రథమ పరిచయము కలిగెను. ఆపరిచయము కాలక్రమముగ గాఢస్నేహముగ పరిణమించెను.

మేరిస్టూఆర్టుటోపీలను పెట్టుకొనియున్న లాయన్సు వడ్డనకత్తెలను ప్రేక్షకులు 'లాయన్సు విధవలు' అని పిలువజొచ్చిరి. అయినను లాయన్సు వ్యాపారమున వారు ప్రధానాంగములై యుండి దాని విజయమునకెంతయో తోడుపడిరి. 1889 లో పారిస్ మహాపట్టణమున ప్రదర్శనమొకటి ప్రారంభింపబడెను. ఆప్రదర్శనమున బ్రిటీషు హోటలును లాయన్సు అందుకొనుటకు పెత్తనము కొనినప్పుడు ఈవడ్డనకత్తెలు కూడ గొనిపోబడిరి. ఒకవిధముగ అంతయు వీరికి ప్రత్యేకింపబడెను. వీరందఱు స్కాట్లాండు దేశపువారే. ఇదివఱకెన్నడును వీరు దేశమును వీడినవారుకాదు. అగుటచే వీరిలో కొంతమందికి పారిస్ పట్టణము పట్టలేదు. అట్టివారు వెంటనే దేశమునకు తిరిగిపోయిరి. వారిస్థానమున క్రొత్తవారు నియమింపబడుట నియమములమీద జరిగెను. పారిస్ ప్రదర్శనమునకూడ లాయన్సుఫరమువారు విశేషలాభము నార్జించిరి.

ధనము, ప్రతిష్ఠకలిగినమీదట లాయన్సు రాజధానినగరమగు లండనునందు హోటలు నెలకొల్పుటకు నిశ్చయించెను. 1894 వ సంవత్సరమున పికాడెల్లీ (లండనున ఒకభాగము) యందు 213-వ కవాటసంఖ్యగల మందిరమున లాయన్సు మొదటిహోటలు స్థాపింపబడెను. మొదటినుండియు అది లాభప్రదమయి యుండెను. ఒకదానివెంట నొకటి. కెన్‌సింగ్టన్ మొదలు ఆల్డుగేట్ వఱకుగల లండనున ఎచ్చట చూచినను లాయన్సుహోటళ్ళే. ఈషాపులన్నిటియందును ధరలు ఒకేమాదిరిగనుండెను. ఇది వారి వ్యాపారమునకు జయముకూర్చిన రహస్యములలో నొకటి. 'ఒకానొకవస్తువు ఒక నిర్ణీతమూల్యమునకు లభించు రెస్టారెంటులనిన ప్రజలు ప్రియముపడుదురు, ఆల్డుగేటు ప్రదేశమునకంటె పికాడెల్లీ ప్రాంతమున ఇంటిబాడుగు హెచ్చు అగుట ప్రజలు గమనింపరు. పికాడెల్లీ ప్రాంతమున ధరలు కొంచెము పెంచుటకు వారు సమ్మతింపరు. ఏమాత్రము పెంచినను కాతాదారులు తిరిగిపోవుదురు' అని జోసెఫ్ అనువాడు.

హోటలులందు వడ్డించువారికి అచటికివచ్చువారు బక్షీలిచ్చుట ఆచారమయియుండెను. కాని వ్యాపారము మితిమీఱుటచే విశేషసంఖ్య వడ్డనకత్తెలను నియమింపవలసివచ్చుటయు ఇందఱకు బక్షీలిచ్చుట సాధ్యముకాకుండుటయు లాయన్సు కనిపెట్టెను. బక్షీల

పద్ధతి తొలగింమటకు లాయన్సు తలపెట్టెను. ఈ విషయమయి అప్పటి దినపత్రికలలో ఉత్తర ప్రత్యుత్తరములు పెచ్చుపెరిగెను. హాస్యవిషయిక పత్రికల యందు ఈవిషయమునుగూర్చి వినోద వ్యాసములు ప్రచురింపబడెను. అయినను లాయన్సు భయపడలేదు. గ్లాడ్‌స్టోన్‌తో సంప్రదించి అతడు తన వడ్డనకత్తెలకంద ఱకును గ్రేడ్ ననుసరించి జీతములేర్పఱచెను. 'వడ్డించు వారికి బక్షీసు ఈయవలదు' అను నోటీసు బోర్డులు అన్ని రెస్టారెంటులయందును ఉంచబడెను. ఫరము అతి విస్తృతి నందెను. హోటలులు అన్నివేళలయందును కాతాదారులతో నిట్టుకొని యుండునవి.

సప్తము ఎడ్వర్డు చక్రవర్తి ఒకసారి ఇట్లు చెప్పెను. 'లాయన్సుఅనిన నాకు ప్రేమ. అతడు నాప్రజలకు సరియైన ఆహారమిచ్చుచున్నాడు.' రాజ్యాంగవేత్త యొకడు 'మనదేశమునందలి మద్యపాననిషేధక ప్రచారకులలో లాయన్సుమేటి' అని చెప్పినాడు. నిజముగ ఆంగ్లదేశమునందలి మద్యపాన నిషేధక ప్రచారకులలో లాయన్సు మేటియే. ఏమన అతని సుందరపానీయ శాలలు విశేషజనుల నాకర్షించి వారిని మద్యపాన శాలలబాటి పడకుండ చేయునవి. హోటలు వ్యాపార మిట్లు అతి విస్తృతినందగా లాయన్సు క్రొత్తవ్యాపారములపై దృష్టిపఱచెను. లాయన్సు తేనీటిశాలల సంఖ్య వందలకొలదిగ నుండెను. కాగా అతడు తేయాకువర్తకముకూడ ప్రారంభించెను. అతనిఫరమువారు తేయాకు వ్యాపారమున పెద్ద టోకువర్తకులైరి. అచిరకాలముననే ఈఫరమువారి ఏజెంట్లు దేశమునందలి నలుమూలలకు చొఱబాటి తేయాకు అమ్మకము విరివిగ సాగించు చుండిరి.

ఉదరపోషణార్థము ఏదేనొక వృత్తినవలంబించి విలాసార్థము చిత్రకళ నవలంబింప లాయన్సు తొలుత తలంచియుండెనుగదా! ఇప్పుడాతడు విశేషధనవంతుడైనాడు. ఇక చిత్రకళారచనకు కడంగునా? అతడు కడంగలేదు. కాని చిత్రమేమన చిత్రకళమీదికి బదులు అతనిచిత్తమిపుడు కావ్యకళమీదికి పోయినది. అతని చిత్తమున కెక్కిన కావ్యకళ ఎట్టిది? కథారచన. సీసిల్ రాలీ అను గ్రంథకర్తతో కలిసి అతడు రెండు నవలలు రచియించెను. అనంతరమాతడు స్వతంత్రముగ అపరాధ పరిశోధకనవలలు రచించుటకు దొరకొనెను. అవి మిక్కిలి మనోజ్ఞములై యుండెను.

ధనము, ప్రతిష్ఠ అతనికి తలమున్కలయ్యెను. జోసెఫ్‌లాయన్సునకు సర్ బిరుద మీయబడెను. సర్ బిరుద మందినప్పుడు అతనికెన్నియో అభినందనలేఖలు వచ్చెను. సర్ జోసెఫ్ గొప్ప వితరణకలవాడు. అయితే అతడెన్నడును తనదానములను గూర్చి ప్రశంసించుట ఎఱుగడు. పాత్రమెఱిగి దానముచేయువాడు. అతనివలన ఉపకారము పొందినవారి సంఖ్య కొద్దికాదు.

అర్థుల యెడ అతనికిగలదయ ఇంతింతకాదు. ఒకనాడు అతడు చుట్టకాల్చుచు పికాడెల్లీలో నొకచోట ఏదియో నొక విషయమునుగూర్చి ఆలోచించుచు నెమ్మదిగ పోవుచుండెను. అప్పుడు తనను ఎవరో వెన్నంటుచుండుట అతడు తెలిసికొనెను. తిరిగి చూచెను. చిన్నపిల్లవాడొకడు కూడ వచ్చుచుండెను. లాయన్సు వీధినిదాటి అవతలపక్కకు వెళ్ళెను. అప్పుడుకూడ ఆ బాలుడు అతని వెన్నంటుచునే యుండెను. సర్ జోసెఫ్ నిలబడి వెనుదిరిగి ఆ బాలుని తేఱిపాఱ చూచినాడు. లాయన్సు మాట్లాడకుండగనే ఆ బాలుడు చెప్పదొడగెను: 'అది కాల్చుట ఇంకను కాలేదా? ఇంకను కాల్చినచో మీ మీసము లంటుకొనవా?' సర్ జోసెఫ్ అడిగినాడు ఏమిటి నీ అభిప్రాయమని. 'మానాన్న కుంటివాడు. పొగాకుకొనుటకు డబ్బులేదు. కాని చుట్టకాల్చుట అతనికి మిక్కిలి ప్రియమయినది. మీరా చుట్టకాల్చి పాఱవేతురేమో అని చాలసేపటినుంచి మీ వెంటబడి వచ్చుచున్నాను.' అని బాలుడు చెప్పినాడు. ప్రశ్నించి లాయన్సు బాలుని పుట్టుపూర్వోత్తరములు తెలిసికొన్నాడు. ఆ బాలుని తండ్రికి చాలదినములవఱకు సరిపోవు పొగాకును అతడు ఇచ్చినాడు.

కథారచన, చిత్రరచన, దానధర్మములు – ఇన్ని పనులు వీనికితోడు అతనికి నాటకములకు పోవుట నిత్యకృత్యము. కాగా తన కడకాలమున నాతడు వ్యాపారకార్యనిర్వహణభారమునంతను సమర్థులగు తన మేనేజరులకు అప్పగించియుండునని పలువురు

భావింతురు. కాని అతట్లు అప్పగింపలేదు. ప్రతిదినము భాగస్వాములతో సంప్రదించువాడు. ఆతని హోటళ్ళసంఖ్య మూడువందలు. ఈ మూడువందల హోటళ్ళయందును దినమునకు ఏడులక్షల ఏబదివేల మంది—మద్రాసు మహానగరపు మూవత్తు జనాభాకు మించిన జనులు—క్షుద్బాధను బాపుకొనుచుందురు. ఈ మూడువందల బ్రాంచిలనుండియు ఆయా బ్రాంచిల ఎక్కవుంటులు ఏదినమున కాదినము ప్రధాన కార్యస్థానమునకు రావలసినదే. ఏనాటి కానాడు వానినెల్ల పరిశోధించి జమాఖర్చులు తేల్చవలసినదే.

రెస్టారెంటు వ్యాపారములలో విశేషనష్టము కప్పులు, సాసర్లు మొదలగునవి పగిలిపోవుటచే కలుగుచుండును. ఈ నష్టమును తొలగించు విషయమును గూర్చి విశేషశ్రద్ధతో ఆలోచించిన రెస్టారెంటు వర్తకులలో లాయన్సు తొలుతటివాడు. ఏడాదికి వేల కొలది నష్టమును కలిగించు దీనిని తొలగించుటయెట్లు? కొందరిచేతులలో వస్తువులు తఱుచు పగులుచుండుట, కొందఱిచేతులలో వస్తువులు చిరకాలము మన్నుచుండుట ఆతడు కనిపెట్టినాడు. ఎవరిచేతులలో వస్తువులు తఱుచు పగులుచుండునో అట్టివారినెల్ల ఆతడు ఇతర పనులకు వినియోగించువాడు. అచ్చట వారికి కప్పులు, సాసరులు ముట్టవలసిన అవసరములేకుండెను. ఈ విధానముచే ఈ నష్టమెంతయో తగ్గిపోయెను. వలయు వస్తువులు విలుచుటలో - కొన్నవస్తువులు దుబారా కాకుండ నుంచుటలో అతిజాగ్రత్త. సర్ జోసెఫ్ ఒకసారి ఇట్లుచెప్పెను: 'చెప్పిన నమ్మరు. మేము సరుకు నిలవచేయుగదినుండి ఈ దినమున ఏదియైన వస్తువు పోయినచో రేపటి ఉదయమునకు దొంగతనము వెల్లడియగును!'

కార్యనిర్వాహణ చక్రమంతయు నొక గడియారము వలె పనిచేయును. ప్రతి స్వల్పవిషయమునుగూర్చియు ఆఫరము వారు చూపు శ్రద్ధకు ఈ క్రిందివిషయము మంచి నిదర్శనము కాగలదు. పాక గృహమునకు వచ్చిన ప్రతి ఆర్డరుమీదను అప్పుడు ఎన్నిగంటలు ఎన్ని నిముసములైనదో స్టాంపు వేయబడును. ఆర్డరు చేయబడిన సరుకు పళ్ళెమున అమర్చబడి పాకశాలను ఎన్ని నిముసములకు వీడుచున్నదో ఆర్డరుపై మఱియొక స్టాంపు వేయబడును. యుద్ధకాలమున ఆహారపదార్థముల విలువ పెచ్చుపెరిగిన సమయమున లాయన్సు ఫరమువారు గావించిన దేశసేవ నిరుపమానమయినది. నేటికికూడ ఆఫరము దినదిన ప్రవర్ధమానమగుచున్నది. ఆఫరమున ముప్పదివేలమంది ఉద్యోగులు. కెన్సింగుటన్ నందలి కాడ్బీహాల్ లోని ఈ ఫరమువారి ప్రధాన కార్యస్థానము యొక్క ప్రదేశము పదునొకండు మైళ్ళు. గ్రీన్ ఫోర్డునందలి ఈ కంపెనీవారికి ఒకపెద్ద ఫ్యాక్టరి గలదు. ముప్పదియకరముల ప్రదేశము. అందు టీ, కోకో, కాఫీ, పెప్పరుమెంట్లు మున్నగునవి తయారు చేయబడును. ఉపాహారములు, పానీయములుగాక ఒక్క భోజనము మాత్రము చేయువారు లాయన్సు రెస్టారెంటులలో వారమునకు పది మిలియన్లమంది. దినమునకు ఇరువదిలక్షల ఐస్ క్రీమ్ ముక్కలు; వ్యాపార విస్తృతిని గమనింపుడు.

తమ పనివారల క్షేమాభివృద్ధుల విషయమయి లాయన్సు ఫరమువారు అతిశ్రద్ధ చూపుదురు. ఈ ఫరమువారిచ్చు జీతాలలిస్టు ఒకసారి పరికించుచో అందు డాక్టరులు, దంతవైద్యులు మున్నగువారి నామములు కానవగును. వీరందఱును లాయన్సు ఫరమువారి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణమునకు పూటకాపులు. ఫరమువారి యాజమాన్యమున ఉన్నగాయకుల సంఖ్య విశేషము. గాయకులకే జీతములక్రింద ఈ ఫరము వారు సాలునకు 150,000 పౌనులు వెచ్చింతురు. పనివారల సౌకర్యార్థము ప్రత్యేక మొకక్లబ్బు. ఆ క్లబ్బు వైశాల్యము డెబ్బదియకరములు. అచట ఫుట్ బాల్ మొదలగు ఆటలకు సౌకర్యములు నిండారియుండును. వర్తకత్తెలకు విద్యాలాభము కలుగుటకు ప్రత్యేక పాఠశాలలు. లాయన్సు హోటళ్లలోని రొట్టి ప్రశస్తమయియుండును. కావున కాతాదారులు విఱగబడి వత్తురు. నేడు దినమునకు 130 000 రొట్టెలు ఆఫరములో వెలబోవుచున్నవి. ప్రజలకు వారిఇష్టమైనవస్తువు లిండు. వారువానికొఱకు విఱగబడివత్తురు ఇది వ్యాపార రహస్యము.

# ఆరోగ్యవిజ్ఞానము

## ౯. తులసిభేద, గుణ, ప్రయోగములు

భేదములు:—

గ్రామ్య - అరణ్య భేదముచే రెండు విధములు. గ్రామ్యము తిరిగి దీర్ఘ హ్రస్వ భేదముచే రెండువిధములు. అందు దీర్ఘముగా నుండువానిలో కృష్ణతులసి, శుక్లతులసి, గంధతులసి యను మొదలగు భేదములు గలవు. ఇందలి గంధతులసియే రుద్రజడ(డ) యని యాంధ్రమున బిలువబడుచున్నది. హ్రస్వముగా నుండు వానిలో మరువకము (మరువము) ప్రధానమైనది. అరణ్యతులసిలో రెండు భేదములు కలవు. అందు ముఖ్యమైనది భూతతులసి లేక భూతులసి అని వ్యవహరింపబడును.

సామాన్యగుణములు:— కటురసము, తిక్తానురసము, ఉష్ణవీర్యము కలిగియుండును. హృదయమునకు హితమైనది. జాఠరాగ్నిని వృద్ధిబొందించును పిత్తమును వృద్ధిబొందించును. కఫవాతములను శమింపజేయును. దాహము, కష్టము, మూత్రకృచ్ఛ్రము, రక్తదోషము, పార్శ్వశూల అను నీ వ్యాధులను బోగొట్టును. క్రిమిహర విషహర ద్రవ్యములలో శ్రేష్ఠమైనది.

విశేషగుణములు:—

రుద్రజడగింజలు (సబ్జాగింజలు) :—శీత వీర్యమును కలిగియుండును ప్రమేహమును ఉదరమును రక్తాతిసారమును బోగొట్టును. ఆకులు క్రిములను, సర్పవిషమును బోగొట్టును.

మరువము:—పరిమళము కలిగియుండును. జాఠరాగ్నిని వృద్ధిబొందించును. వృశ్చికాదివిషమును కుష్ఠమును కృములను బోగొట్టును. మలబంధమును ఆధ్మానమును శూలను బోగొట్టును.

భూతతులసి:—రక్తదోషమును, కండువును, క్రిములను విషమును బోగొట్టును. సుఖప్రసవమును కలిగించును.

ప్రయోగములు:—

1. కఫజకాసయందు - శుక్లతులసీ పత్రస్వరసమునందు తేనె కలిపి సేవించిన శమించును.
2. నవనేత్రకోపమున - తులసీపత్రస్వరసమున తేనె కలిపి అంజనము వేయవలెను.
3. పూయముచే కలిగిన - కర్ణరోగమునందు తెల్లని తులసి వీనిరసమును కర్ణపూరణము చేయవలెను.
4. కుష్ఠమునందు - తులసివేరును, శుంఠిని మెత్తగా కల్కమునూరి ప్రతిరోజున ఉదయమునందు వెచ్చనినీళ్ళతో సేవించవలెను.
5. చిన్నపిల్లలకు కలుగు కాసశ్వాసాది వ్యాధులలో వీని పత్రముల రసమును తేనెతో కలిపి నాకించుటయు, ఏరండతైలమున కలిపిపట్టుటయు మొదలగు గృహచికిత్సా సాంప్రదాయములు ప్రతిగ్రామములోను అనుసరింప బడుచున్నవి.

—డాక్టరు ఐ. వి. శర్మ, ఎ.ఎం.ఎ.సి.

## ౯. ఆరోగ్యవిషయమున తులసి ఉపయోగము

తులసిమొక్క అందరు ఎరిగినదే. ప్రతి హిందూ గృహమున దానిని మనము చూడగలము. తులసిమొక్క ఒకటిరెండు అడుగులఎత్తు పెరుగును. తులసి రెండువిధములు. ఒకటి నల్లనిఆకులు కలది, ఒకటి పచ్చనిఆకులు కల్గది. తులసి వెన్నెలలోనిగింజలే దాని

విత్తనములు. తులసి ఆకులలోను, వెన్నులలోను ఒక విధమైన సువాసనయుండును. తులసి హిందువులకు పవిత్రమైనది. దానియందు అద్భుతములగు రోగనివారక గుణము కలదని ఆయుర్వేదశాస్త్రము చెప్పుచున్నది. కావుననే అది మనదేశమున ప్రతియింటను పెంచుట ముఖ్యావసరమైనది. తులసి ఆరోగ్యవర్థకము. రోగ కారకక్రిములను నాశనముచేయును. వాయువును శుద్ధపఱచును. ఇప్పుడు ప్రతిపల్లెయందును; పట్టణమునందును తేయాకు ఉపయోగము చాల విశేషమైయున్నది. తేయాకునందు టెనిన్ అను ఒకవిధమైన విషముగలదు. ఆ విషము ఆరోగ్యమునకు భంగకరమైనదని వైద్యశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. తేనీరు తఱుచుగా త్రాగువారి జఠరాగ్ని మందగించి ఆకలి లేకుండచేయును. ఆకలిలేమిచే వారు తగుపదార్థములు భుజింపరు. కారణముగా శరీరమున పోషణశక్తి క్రమముగా తగ్గిపోవుటయు వారె దుర్బలశరీరులగుటయు సంభవించును. కాబట్టి తేనీరునకు బదులుగా తులసి ఆకులతో తయారుచేయబడిన పానీయమును గైకొనుచో ఆరోగ్యాభివృద్ధి యగును. సకల రోగములను పోగొట్టుటయేగాక క్రొత్తరోగములను పుట్టనీయదు. అయితే తులసియాకుతో ఈ పానీయము నెట్లు తయారుచేయుట అను ప్రశ్నకలుగును. తద్విధానము ఇచట తెలుపబడుచున్నది. ఎండిన తులసిఆకులు, మామిడిఆకులు, రావిఆకులు, మిరియములు, ఏలకులు ఇవి అన్నియు సమభాగములుగ తీసికొని ముదుగుగా గుండకొట్టి తేయాకునకుబదులుగా వేడినీటియందు ఈ గుండను ఉడకబెట్టవలయును. బాగుగా కషాయము దిగినతరువాత దాని ఒడియగట్టి అందు పాలు, పంచదార కలిపి తేనీరువలెనే పుచ్చుకొనవలయును. ఈ పానీయము మిక్కిలి రుచిగానుండును. దీనిని అమృతపానీయమని చెప్పవచ్చును. ఈ పానీయమువలన శరీరము ఆరోగ్యముగను, బలముగను ఉండును. నోటికి రుచికలిగించి మంచి ఆకలిని పుట్టించును. రక్తవికారము, వాతము, పైత్యము మున్నగువానిని ఉపశమింపజేయును. దీనిసేవనము మఱి యెన్నియో సుగుణములను కలిగించును. అవి అనుభవముచే తెలిసికొనదగును.

తులసి ఉష్ణము, కఫము, మంట, గుండె దడదడ, వాతము, శ్వాసకాసలు, క్రిములు, దోసులు, శూలలు, పోట్లు, విషము, మూత్రరోగము, రక్తదోషము, జ్వరము మున్నగు రోగములను పోగొట్టునని వస్తుగుణదీపిక చెప్పుచున్నది. కఫోద్రేకమున తులసిఆకుల రసముతీసి యిచ్చినచో బాధ నివారణమగును. ఇట్లే సాధారణజ్వరము, సన్నిపాత జ్వరము, ఉబ్బసము, శ్వాస, దగ్గు మొదలగు రోగములకు ఇచ్చుమందులకు తులసిఆకుల రసము అనుపానముగ నిచ్చినచో మందుయొక్క గుణవిశేషము అధికమగును. తులసి ఉష్ణవీర్యము కలదిఅగుటచే వాతమును నశింపజేయును. అగ్నిదీప్తి కలిగించును. కడుపునొప్పి, కడుపులోని గాబరా, పొత్తికడుపులోని బాధ మొదలగువానిని నివారించును. పీనసరోగమున ఎండు తులసిఆకుల నశ్యము చాల ప్రయోజనకారిగా నుండును. విషజ్వరములందు తులసిఆకులు మిరియములు కలిపి సేవించుట చాల మంచిది. పిల్లలదోసులు, అతిసారవిరేచనములు మొదలగు జబ్బులయందు తులసిఆకుల రసమును తేనెతో నాకించుట మిక్కిలి ప్రయోజనకరమైనది. తేలు కుట్టినతావున తులసిఆకు పసరుతో మర్దించుటచే బాధానివారణమగును. రేచీకటి కలవారికి కండ్లయందు నల్లతులసియొక్క రసమును క్రమముగా ఒక మాసము రోజులవఱకు వేసినచో మిక్కిలి ప్రయోజనకరముగా నుండును. దురదలకు కూడ తులసిపసరు మంచి పనిచేయును. ఎలుకకాటునకు తులసిఆకు రసమునందు నల్లమందు రంగరించి కఱచినతావున పట్టించవలయును. చెవి ఎఱ్ఱపడి బాధపెట్టుచున్నచో తులసిఆకు నూరి పట్టు వేయనగును. ఇది పుండ్లకుకూడా వేయవచ్చును. వాంతులకు తులసిఆకుల రసమునందు ఏలకుల చూర్ణము వైచి త్రాగించనగును. తులసి మంచి ఓషధీగుణముకల మూలిక. తేయాకుకుబదులు పైనచెప్పిన తులసిఆకు పానీయమును వాడి ప్రజలు ఆరోగ్యదేవతను ఆరాధింతురు గాక!

—కంభంపాటి సత్యనారాయణమూర్తి.

# జీవిత కల్లోలము

౧

సంతతానంద తేజస్సు జాలువాఱు
నాముఖాగ్రమునం దనినాఁడు సఖుఁడు ;
వెఱ్ఱితలఁపది ; కష్టజీవితము నాది ;
ఎవరి యెడఁద వేసటనుంట లెవరికెఱుక !

౨

అనుఁగు చెలికాఁడు ముచ్చటలాడు వేళ
ఒదవె కన్నీరు నాఱెప్ప తుదలయందు ;
ఆతఁడానంద బాష్పము లంచుఁ దలఁచె ;
అశ్రు వేదనా గుప్తాగ్ని నరయలేఁడు !

౩

కనులువిచ్చి చూచెదనంతె ; జనులు నన్ను
ప్రకృతి పరిశీలనా భావభరితుఁ డంద్రు ;
కొనలు సాగించు కొనుచు భగ్నమని మందు
జీవితార్చిక నేఁ బరీక్షించుకొందు !

౪

నామనస్సీమఁ ద్రవ్వుకొన్నాఁడ కింశు
కాంబకా వేదనాగ్నిగుండం బొకండు ;
నాహృదంతరవీధిలో బాహిర్లిల్లు
అమితరాగాపగని ప్రియురాలు భ్రమయు.

౫

ప్రణయ గీతులనే వ్రాసుకొనుచు హాయి
ప్రొద్దుపుత్తు నేననుచు చెప్పుదురు ; కాని
ప్రేమవృత్తిలో విరహాసంభృత విషాద
ఘట్టములె యెన్నిచిత్రించు కలము నాది.

౬

జ్వలితమానాదు హృదయ కాష్ఠంబునందు
కుంచుకొనిమాఱ తీరని కోర్కెలెన్నొ !
నా పెదవి రేగుకొను నీలినవ్వుచాలు
తత్ప్రిభూతోగ్ర ధూమసంతతులు సుండి !

౭

మక్కళింపుచుఁ బరమాణుమాత్రమైన
వెళ్ళబోసికోఁజాల నావెతల సొదలు ;
గ్రుక్కగ్రుక్కకు దిగమ్రింగుకొందు నేను
కడుపు తెఱుగుకుపోవు శోకవిషవహ్ని !

౮

నవ్వునగవుకో హాస్యప్రసంగములను
నల్పుదును మిత్రబాంధవ జనముతోడ ;
సౌఖ్యజీవివి నీవు వాస్తవమటంచు
పద్యములువ్రాసి సోదరభావకవియు.

౯

చదల జవరాలితోడి ముచ్చటలతోడ
పవలు రేలును గడపుచు బాడబాగ్ని
హృదయ కుహరమ్మునందు భరించుకొనెడు
ఆసముద్రుఁడు సద్గురుఁడగును నాకు !

౧౦

ప్రళయభాను సహస్రకరాన లచ్చు
టానిభప్రతాపంబులో నూన్మియైన
క్షమవహించిన యీక్షమాజనని నేను
పొగడుకొను కులదేవత, పూజ్యురాలు !

౧౧

ఊరుపులసోనలో జాజువాఱి పోయి
వణకుఁగొను నాదు లేఖిని వ్రాయుస్వీయ
కృతుల యన్నింటిలోఁ బ్రతిగీతి మలిన
బాష్పజీవితమునకు దర్పణము సుండి !

—ఓలేటి సీతారామమూర్తి, బి.ఏ.

# తేనెపరిశ్రమ

గతసంచికలో తేనెటీగల జీవిత విశేషముల వర్ణించి యుంటిమి. ఇపుడు తేనెపరిశ్రమ యందలి వివిధ విషయములు వర్ణింపబడును.

## తేనెటీగల రకములు.

హిందూదేశమున నాల్గురకముల జుంటీగలు వినికిడిలో నున్నవి.

1. కొండ జుంటీగ
2 చిన్న జుంటీగ
3 సర్వసాధారణ జుంటీగ
4. దామర్ (కుట్టని) జుంటీగ

ఇవిగాక, యిటలీదేశపు యీగయొకటి నేడు హిందూదేశమునకు వలస వచ్చియున్నది.

## కొండ జుంటీగ.

కొండతేనెలనబడునవి యీ కొండజుంటీగలనుండి గ్రహించబడును. ఈ యీగలు పెద్దవిగానుండి, కొండ చెట్లకొమ్మలపైనను, కొండఅంచుల కాధారముగను, మహోత్తుంగ ప్రదేశములయందు తమతెట్టెల నిర్మించుకొనును. వీనితెట్టె, నిడివిగలిగి, 4-8 చ. అ. వైశాల్యము గలిగియుండును. బెజవాడ దగ్గరనున్న ఆనకట్టుకు, దక్షిణపు మూలనున్న కొండ చట్రాళ్ళకంటి, ఆకాశమున వ్రేలాడుచున్నవో యన్నట్లు, యీ కొండ తేనె తెట్టెలు, అనేకములు బాటసారులకు కానవచ్చును. ఈ యీగ యెంత చపలచిత్తముగలవో, అంత భీభత్స కీటకము. తమ కెగ్గొనర్చిన మానవులను, పశువులను, పక్షులను ఇది మైళ్ళపర్యంతము తరిమి కుట్టిగాని తన పగ మానదు. ఇట్టిదగుటచే కొండజుంటీగ పెంపకమునకు తగియుండలేదు. వీని తెట్టెనుండి 50-60 పౌనుల తేనె లభించును.

## చిన్న జుంటీగ

తన తాహతకు తగినట్లు చిన్నతెట్టెలనే పెట్టుకొనును. దీనినుండి ఒకపౌనుకు మించి తేనెదొరుకుట అరుదు.

## సర్వసాధారణ జుంటీగ

ఇండియాలో అన్నిప్రదేశముల యందును కానవచ్చుటచేసి, దీనికీపేరు సార్థకమైనది. చెట్ల తొర్రలలోను, గోడమూలలందును, పగుళ్ళయందును, కొండగుహాంతర్భాగములందును, సాధారణజుంటీగ తమ తెట్టెలకట్టును. ఇది మచ్చికకెంతయు తగియున్నది. నేటి 'మధుమక్షికా పాలనము'నందీ యీగ ప్రాముఖ్యతనందినది. దీని తెట్టెనుండి, సాలునకు 10-15 పౌనుల తేనె గ్రహింపవచ్చును.

## దామర్ (కుట్టని) జుంటీగ

ఇది నల్లగానుండును. కుట్టదు. కాని చాలాతక్కువ తేనె యిచ్చును. ఇది ఔషధములలో ప్రశస్తమైనది. దీని తుట్టెలకు గుర్తేమనగా, వాని కవాటము గరాటిని పోలియుండును. మైనముతోపాటు, ఒక విధమైన వృక్షలేహ్యము నీయీగ తమతెట్టెల నిర్మించుటయందుపయోగించును.

## మధు ఋతువు

దక్షిణ యిండియాలో, శిశిర ఋతువునందు కొద్ది భాగమును, వసంత, గ్రీష్మఋతువులందును, తేనెటీగలకు నిర్వికల్పాణము పచ్చతోరణముగ నుండును. మిగిలిన ఋతువులయందు తాము పనిచెడియుండును గావున, యీ అనుకూల వాతావరణముననే, జుంటీగలు సమృద్ధిగ ఆహారమును గ్రహించిపెట్టుకొనును. ఈ కాలముననే తెట్టెలు నిర్మింపబడుట, మరమ్మత్తు చేయబడుట జరుగును. కార్మికులు వేనవేలు ఉత్పత్తి

యగును. ఈ సమయమున మధుదుర్గము చాలదని తలంపబడినచో, ప్రాతరాణి తన స్థానమున కొండొక క్రొత్తరాణిని నియోగించి, కతిపయ కార్మికపరివారముతో వేరొండుచోటుజేరి, నూతన మధుదుర్గమును నిర్మించి, పిల్లలబెట్టుట ఆరంభించి, దానిని సైతము వృద్ధిలోనికిదెచ్చును. మధుమక్షికా పాలకుడు, మధుపములకుగల యిట్టి నైజగుణములకు పరిచితుడై యుండవలయును. అప్పుడే అతడు తన కనుగుమార్గమున కృషి సాగించుట సాధ్యమగును. పైన జెప్పబడిన 'జుంటీగల వలస' వలన కృషికీగల లాభము ముందు చర్చింపబడును.

## మేతపట్టులు

జుంటీగలకు ముఖ్యాహారము, తేనె, పుప్పొడి యని తెలిసికొని యుంటిమి. వీనికై జుంటీగలు ముఖ్యముగ వృక్షములపైనను, పూలమొక్కలపైనను, పంటలపైనను, ఆధారపడియుండును, సామాన్యముగ అవి పూచినపూవుల కన్నిటికిని పోజాలవు. పోవుటకును వాంఛింపవు. మున్ముందు వానికి నచ్చిన పూవులజేరి, సమయానుకూలముగ వేఱుతావుల జూచును. పుప్పొడి నిచ్చు పంటలలో, జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఆముదము, పంటలు ముఖ్యమైనవి. పుష్పాసవమునిచ్చు వానిలో కాంబోడియాప్రత్తి (కాంబోడి దేశమునందుండి తేబడి, యీ దేశమున పండింపబడుచున్న మేలు రకముప్రత్తి) ముఖ్యమైనది. దక్షిణదేశమున విరివిగ పెరుగు చింత, వేప చెట్లు పుష్పాసవమునకు ముఖ్యాధారములనవచ్చును. మనకు తెలిసినంతవఱలో యీ పై జెప్పబడినవి ముఖ్యములు. ఇంకెన్నెన్ని పూలచెట్లనుండి, మొక్కలనుండి తేనె గ్రహింపబడుచున్నదో నేర్చుకొనవలసిన విషయమే. తేనెటీగలు, ప్రతికూల వాతావరణమునందు, కొన్ని కీటకముల నోటినుండి వెలువడు 'తేనెమంచు' అనబడు మధురపదార్థమును, యిండ్లలోపలనుండి బెల్లపుకోటిని గ్రహించుట జూడనగును. 'దీపముండగనే యిల్లుచక్కబెట్టుకొనుట' మానవుడు మొదట జుంటీగలనుండే నేర్చుకొనెనేమో!

## తేనెతీయుట - నాటుపద్ధతి

వేల సంవత్సరముల పర్యంతము జుంటీగలకు చిరపరిచితులైయుండియు, వాని అలవాటుల సంపూర్తిగ మానవులు గ్రహించినట్లు దోపదు. తేనెను గ్రహించునపు డుపయోగింపబడు నిర్దాక్షిణ్యావిధానమే దీనికి తార్కాణము. సమభూముల ప్రజలకేకాదు, ప్రొద్దున లేచి జుంటీగలతోపాటు కాలక్షేపముజేయు పర్వతవాసులకును వానినిగూర్చిన సరియైన జ్ఞానములేదు. కారణము, వారు అందుకై ప్రయత్నించకపోవుటయే. వారిపని తెట్టుల నేదోవిధమున దులిపి, తేనెను గ్రహించునంతవఱకే, నేడు సామాన్యముగ తేనెను గ్రహించుటలో అవలంబింపబడు పద్ధతుల నీక్రింద వర్ణించుట లెస్స.

కృషికుడు (కొండజనుడుకాని, సమభూములవాడుగాని) తెట్టులకై వెదకి, వానిదరి జేరును. అంతనాతడు తన ముఖమును బూడిదచేత నలముకొనుటో, లేక గుడ్డలతో కప్పుకొనుటో చేయును. లేనిచో తేనెటీగల పోటుల కాగజాలడు. పిమ్మట నతడు, ఆకులు గడ్డి, గాదము కొంతపోగిడి, చుట్టచుట్టి, దానికి నిప్పంటించి తుట్టె క్రిందుగా దానిని పట్టియుంచును. ఆ మంటకు, కొన్ని జుంటీగ లాహుతియగును. కొన్నిటికి కనుచూపు పోవును. హతశేషమగు మధుప సంఘము, తామ చేయునదిలేక చెల్లాచెదరై పోవును. ఈలోపుగ కొంత తేనె బొట్లుబొట్లుగా కారి మంటపాలు, నేలపాలు నగును. పిమ్మట కృషికుడు ఆక్రమముతో ఆతుట్టెనంతను ఒక్కపెట్టున పిండనారంభించి, దానినొక మంటి పాత్రలోనికి పట్టును. ఆమంటిపాత్రలోనిది (తేనె అని కృషికుడు తలంచునది) సగమునకు తక్కువగా తేనె, మిగిలినపాలు తేనెటీగల పిల్లల శరీరరసము, పుప్పొడి, మిగినము మొదలగు కల్తీ. ఈతేనెయే బజారులందు మనము ప్రియముగా కొనునది. తేనె అను పేరున, బెల్లపుపాకము గూడ బజారులందు అమ్ముడుపోవునని చెప్పుట యిచట

అసంగతము కాదు. ఈ పైచెప్పబడిన నాటుపద్ధతిని తేనెను తీయుట చూచిరేని, అనేకులు తేనెను ముట్టరనుకొనవలసి యున్నది. కారణము, అది అంత అసహ్యకరముగ నుండుటయే; అంత క్రూరముగ తయారుచేయబడుటయే!

## కృషి - పరిణామము

నిరంతర పరిశ్రమకు ఫలితముగ జుంటీగలు కూర్చుకొన్న తేనెను మానవుడు ఉట్టిఊడియముగ గ్రహించు టే అపూర్వమైన పని. మానవుని క్రౌర్యమెంతవఱకు పోయినదనగా, మధుపములకు పుట్టుముల్లు - రక్షణాంగము - లేనిచో, నీపాటికి మానవుడు మధుపసంఘమును నిర్మూలించి యుండెడివాడే! నేడు మనదేశమునందు తేనెను తీయుటలోని అనౌచిత్య మింతింత కాదు. గ్రుడ్డిలో మెల్లయున్నట్లు, కొన్ని నవీన పద్ధతులవలన నిట్టి నిర్దాక్షిణ్యత చాలవఱకు తొలగిపోవుచున్నది. ఈనూతన 'మధుమక్షికాపాలనము'వలన పారిశ్రామికునకు లాభ మినుమడించుటయేకాక, కీటకములకు అనవసరహాని తగ్గిన పుణ్యముగూడ కలుగుచున్నది.

మధుమక్షికా పాలనమునకు మొదటి సోపానమన దగినది, జుంటీగలను కుండగూండ్లలోనికి, గడ్డిగూండ్లలోనికి ఆకర్షించి, అవి తేనెను నిల్వచేసినపిమ్మట దానిని గ్రహించుటగా గల్గు నొకపద్ధతియైయున్నది పిమ్మట దీనికిని తృప్తినందని కొందఱు పాశ్చాత్యులు, ఒక కొయ్యగూటిని నిర్మించిరి. దీని ఔచిత్యమేమన, దీని భాగములు విడదీయుటకు సులువుగనుండి, తేనెను గ్రహించుటలో జుంటీగల కేమాత్రము హానిగలుగకుండునట్లు అమర్చబడియున్నది. ఈపరిణామమునకు మార్గదర్శకులైన వారిలో ముఖ్యుడు లాంగ్స్ ట్రాల్ అను శాస్త్రజ్ఞుడు. అతడు చూపించిన పద్ధతిపైననే తదుపరి అనేకరకముల తేనెగూండ్లు నిర్మించబడి యుపయోగమును బడయుచున్నవి.

## నేటి 'తేనెగూడు'

నేడుపయోగమునందున్న తేనెగూడులో అడుగున పెంపుడుగదియు, దానిపైన నిల్వాగారమును ఉండును. నిల్వాగారమునకు పైన కప్పుఉండును. పెంపుడుగదియందు దాని లోతునకు సరిపోవునట్టి 'పెంపుడుచుట్లు'— పెంపుడు గదిలోనుంచబడుచుట్లు- సామాన్యముగ 8 ఉండును. అదేప్రకారము నిల్వాగారమునందును, దాని లోతునకు సరిపోయినవి 8 తేనెచుట్లు (తేనె నిల్వచేయుటకు ఆ ఖారములగునవి) ఉంచబడును. ఈ చుట్లను పైకి తీయవచ్చును మరల వ్రేలాడ వేయనగును. గూటిలోని ఇతరభాగములుకూడ విడదీయ ననువైయుండును.

## పెంపుడుగది

దీనియందు ముఖ్యముగ తెట్టు అమర్చబడును. పిల్లలు దీనిలోని తెట్టునందే పెంచబడుటచేసి దీనికీపేరు తగియున్నది. ఈ తెట్టునందే, రాణి, పోతుటీగలు, కార్మికులుగూడ నివసించుచుందురు. కొద్దిపాటి తేనె దీనియందుండినను, మొత్తముమీద నిల్వాగారమునందే తేనె నిల్వచేయబడును. అందుచే పెంపుడుగదిని కదిలించవలసిన పనిలేదు. దీనికి అడుగున, ఎదుటి అంచున ఒక సన్నని కవాటముగలదు. దానినుండియే యీగలు బయటికిపోవుట, లోపలకు వచ్చుట జరుగును. ఈ కవాటమునకు ముందుభాగమున, యింటికి వసారావలె నొక కొయ్య అరుగు తాపటము చేయబడియుండును. ఈగలు కొండొకసేపు దానిపై ఆగి, విశ్రమించుటకు అది యెంతయు అనువుగనుండును.

## నిల్వాగారము

జుంటీగలు నిల్వచేయు తేనెయంతయు, ఈ నిల్వాగారమునందే యుంచబడును. కృషికుడు తేనెను గ్రహించవలసినపుడు. పై కప్పునుదీసి నిల్వాగారములోని తేనెచుట్ల నొక్కొక్కటిగ గ్రహించి, వానినుండి తేనెనుదీసి మఱల ' వ్రేలాడవేయవచ్చును. ప్రత్యేకించబడిన యీ నిల్వాగారముయొక్క ముఖ్యోద్దేశము, యీగలను కదిలింపకుండగనే మన యిష్టము

వచ్చినపుడు తేనెను గ్రహింప వీలుగ నుండుటకే. కొన్ని కూండ్లలో ఇట్టి నిల్వాగారములు, రెండుగూడ ఉండవచ్చును.

## కప్పు

తెట్టు ఎండకువానకు గురిగాకుండుటకు పైకప్పు అవసరముగదా. దీనిపైబడిన నీరు త్వరితముగ జారిపోవుటకు, వేడి నలుదెసలకు వ్యాపించుటకు—అనగా సమశీతోష్ణముగ గూటి నుంచవలయునన్న—యీ కప్పు అవసరము. అందుచే దానిపై సామాన్యముగ రంగు వేయుదురు. కప్పులో ఒకదానికొకటి యెదురుగా రెండు రంధ్రములు నిశ్వాసవాయు ప్రచారమునకైన మార్గములు.

## తేనెగూటిని స్థాపించువిధము

ఈ పైన వర్ణించబడిన తేనెగూటిని వ్యవసాయశాఖ వారియొద్ద కొననగును. టేకుచెక్కతో చేయబడినది రు 4 లో లభించును. స్వంతముగ చేయించుకొనిన తగ్గవచ్చును. జాజిచెక్కతో రు 2 లో చేయించుకొన వీలగును. కప్పునకు దళసరిగ రంగువేయించుట శ్రేయస్కరము.

మొదట కృషికుడు కృషిలోని విషయములను అనుభవజ్ఞులనుండి గ్రహించి, తదుపరి మొదలిడుట మంచిది. లేనిచో కొన్ని సమయములందు నిష్ఫలమగును. ప్రప్రథమున, ఒకటిరెండు గూళ్ళకంటె యెక్కువ స్థాపించుట మంచిదికాదు. అవసరమునుబట్టి, అనుభవమును బట్టి గూళ్ళసంఖ్య యెక్కువచేయనగును.

మొదటి కృషికుడు సహజముగు తేనెతెట్టు నొకదానిని సంపాదించుట అవసరము. ఆగ్రహించుట, యిదివఱలో వర్ణింపబడినట్లు పుంటసెగలచే కాదు. అతడు కొన్నిపోటుల కోర్చియైనను, తెట్టును దానికాధారమగు గోడనుండియో, కొమ్మనుండియో, వేఱుపరచవలయును. అంత దానిని తన తేనెగూటియందలి పెంపుడుగదిలో (కొన్ని పెంపుడుమట్లను తీసివేసియైనను) పెట్టియుంచవలయును: 'నిల్వాగారమును' కప్పును, దానిపై పెట్టరాదు. ఆ పగలంతయు పెంపుడుగూటిని ఆ తెట్టును గ్రహించిన స్థానమునందే యుంచి కాపాడుచుండవలయును. మొదట చెల్లాచెదరైనను, జుంటీగలు, తమకుగాని తమ దుర్గమునకుగాని హానికలుగకుండుటజేసి, క్షణికముగ గలిగిన అలజడిని వీడి, నెమ్మదిపడి తమగూటినే అంటబెట్టుకొని యుండును. అంత ప్రొద్దుగూకినంతనే, నిల్వాగారమును, కప్పును పెంపుడుగూటిపై యమర్చి, గూటినంతను ఏకముగ, కృషికుడు తన నివాసస్థానమునకు (గూటిని స్థాపించు చోటునకు) తీసుకొని పోవలయును. రెండుమూడు దినములవఱకు పగలు గూటిని తెరచియుంచుట రాత్రి మూయుట జరిపి, పిమ్మట నెప్పుడును మూసియే యుంచవచ్చును. ఈ లోపుగ జుంటీగలు పెంపుడు గదికిగల కవాటమునుండి వచ్చుటకు పోవుటకు అలవడి, యికముందు తమ ప్రయాణములన్నియు దానినుండియే సాగించుచుండును.

తేనెగూటిని 2-3 అడుగుల యెత్తున ఒక పీటపైననో గడమంచెపైననో నిలిపియుంచుట లెస్స. సామాన్యముగ గూళ్ళను చెట్లక్రిందుగా పెట్టియుంతురు. మాటిమాటికి తేనెగూటి స్థానమును మార్చుట తగదు.

ఈ విధముగ సకల సౌఖ్యము లొనగూర్చబడినపుడు జుంటీగలు హాయిగా పెరుగుచు తమగూటిని అచిరకాలముననే వృద్ధిపొందించుకొను నను టలో ఆశ్చర్యములేదు. పెంపుడుచట్ల కన్నిటికిని, అన్నితెట్టులు పెట్టబడును. నిల్వాగారమునందలి తేనెచట్లకు మగినపురేకులు (మగినమునొత్తి తయారుచేయనగును) అంటించినచో, దానిపై యిరుప్రక్కలను గదులు జుంటీగతే నిర్మించి, వానిలో తేనెను నిల్వచేయుచుండును. ఏ తేనెచట్టు తేనెతో నింపబడినదో మన మప్పుడప్పుడు పరీక్షించి, దానిని గ్రహించి, దానినుండి చేమరమూలమున తేనెనుపిండి, యథాప్రకారము దానిని నిల్వాగారమునం దమర్చనగును. ఈ పనులలో సైతము, పెంపుడుగది నావరించియుండు జుంటీగల కదిలించ నవసరము లేదని గుర్తింపవలయును.

తేనెనుపిండు చేమగ, 6 మాసములలో లభించును. తేనెచుట్లను, దానిలో అమర్చి, దానిని గిరగిరత్రిప్పుటను తగినట్లుండును. ఆ వడిలో, తేనె బొట్లుబొట్లుగా పడును. దానిని అడుగున నుంచబడిన పాత్రలోనికి పట్టవచ్చును. ఈ మరవలన తేనెచుట్ల కంటియుండు తెట్టును వత్త నవసరములేకనే, తేనె లభించును. గ్రహించబడిన తేనె స్వచ్ఛమై, కల్తీలేకయుండి యెక్కువగా కమ్మడు పోవునను నిశ్చయము.

## జుంటీగలవలన

ప్రస్తుతమందున్న తుట్టె చాలదని జుంటీగలు గ్రహించినపుడు, అవి వలసపోవుట ప్రకృతి ధర్మమని నుడివియుంటిమి. రాణి కతిపయ పరివార (కార్మిక) సమేతముగా బయలుదేరును, దాని స్థానే ఒక క్రొత్త రాణి ప్రస్తుత మధుసర్గము నాక్రమించుకొనును. ఈ వలస యేయేపరిస్థితులలో పోవును, ఎటులబోవును, దానిని తనయుపయోగమునకై వినియోగించుట యెట్లు మొదలగు విషయములు తెలిసియుండుట కృషికునకు లాభదాయకము. ప్రాతగూటిలోని సంఘబాహుళ్యమును గనిపెట్టి కృషికుడు, ప్రాతగూటిప్రక్కనే మఱొక క్రొత్తగూటిని తెఱచిపెట్టి యుంచవలయును. దీనిలోని చుట్లకు మైనపురేకులంటించి యుండవలయును. అప్పుడు ప్రాతరాణి వేఱొకచోటికి వలసపోక దాపుననున్న గూటినే ఆక్రమించును. ఇది యొక మార్గము. ప్రాతరాణియున్న కొయ్యచుట్టును తీసి క్రొత్తగూటిలో పెట్టుట యింకొక మార్గమగును. ఆహారము చాలదన్న కారణమునగూడ, వలసపోవుచుండుట గూడ కలదు. ఇట్టి విషయములనన్నిటిని కృషికుడు గ్రహింపవలసియేయున్నది.

## కృషి - అరిష్టము

ప్రతి కృషికిని ఆటంకములు, అరిష్టములు కలుగుచుండును. అందుచే కృషికుడు సదా మెలకువగలిగి యుండవలయును. ఆరుబయట ఉంచబడిన తేనెగూటిని, పిల్లలుగాని, పశువులుగాని కదల్పకుండునట్లు చూచుట అవసరముగదా. అదిగాక, సీతాకోక చిలుకల గోత్రమునకు చెందిన నొక మైనపుచిల్క (దాని లార్వా మైనమును భక్షించుటజేసి దానికాపేరు పెట్టబడినది) తేనెటీగలకు గర్భశత్రువు. భయంకరకీటకమగు కొండజుంటీగ సైతము దీనికి వెఱచి పాఱిపోవును. ఈ చిల్కలు (రెక్కలపురుగులుసుమా) రాత్రులందు తేనెగూండ్లకు జొరబడి, తెట్టులపై గ్రుడ్లను పెట్టును. ఆ గ్రుడ్లనుండి పిల్లలు (లార్వాలు) బయటకురాగానే వెంటనే తేనెతెట్టులోనికి తొలుచుకొనిపోయి మైనము భక్షింప మొదలుపెట్టి, కొంతకాలమునకు 'ముసుగులు' కట్టుకొని తమ పరిణామావస్థనంతను గడపి, ప్రత్యుత్పత్తివలన తమ వంశమును వృద్ధిచేసుకొనుచుండును. ఇవి తెట్టు నాక్రమించినట్లు గుర్తేమన, అవి ఆక్రమించిన ప్రదేశమంతయు తెట్టునకు మాదికలువేసినట్లుండి, గదులన్నియు పూడిపోయి బెట్టబడినట్లు కనబడుచు తక్కిన అనాక్రాంతము లగు గదులనుండి భిన్నముగ నుండును. వీని జీవితపరిమాణము, 6 వారములు, ఇవి అన్నినెలలయందును కానబడక పోవచ్చును. అవి విరివిగ వ్యాపించియుండు కాలమును గుర్తించి పారిశ్రామికుడు తగు జాగ్రత తీసుకొనవలయును ఇవిగాక తేనెటీగలను వేటాడు నొక పక్షి కృషికి హానికలిగించును. కావున పారిశ్రామికుడు ప్రతివారమునను గూటినితెరచి, తెట్లను పరీక్షించుచు, మైనపుచిల్క ఆక్రమించినచో దానిని నిర్మూలించుట ఆవశ్యకము. తేనెపిండివేయబడిన ప్రాతతెట్టులు, అటు నిటు పారవేయరాదు. కారణమేమనగా, అవి ముందుగా మైనపుచిల్కలకు వాసయోగ్యములై, అందునుండి మైనపుచిల్క తేనెగూండ్లకుగూడ వ్యాపించుటకు దారి చూపును తక్కిన పలువిధములగు అరిష్టములనుండి, సదా కృషికుడు తనగూళ్ళను తగువిధమున కాపాడుకొనవలయుననుట నుడువ నవసరములేదు.

## తేనె

గ్రహించబడిన ఋతువునుబట్టియు, చెట్లుగాని మొక్కలనుగాని బట్టియు, ఆరకము ఈగను బట్టియు

తేనెలు, రంగు, రుచి, వాసనలందు భేదమును గనపఱచును. ప్రత్తిపూలతేనెను, వేపతేనెను భేదము గ్రహింపవచ్చును. వేపపూలతేనె ఔషధములలో ప్రశస్తమైనదేగదా! తేనె సామాన్యగుణగణములను, ఉపయోగములను ప్రథమముననే తెలిసికొనియుంటిమి.

### కృషిఫలితము

ఒక్కొక్క తేనెగూటినుండి సాలునకు, సగటున 10-11 పౌనుల తేనె వచ్చును.

1 పౌను ధర రు 1 మొదలు రు 1-4-0 ఉండును.

10-11 పౌనులకు, రు 10 మొదలు రు 13-12-0 వఱకు వచ్చును. ఇట్టివి 10-12 గూండ్లను ఒక అనుభవజ్ఞుడగు కృషీవలుడు - రైతు - సాగింప వీలగును. ఖర్చులు పోగా మిగులు రు 80-100 రూప్యములు సామాన్య కర్షకునకు మంచి ఆదాయమే కదా!

ఇదిగాక, గూండ్లనుండి మైనము గ్రహింపనగును. ఈ ముడిమైనమునే మేలిమైనముచేయు పద్ధతి చాలా సులభము. ముడిమైనము నీళ్ళలో మరగబెట్టుదురు. అది కరుగును. పిమ్మట దానిని ముడిగుడ్డతో వడపోసి, చల్లారబెట్టుదురు. దానిని అచ్చులుగా తయారుచేయుదురు. అదియే మేలిమైనము.

### ముగింపు

మన మందఱమును తేనెను త్రాగుట కిష్టపడుదుము. కాని మనలో పల్వురు తేనెకృషిని మాత్రము—దానిలోని నిర్దాక్షిణ్యతకు—ఏవగింతురు. అట్టివారికి యీ పైమాదిరి నవీనకృషి నచ్చవచ్చును. ఈకృషి రైతుల యార్థికాభివృద్ధికి చక్కని సులభమైన మార్గమని, వై. యం. సి. యె. మొదలగు సంస్థలు అవలంభించి, ప్రచారముచేయుచున్నవి. ఈ పరిశ్రమయందలి జ్ఞానము నలుమూలల పల్లెకోనలకు వ్యాపించిన, బీదరైతు తన యితరకుటీర పరిశ్రమలతోపాటు దీనినిగూడ స్వీకరించి, కృషిచేసి, లాభము గడించుననుటలో సందేహము లేదు.

—జాగు గోపాలరావు.

# పునర్జన్మ

శ్రీశైలమొకపుణ్యక్షేత్రం. అనామలయకొండలమధ్య నున్నది. శివరాత్రికి గొప్ప వుత్సవం జరుగుతుంది. వేలకొలది యాత్రికులు వచ్చిపోతూవుంటారు. ఎన్నో శ్రమలకోర్చి శ్రీశైలానికంతమంది యాత్రికు లెందుకు పోతూవుంటారని పార్వతి ఒకనాడు శివుణ్ణి అడిగింది. అది గొప్ప పుణ్యస్థలమనీ, ఎవరెవరు శ్రీశైల శిఖరాన్ని దర్శిస్తారో వారు జననమరణాలనుండి విముక్తులౌతారనీ శివుడు జవాబిచ్చాడు. పార్వతి విశ్వమాత ఇదివిని పార్వతి ఇట్లన్నది: "ఈ విధంగా ప్రతియేడూ వేలకొలది యాత్రికులు ముక్తి పొందుతూవుంటే ప్రపంచంలో పుట్టే జీవులసంఖ్య క్రమంగా తగ్గిపోతుందేమోకదా!" ఈమాటవిని శివుడు నవ్వియిట్లన్నాడు: "సరే, ఒకసారి మనమిద్దరమూ కొండవద్దకువెళ్ళి చూతాము-రా!" ముసలి భర్త, పడుచుభార్యవలె మారువేషాలు ధరించి పార్వతీ శివులిద్దరూ కలిసి బయలుదేరినారు. అట్లా వెడుతూ దారిలో ఒక చెరువుప్రక్కను ఆగినారు.

వేలకువేలు ప్రజాసమూహం గుడివైపుకు పోతున్నది. ఆకస్మికంగా ముసలిభర్త కాలుజారి చెరువులోపడ్డాడు. భార్యగుండెలు కొట్టుకొని పెద్దపెట్టున యేడుస్తూ తన భర్తను బ్రతికించి పుణ్యంకట్టుకోమని మార్గస్థులను పిలవటం ప్రారంభించింది నీటిలో దుమికి ముసలివాణ్ణి బ్రతికిస్తామని చెపుతూ చాలమంది చెరువుగట్టుకు వచ్చారు. కాని భార్య బిగ్గరగా విలపిస్తూ యిట్లన్నది: "అయ్యా, మీకు పుణ్యముంటుంది, మీలో పాపాత్ము లెవ్వరూ ఆయనను తాకవద్దు.

పాపాత్ముల స్పర్శ యేమాత్రం తగిలినా ఆ యన నిష్కారణంగా చనిపోతాడు" ఈ మాట విన్న వెంటనే యెవరియట్టుకు వారే తప్పుకున్నారు. "నేనెప్పుడూ యేపాపం చేయలేదని యెట్లా చెప్పగలను? ఏమో! ఇప్పుడీ ముసలివాణ్ణితాకి యీపాపంకూడా నెత్తిమీద వేసుకొనేదా!" అని యను కుంటూ యెవరిదారిని వారు పోతున్నారు.

ఈలోగా ముసలివాడు నీటిలో మును గుతూ తేలుతూ చివరకు ప్రాణంవిడిచేటట్లు కనబడ్డాడు. భార్య గుండె బద్దలయ్యేటట్లు యేడుస్తూ "ఏమయ్యా తండ్రీ! నాభర్తను బ్రతికించి పుణ్యంకట్టుకోగలిగిన వారొక్క రూ లేరా యిక్కడ? అయ్యయ్యో, అదిగో మునిగిపోతున్నాడు—పోయినాడు నాయి నా!" అని మొరబెట్టుకున్నది.

ఈస్థితిలో ఒకజారిణి వడివడిగా పరుగెత్తు కుంటూ చెరువుగట్టుకు వచ్చింది. రావటం తడవుగా, చావుబ్రతుకులమధ్య చెరువులో పడివున్న మనిషినిచూచి, నీటిలో వురకటా నికి సిద్ధమై గట్టుదిగి పోతున్నది.

"నిలు, నిలు! నీవు పవిత్రురాలవేనా? నీవెన్నడూ యేపాపం చేయలేదుకద? లేదని నమ్మకంగా చెప్పగలవా?" అని యడు గుతూ పడుచుభార్యగా వచ్చిన పార్వతి వెంట వెంట వచ్చి స్త్రీయొక్క చెయ్యిపట్టు కున్నది.

"అమ్మా, నేను పాపంలోనేపుట్టినాను. పుట్టిననాటినుంచి లజ్జాకరమైన బ్రతుకే బ్రతికాను. నాబ్రతుకుమీద నాకెంతైనా అసహ్యత పుట్టింది. శ్రీశైలక్షేత్రం సేవించి నాపాపాలనిక్కడ దగ్ధంచేసుకుందామని వచ్చాను. ముక్తురాలనైనాను. పునర్జన్మ ప్రాప్తమయింది. నేటితో నాపాపాలన్నీ నాశనమైనాయి కనుకనే యిప్పుడీ మాన వుని ప్రాణం కాపాడటానికి అర్హత కలి గింది."

ఇట్లా అంటూనే స్త్రీ అగాధజలంలో దుమికి యీదుకుంటూపోయి ముసలివాని రెండు జబ్బలూ పట్టుకొని పైకి లేవనెత్తింది.

తత్క్షణం పార్వతీ పరమేశ్వరులిద్దరూ స్వ స్వరూపాలతో ఆమెయెదుట నిలిచారు ఆ పతితురాలిని వెంటబెట్టుకొని కైలాసానికి ప్రయాణమైనారు.

అప్పుడు శివుడన్నాడు: "చూచావా, పార్వతీ! ఇక్కడికి లక్షలకొలది యాత్రికులు వచ్చారు. ఇందరిలో - యీఒక్క జారిణి మాత్రం ఆత్మవిశ్వాసంతో తన మలినాన్ని కడిగివేసుకోగలిగింది. ఇట్లాగే అక్కడక్కడ ఒకొక్కడుమాత్రం చరితార్థత పొంది ముక్తి కర్హుడౌతూ వుంటాడు."

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం.ఏ.

ఆంధ్రకీర్తిగ్రంథమాల: ౧.

## ఆంధ్రరమణీమణులు

(మొదటి భాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండ్రుగురు తెనుగుతెఱవల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమాను లాదరింపదగిన గ్రంథము. గ్లేసుకాగితములు, క్రౌనుసైజు. 96 పుటలు చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా:—

ఆంధ్రభూమి కార్యాలయం: వేపేరి, మదరాసు.

# యేప్రిల్ ఒకటవ తేదీ

౧

తూర్పుతీరపు క్రైస్తవ సంస్థలలోకల్లా 'ఫాదిరిగుడి' చాలా పురాతనమైనది. ఈ స్థలం పూసపాటివారి విజయనగరానికి కాస్త మైళ్ళ దూరంలో ఉంది. క్రీ॥ శ॥ 1750 ప్రాంతములందే రెవరెండు జాన్సన్ అనే క్రైస్తవమతప్రచారకుడు వచ్చి ఆ సంస్థను నిర్మించాడు.

ఫాదిరిగుడి కట్టబడిన ప్రదేశం బహురమణీయమైనది. ఆ స్థలానికి ఏభై గజాల దూరంలో 'చంపావతి' అనే చిన్ననది ఉంది. నది చిన్నదైనా మండువేసవిలో కూడా మోకాలులోతు స్వచ్ఛజలం ప్రవహిస్తూ ఉంటుంది. జాన్సన్ దొర ఆ ప్రదేశ సౌందర్యాన్ని చూసి అక్కడే తనసంస్థకి పునాదిరాయి వేశాడు. చుట్టుపక్కల చిన్నచిన్న పల్లెలు అనేకంగా ఉండడంచేత తన మతప్రచారానికికూడా అదే మంచిస్థలం అనుకున్నాడతడు.

ప్రస్తుతం మన కథాకాలంనాటికి ఇరుగుపొరుగు గ్రామాల మాలవాళ్ళలో సగంమందికిపైగా క్రైస్తవులైపోయారు. నూతన మతస్వీకారమువల్ల ఆచారవ్యవహారాలు మారకపోయినా పేర్లుమాత్రం పూర్తిగా మారిపోయాయి. పూర్వపు స్వామిగాళ్ళందరూ ఇప్పుడు 'శామ్యూల్స్' అయినారు.

నాడు మొదలు ఆసంస్థ దినదినాభివృద్ధిని పొందుతూ వచ్చింది. ఇప్పుడక్కడ ఇరవైమంది మతప్రచారకులూ, ఒకప్రధానాధికారీ ఉన్నారు. ఆ ప్రధానాధికారినే ప్రజలు 'ఫాదిరి' అని పిలుస్తారు. అతన్నిబట్టే ఆసంస్థకి 'ఫాదిరిగుడి' అనే పేరువచ్చింది.

సంస్థకిమధ్యగా ఎత్తయినగోపురంతో చర్చిఉంది. దానిచుట్టూ బారులుతీర్చి ప్రచారకుల గృహములున్నాయి. చర్చికిముందుగా ఫాదిరిగారి మేడఉంది. ఆ మేడపక్కనే పాఠశాల. ఉపాధ్యాయులిద్దరికీ రెండు బంగాళాలు ఉన్నాయి. వీరినందరినీ ఆశ్రయించుకుని ఒకవర్తకుడు చిన్న దుకాణం పెట్టుకున్నాడు. ఈ యిళ్ళన్నీకలిసి ఒకచిన్న గ్రామమైనది. గ్రామానికంతటికీకూడా 'ఫాదిరిగుడి' అనే వాడుకనామము.

సుశీల మేనమామ విద్యార్థిగా నున్నప్పుడే క్రైస్తవమతంలో కలిసిపోయాడు. అతని నూతననామము 'శిఖామణి'. విద్య పూర్తికాగానే మిషన్‌వారు అతన్ని మంచిజీతముపైని ప్రచారకుడుగా నియమించారు. క్రమంగా అతడు ఫాదిరిగుడిలో ప్రధాన ప్రచారకుడైనాడు. మిగిలిన ప్రచారకులంతా అతని ఆజ్ఞ ప్రకారమే నడిచేవారు. ప్రచారక కార్యక్రమమును అతడే నిర్ణయించేవాడు. ఇది 1910 సం॥ నాటిమాట.

1910 సం॥ నాటికి సుశీలకు పదమూడోయేడు. విజయనగరంలోని మిషన్ బాలికాపాఠశాలలో మూడవఫారం చదువుతూ ఉండేది. ఆ బడిలో పైతరగతులలో మతబోధ చెయ్యడానికి శిఖామణి ఫాదిరిగుడినుంచి వారానికి మూడుసారులు విజయనగరం వెళుతూ ఉండేవాడు.

నాటికీ నేటికీకూడా అగ్రవర్ణాలలో మనుష్యులను క్రైస్తవమతంలో చేర్చగలిగిన ప్రచారకులకు ఎక్కువ పేరూ ప్రతిష్ఠా ఉంది.

శిఖామణి తన తెలివితేటలవల్ల త్వరలోనే ప్రధాన ప్రచారకుడైపోయాడు. విద్యార్థులకు నచ్చచెప్పడానికి తగిన వాక్చాతుర్యం అతనిదగ్గర ఉంది. వచ్చీరాని జ్ఞానంగలపిల్లలు అతనిమాటలను దివ్యతత్వబోధగా భావించుకునేవారు. మిషన్ పాఠశాలలో ఎక్కువమంది విద్యార్థులు అతనివల్ల మతస్వీకారమొందినవారే.

తన వాక్చాతుర్యమువల్లనూ, మేనగోడలుదగ్గిర ఉండే చనువువల్లనూ శిఖామణి సుశీలమనసును త్రిప్పగలిగాడు. హిందూమతం కేవలం మూఢాచారాలపైని ఆధారపడిఉందనీ, విగ్రహారాధకులకి ముక్తిలేదనీ, క్రైస్తవమతంలో ఎంత పతితులనైనాసరే ఉద్ధరించ

గలవాడు క్రీస్తుమహానుభావుడు ఉన్నాడనీ అతను ఆ అమ్మాయికి బోధించాడు. పై విషయాలేగాక ఇహలోకంలోకూడా ప్రభుత్వానుగ్రహం సంపాదించి అభివృద్ధిపొందాలంటే క్రైస్తవమతమే శరణ్యమని చెప్పాడు విద్యాభివృద్ధీ స్త్రీ స్వాతంత్ర్యమూ హిందూమతంలో దొరకవని వాదించాడు.

మేనమామ మాటలకి సుశీల లొంగిపోయింది. పద్ధాలుగు సంవత్సరాలైనా పూర్తిగా నిండకపూర్వమే ఆమె క్రైస్తవమతంలో కలిసిపోయింది, తండ్రివచ్చి అడిగినపుడు 'నేను మామయ్యతోనే ఉండిపోతాను' అని నిశ్చలంగా జవాబుచెప్పేసింది. నాడు మొదలు ఆమె తండ్రిగారింటికి మరి వెళ్ళనూలేదు. ఆమెను వారు పిలవనూలేదు. అత్యనురాగంతో మేనమామ ఆమెనుపెంచి పెద్దదాన్ని చేశాడు. ఫాదిరిగుడిలో మేనమామగారింట్లోనే ఆమె ఉండిపోయింది.

ఫాదిరిగుడిలోనే 'పంచానన్' అనే ప్రచారకుడొకడుండేవాడు. విశాఖపట్నంజిల్లాలోనే ఒక పల్లెటూరు కాపురస్థుడతడు. అతడు క్రీస్తుశిష్యుడయి చాలి కేళ్ళయింది. అతనికి ముగ్గురుకొడుకులు, అందులో చిన్నవాడిపేరు 'గజానన్'.

సుశీల స్కూలుఫైనలు పూర్తిచెయ్యగానే ఆమెకీ గజానన్‌కీ వివాహంజరిగింది. శిఖామణి బతికిఉండగా అతడే ఈ వివాహంచేశాడు. సంతానహీనుడవడంచేత తన యావదాస్తినీ శిఖామణి మేనగోడలుకే యిచ్చేశాడు. గజానన్ అప్పటికి చెన్నపట్నంలో ఇంజనీరింగు కళాశాలలో విద్యార్థిగా ఉండేవాడు పెళ్ళిఅయిన రెండేళ్ళకే శిఖామణి చనిపోయాడు.

మేనమామ చనిపోవడంతోనే అతనిస్థానంలో వచ్చిన వేరొక ప్రచారకుడికి ఇల్లు కాళీచేసి సుశీల అత్తవారింటికి పోవలసివచ్చింది. అప్పుడు వేసవిసెలవులగుటచే గజానన్ ఇంటిదగ్గిరే ఉన్నాడు. దంపతులకు సెలవురోజులు హాయిగా గడిచిపోయాయి. భర్త మళ్ళీ చెన్నపట్నంవెళ్ళేరోజు సమీపించినకొద్దీ తను ఒంటిగా ఉండవలసివస్తుందన్న భయం సుశీలకి అధికమైంది. తల్లిదండ్రులకు దూరమైనా మేనమామవద్ద ఆమె సుఖించింది. ఇప్పు డతనుకూడా లేడు.

తోడికోడళ్ళందరిలోనూ సుశీలయే ధనవంతురాలూ, విద్యావంతురాలూ, రూపవతీకూడాను. వచ్చిన కొన్నిసెలలవరకూ ఇంట్లోవాళ్ళందరూ ఆమెను ఆదరాదరంతో చూసేవారు. క్రమక్రమంగా తోడికోడళ్ళలో అసూయ బయలుదేరింది. కొత్తగావచ్చిన సుశీలను అత్తగారు ఎక్కువప్రేమతో చూడ్డం వారు సహించలేక పోయారు.

అన్నదమ్ములలోకూడా కొంతవిరోధభావం లేకపోలేదు. పెద్దవాళ్ళిద్దరూ సామాన్యవేతనముల మీద మతప్రచారకులుగా ఉన్నారు విద్యాధికుడై, కొద్దికాలములో గొప్ప ఉద్యోగముచేయడానికి సిద్ధంగా ఉన్న గజానన్‌యెడల వారిద్దరికీ ఏమంత మంచి అభిప్రాయాలులేవు.

ఇంట్లో పార్టీలు ప్రారంభమవడానికదే మొదలు. తోడి కోడళ్ళిద్దరూ ఒకటీ, సుశీల ఒకర్తే ఒకటీ అయిపోయారు. అత్తగారికీ సుశీలకీ మధ్య మిత్రభేదము కలిగించడానికి వాళ్ళు విశ్వప్రయత్నమూ చేశారు. ఒకనాడు సుశీల వసారాలోనించి వస్తూ 'నీకు మరదలుమీద అంతప్రేమఉంటే ఇంక మేమెందుకూ! మమ్మల్ని పుట్టింటికి పంపించేస్తేసరి.' అని రెండోతోటికోడలు భర్తతో అంటూఉండగా విన్నది.

ఈమాటలకామె అదిరిపడినది. తనపైని బావగారు చూపిస్తూఉన్న అనురాగమేమిటో ఆమెకు బోధపడలేదు. ఆమాటలలోని గూఢార్థానికామె గడగడలాడిపోయింది. తోడికోడళ్ళకి తనమీద ఆగ్రహానికి కారణం ఆమె గ్రహించలేకపోయింది.

నానాటికి తోడికోడళ్ళలోని విరోధభావాలు బాహాటంగా పైకిరాసాగినవి. అత్తగారితో కల్పించి నేరాలుచెప్పడమూ 'ఊ' అంటేచాలు యిద్దరూ ఏకమై దెబ్బలాటకి రావడమూ మొదలుపెట్టారు. స్నేహంగాఉండాలని ఆమెచేసిన ప్రయత్నాలన్నీ వృథా అయిపోయాయి.

చెప్పుడుమాటలు ప్రమాదకరమైనవి. కోడళ్ళు నిత్యమూ చెవుల్లో నూరిపొయ్యడంవల్ల ముసలావిడకి బుద్ధి

తిరిగిపోయింది. ఇదివరకల్లా స్వర్గంనుండి దిగివచ్చిన దేవతలాగు కనబడే సుశీల ఇప్పుడు పరమదుఃఖస్వరూపురాలై పోయింది. కోడళ్ళతోకూడా అత్తగారు కలియడం వల్ల సుశీల జీవనం దుర్భరమైపోయింది. కష్టసుఖాలు చెప్పుకోడానికి భర్తకూడా దగ్గరలేకపోవడ మామెకు మరీబాధగా ఉంది.

ఇన్నాళ్ళకామెకు తనదుస్థితి గోచరించింది తల్లిగతించినలోటు ఆమెకిప్పటికి కనబడింది. అన్యమత స్వీకారమే కారణంగా తండ్రీ, తానంటే మండిపడేవాడు. బంధువులెవ్వరూ తనవేపు చూడనైనా లేదు. కన్నకుమార్తెవలె తన్ను పెంచిన మేనమామని తలుచుకుని ఏడవనిరోజే ఆమెకులేదు. పగటివేళ పనిపాటల్లో పొద్దు పోయినప్పటికీ రాత్రిపడేసరికి కామెకు తన నిస్సహాయ స్థితి వేయిరెట్లు బలవత్తరంగా కనబడి నిద్రపట్టనిచ్చేది కాదు.

తనపరిస్థితులను వివరిస్తూ సుశీల భర్తకొక జాబు రాసింది. తన్నుకూడా చెన్నపట్నం తీసుకుపొమ్మని అందులో భర్తను ప్రార్థించింది.

మరికొన్ని రోజుల్లో క్రిస్మసు సెలవులకి గజానన్ ఇంటికొచ్చాడు. అయిదారురోజులు సౌఖ్యంగా గడచిపోయాయి ఈసారివెళ్ళేటప్పుడు సుశీలను తనతో కూడా తీసుకెళ్ళడాని కతడు నిశ్చయించుకున్నాడు. ప్రయాణపుదిన మెప్పుడొస్తుందా అని సుశీల కనిపెట్టుకుని చూస్తూంది. ఇంట్లో వాళ్ళబాధ ఆమెకు నానాటికీ హెచ్చైపోతూంది. ప్రతిరోజూ అత్తగారు తనమీద నేరాలను భర్తతో చెబుతూఉండడ మామె చూస్తూనే ఉంది. భర్త సద్భావముపైగల నమ్మకచేతనూ, త్వరలో చెన్నపట్నంపోయి సుఖపడవచ్చునుకదా అనీ ఆమె సహించి ఊరుకుంది.

౨

ప్రయాణానికింక రెండురోజులు మాత్రం వ్యవధి ఉంది. అవసరములైన సామానులనన్నిటినీ సుశీల సర్దుకుంది. ఆమెకాయింట్లో గడియ ఒకయుగములాగు తోస్తూంది.

రాత్రి ఎనిమిదిగంటలవుతుంది. చలి విపరీతంగా వేస్తూంది ఫాదిరిగుడి అంతటా నిశ్శబ్దము. గాఢాంధకారము కన్నుపొడుచుకున్నా కానరాకుండా ఉంది. తూర్పుగాలినించి జీవకోట్లు వడవడ వణికిపోతున్నాయి.

ఇంట్లో పనులు పూర్తిచేసుకుని సుశీల గదిలోకి వెళ్ళింది. భర్తగదిలో లేకపోవడంచూసి ఆమె ఆశ్చర్యపడింది. 'ఇలాంటిచలిలో ఎక్కడికెళ్ళారో?' అనుకుంటూ ఆమె ఒకపుస్తకం పట్టుకుని కిటికీలనుమూసేసి దీపందగ్గరకూచుని చదువుకుంటూంది.

రమారమి పదిగంటలయేసరికి గజానన్ తలుపు తెరుచుకుని లోపల కొచ్చాడు. రాగానే బల్లమీది గ్లాసులో మంచినీళ్ళుతాగి తనుకూడా ఒకకుర్చీలో కూచున్నాడు. అతడు సుశీలవంక చూడనైనా లేదు. దీర్ఘాలోచనలో మునిగి అలాగే కూచున్నాడు.

ఆనాటి అతనిప్రవర్తన సుశీలకి వింతగాతోచింది. చదువుకట్టిపెట్టి భర్తనుచూసి ఆమె 'చాలా రాత్రి అయింది. పడుకోకూడదూ? ఏమిటో ఆలోచన?' అంది.

ఆ గదిలో ఇంకొకరున్నట్లు అతనికప్పటికి తోచింది. తలెత్తి సుశీలముఖంవేపు తీక్ష్ణంగా చూశాడు. అతనిముఖం ముణుచుకుపోయి ప్రసన్నతని సూచించడం లేదు. సుశీల కతనివైఖరి చూసేసరికి భయంవేసింది. 'ఒంట్లో బాగులేదుకాబోలు? పడుకుంటేసరి. అలాంటప్పుడు వీధిలోకి వెళ్ళకపోతేనేం?' అని మధురంగా అన్నాది.

జవాబులేదు. సుశీలనుండి దృష్టి మళ్ళించుకుని కొంచెం దగ్గాడు. ఏదో మాట్లాడబోతున్నట్లూ, అందుకు కంఠం సవరించుకుంటున్నట్లూ స్పష్టపడుతూంది. అదిచూసి సుశీల మళ్ళా 'ఏమిటో ఇదంతా చూస్తే నాకు భయంవేస్తూంది కొంచెంసంగతి తెలియనివ్వకూడదూ?' అంటూ దగ్గిరగావచ్చి నిల్చుంది.

నేలమీది చూపులని మళ్ళా భార్యవేపుతిప్పి గజానన్ చెప్పడం ప్రారంభించాడు. 'ఇదుగో నే చెప్పేది విను ఈ సంభాషణ నాకూ కష్టంగానేఉంది. కాని చెప్పక తప్పదు. నే నింతసేపూ మా అమ్మదగ్గిరే

ఉన్నాను. ఇన్నాళ్ళూ నీ విషయమై ఏమో అనుకున్నాను గాని నేటితో నా సందేహాలు తీరిపోయాయి. మల్లెచెట్టులోకూడా విషసర్పాలుంటాయని అనుభవం చాలకపోవడంచేత నేను ఇంతవరకూ గ్రహించలేను. మానవులకి గుణంప్రధానం కాని రూపంకాదన్న పెద్దల మాట వృధాకాదు. నీ దుష్ప్రవృత్తులవల్ల మా తల్లిదండ్రులకి దుఃఖం కలిగించడానికి నిన్నిక్కడ ఉంచలేను. నీ సౌందర్యంచూసి మోసపోయినట్లు ఇప్పటికేనా కళ్ళు తెరిచి తెలుసుకున్నందుకు సంతోషిస్తున్నాను. నీ ప్రవర్తనవల్ల కుటుంబానికికూడా కళంకం వస్తున్నప్పుడు నేను సహించి ఊరుకోలేను.'

శూలపుపోటులై బాధించాయి సుశీలను ఈ మాటలు. వాటిఅర్థం ఆమెకి తెలియలేదు. ఆమెతల తిరిగిపోతూంది. ప్రపంచకంలో రెండోదిక్కు లేక, ఎన్నడో భర్తవచ్చి తనకష్టాలు గట్టెక్కిస్తాడుకదా అని గంపెడాసతో ఉన్న ఆమెకు ఈ మాటలతో ప్రపంచకం ఒక్కసారిగా కూలిపోతున్నట్లయింది.

భర్తకి ఏజవాబు చెప్పడానికీ ఆమెకు తోచలేదు. ఆమెనోట తడి ఆరిపోయి మాటరాలేదు. నిలువునా నేలమీద పడిపోడానికి సిద్ధమయింది. పక్కనేఉన్న కుర్చీని ఆనుకుని ఆమె మెల్లిగాకూచుంది. దీనాతిదీనములై ఆమెదృష్టులు భర్తవేపుకి తిప్పబడిఉన్నాయి.

గజానన్ మళ్ళీ చెబుతున్నాడు 'ఈలాగ్గా నిన్ను వదిలిపెట్టిపోవడం నాకూ కష్టంగానేఉంది. కాని ఇంటికి అప్రతిష్ట వచ్చేటప్పుడింకప్పలేను. ఈ జన్మంలోనే ఇంక మనకి సంబంధం ఉండకపోవచ్చు. నీమీద నేను పెట్టుకున్న ఆశలన్నీ వ్యర్థములైపోయాయి. నేను రేపే చెన్నపట్నం పోతున్నాను. నువ్వు నీ యిష్టం వచ్చినచోటికి పోవచ్చు. నువ్వీయింట్లో ఉండగా మాత్రం నేను ఇక్కడికిరాను' అంటూ కుర్చీమీదనుంచి లేచాడు.

ఏమీ చెప్పదల్చుకుంది సుశీల. కంఠం రుద్ధమైపోయి మాటరానివ్వలేదు. బెదురుచూపులతో భర్తవంక చూసింది. ప్రార్థనాపూర్వకంగా చేతులుజాచి అతని కాళ్ళను పట్టుకుంది. ప్రయత్నంమీద ఎలాగో 'అయ్యో! నేచేసిన తప్పేమిటి? నాకేదిదారి?' అని మాత్రం అనగలిగినది. ఆ మాటల్లోనే ఆ హృదయగతమైన విషాదభారము పరిస్ఫుటమవుతూంది. భార్య పలుకులు గజానన్ చెవికెక్కలేదు. నిముషంలో భార్య పట్టువిడిపించుకుని ఏజవాబూ చెప్పకుండానే అతడు గదిఅవతలకి పోయాడు. సుశీల అలాగే నేలమీద పడిపోయింది. నాటిరాత్రి ఆమె హృదయాన్ని కలచివేసిన భావాలను వర్ణించడానికెవరితరం? తల్లిని తలుచుకుని ఆమె యెంతసేపో యేడిచినది. తన ప్రస్తుత కష్టాలకి బుద్ధిపూర్వకంగా కాకపోయినా కొంతవరకు కారకుడైనప్పటికీ తన్ను అంతప్రేమతో పెంచిన మేనమామ లేనందుకు ఆ నిర్మలహృదయము ఎంత క్షోభించిపోయిందో ఊహించలేము.

జరిగినదంతా ఒక భయంకరస్వప్నంలాగు ఆమెను పాడకట్టింది. లేవబోయింది కాని శక్తి చాలలేదు. 'ఈ అర్ధరాత్రివేళ నేను నిస్సహాయనై ఎక్కడికి పోగలను? నన్నాదరించేవారెవరున్నారు? ఎంత ద్రోహినైనాసరే నేరం తెలియచేసి చెప్పుకోడానికి అవకాశమిస్తారుకదా. నా అపరాధమేమిటో తెలియచెయ్యకుండానే, నామాటలేనా వినకుండానే పైకిపోతే నేనేంచేసేది! ఇంత కఠిన ప్రవర్తనను సహించినా గుండెలు బద్దలైపోవేమి! నా ప్రేమకీ, నేను చూపించిన విశ్వాసానికీ ఇవేనాబోలు ప్రతిఫలము? తండ్రీ! ఈ పరీక్షకి నేను ఆగలేను.' అని నిట్టూర్పువుచ్చి అల్లాగే పడుకుంది.

తెల్లవార్లూ ఆమె కళ్ళుతెరుచుకునే ఉన్నాయి. వెయ్యి ఆలోచనలు ఆతలలో తిరిగిపోయాయి. నాడు తోడికోడలు భర్తతో అంటూఉండగా తాను విన్న మాటల అర్థమామెకిప్పుడు బోధపడింది. నిరంతరరోదనకృతమవడంచేత మెదడు వేడెక్కి సుశీలకు తలనొప్పి వచ్చింది. భర్త తిరిగి గదిలోకివస్తే తననేరం తెలుసుకుని, సాధ్యమైనంతవరకూ తన నిర్దోషిత్వమును రుజువు చేసుకుందామని ఆమె తన భావాలను సవరించుకుంటూ కనిపెట్టింది. కాని ఆమెను నిరాశయే యెదురుకున్నది.

* * * *

సుశీలకీ తోడికోడళ్ళకీ వివాదము జరిగేటప్పుడు బావగార్లిద్దరూ సుశీలపక్షమే వహించి వాళ్ళనే మందలిస్తూ ఉండేవారు. దానితో అసలు విరోధాలకు తోడు స్త్రీ సహజమైన ఈర్ష్యకూడా తోడికోడళ్ళను ఆవహించింది. ఈర్ష్య ఎంతపనికేనా వెనకతియ్యదు కదా !

సుశీలపైని పగతీర్చుకోవాలనే అభిప్రాయంతో వాళ్ళొక పన్నాగమును ఆలోచించారు, సుశీల తమ భర్తలను వశపరిచేసుకుందని వాళ్ళు అత్తగారితో చెప్పలేనిపోని విచారమును ప్రదర్శించడం ప్రారంభించారు. 'ఏసంబంధమూ లేకపోతే ప్రతివిషయంలోనూ బావగార్లు మరదలిపక్షమేమిటి ? మీరు తగిన కట్టుదిట్టం చెయ్యకపోతే మాకాపురాలకు నీళ్ళు వదులుకోవలసిందే.' అని నిత్యమూ ఆమెముందు గోలపెట్టేవారు వాళ్ళిద్దరూను.

బాల్యంనుంచీ సుశీల స్వాతంత్ర్యాభిలాషగల పిల్ల. స్త్రీస్వాతంత్ర్యమునకు అవకాశముందనే ఆమె క్రైస్తవమతమును స్వీకరించింది.

సుశీల బావగార్లదగ్గిర అతి చనువుగా తిరుగుతూ ఉండేది. మేనమామవద్దకు వస్తూఉండేటప్పుడు చిన్నప్పటినుంచీ వారి నామె ఎరుగును. భయానికీ, ఇతరులేమనుకుంటారో అన్న అనుమానానికీ ఆనిష్కల్మష హృదయంలో తావులేదు.

అందుచేత ఇంటి అందరిదగ్గిరా తిరిగినట్లే ఆమె బావగార్లతోకూడా స్వేచ్ఛగా మాట్లాడుతూ, నవ్వుతూ చనువుగా సంచరించేది. కోడళ్ళు చెబుతూఉన్న దానికీ సుశీల నడవడికీ సరిపోయిందనుకుంది స్వేచ్ఛావాసన ఎరుగని ముసలావిడ.

నాటిసాయంకాలంనించీ గజాననకీ తల్లికీ ఈవిషయమైన సంభాషణయే జరుగుతూంది. కుమారుడు చెన్నపట్నంనించి రాగానే చెప్పాలని కనిపెట్టుకుని కూర్చుంది ఆవిడ. తనుచెప్పబోయే మాటల దుష్ఫలితాన్ని గ్రహించలేకపోయిందామె. 'నీఅన్నగార్లున్నచోట నీభార్య ఉండకూడదు. అది ఉండేస్థలంలో నీ అన్నగార్లుండకూడదు. నీతోకూడా చెన్నపట్నం దాన్ని తీసుకుపోకపోతే కుటుంబానికి తీరని అపఖ్యాతి రాకమానదు నీభార్య ప్రవర్తన బాగులేదు.' అని ఆమె గజాననతో చెప్పేసింది.

అందుపైని తల్లికీ కొడుక్కీ చాలాదూరము వాదన జరిగినది. తనవాదన నిలబెట్టుకోవాలని ముసలావిడ ఎన్నెన్నో నిదర్శనాలు చెప్పింది. ఇవన్నీ విని కుమారుడు భార్యని తనతోకూడా తీసుకుపోతాడని ఆమె అభిప్రాయము. కాని ఇంతదూరం జరుగుతుందని కలలోనూ యెరుగదు.

గజానన్ లోతుగుండెగల మనిషి. తల్లిమాటలతో అతనితల తిరిగిపోయింది. అన్నగార్లకూ భార్యకూ ప్రేమ ఏర్పడిపోయిందని అతను పూర్తిగా నమ్మేశాడు. ఆ సాయంకాల మతనికి భోజనం రుచించలేదు. తీవ్రంగా ఆలోచించాడు. సుశీలతో సంబంధం తెంపేసుకోడానికి నిశ్చయించేశాడు. తరవాత సంగతి మనకి తెలిసినదే.

## 3

తెల్లవారిపోయింది. కోడికూతవేళనించీ దట్టమైన పొగమంచు కమ్మి గజందూరంలోఉన్న వస్తువులనుకూడా స్పష్టంగా కనబడనివ్వడంలేదు. ఉదయంతొమ్మిదివరకూ సూర్యదర్శనం కాలేదు. మామూలుగానే సుశీల గృహకృత్యాలు నిర్వర్తిస్తూంది. తగిన సమయం చూసి భర్తతో మాట్లాడ్డాని కామె నిశ్చయించుకుంది. కాని అతను తన్ను తప్పించుకుని తిరగడంచూసి ఆమె దుఃఖము మితిమీరిపోయింది. సుశీల ఉన్నట్లయితే ఎంత అవసరమైన పనిఉన్నా మానుకునేవాడు కాని అతడా గదిలోకి అడుగుపెట్టేవాడు కాదు.

గజానన్ కూడా పూర్తిగా మారిపోయాడు. అతని సంతోషము మాయమయిపోయింది, ఎవరితోనూ మాట్లాడడు. ఎప్పుడూ దీర్ఘాలోచనే ! షికారుకూడా మానేశాడు. భార్యతో చెప్పినట్లు అతడా మర్నాడే చెన్నపట్నం వెళ్ళలేదు. కాని ఉన్న రెండురోజుల్లోనూ ఆమెను తప్పించుకునే తిరిగేవాడు.

చెప్పుడుమాటల విష మతనికి పూర్తిగా ఎక్కిపోయింది. సుశీల గుణవంతురాలని అన్నగార్లిద్దరూ

చాలామార్గం చెప్పారు. వాళ్ళు చెబుతూఉన్నకొద్దీ అతనికి మరింతకోపం ఎక్కువైపోయింది. వాళ్ళతో మాట్లాడ్డంకూడా మానేశాడు చివరకి.

ఇంతప్రమాదం సంభవిస్తుందని ముసలావిడ అనుకోలేదు. ఆమె తన తొందరపాటువల్ల వచ్చిన విపరీతమును చూసి హడిలిపోయింది. గజానన్‌తో భార్యను విడిచిపెట్టడం పాపమనీ సుశీలకి చిన్నతనమనీ ఏదో సర్ది చెప్పబోయింది. ఒక్క కసురుతో ఆమె అదిరిపడి దుఃఖపడుతూ మరి చెప్పడం మానుకుంది.

అసలు గజానన్ భావోద్రేకంకల మనిషి కాడు. అత్యధికసంతోషం కాని, విచారంకాని ప్రదర్శించే తత్వంకాదు. సుశీల నతడు మనసారా ప్రేమించాడు. విచ్ఛిన్నమయిపోయిన ప్రేమతోపాటతని హృదయము బద్దలైపోయింది. ఉన్న రెండురోజులూ అతడు ఒంటిగానే తనదుఃఖాన్ని అనుభవించాడు. నిట్టూర్పులతోనూ, కన్నీళ్ళతోనూ అతనిముఖం వాడిపోయింది. పెదవులుమాత్రం కదిలేవికావు. ఆ రెండురోజుల్లోనూ ఒక్కసారిమాత్రం అగ్నిపర్వతం పేలినట్లుగా 'ఛీ! ఇంకా నాకు అన్నదమ్ములెక్కడ? నా జీవితాన్ని బుగ్గిచేసినరాక్షసులు వీళ్ళు' అనేమాటలు అప్రయత్నంగా అతనినోటినుండి వచ్చాయి. మళ్ళీ భయంకర మౌనమే.

సుశీలయెడల ఎన్నడూ గజానన్ కఠినుడుగా ఉండలేదు. ఇంతలో భర్త యిల్లా మారిపోయినందుకు సరియైనకారణం ఊహించలేక సుశీల నిస్సహాయురాలై తనలోతనే ఏడ్చుకుంది. చివరకి గజానన్ చెన్నపట్నం వెళ్ళాడు. వెళ్ళేటప్పుడుకూడా తుదిమాటగానైనా భార్యతో ఏమీచెప్పలేదు. అంతవరకూ తమనేరం కనబడకుండా ప్రవర్తించిన తోడికోడళ్ళు మళ్ళా విజృంభించి ఆమెను సాధించడం మొదలెట్టారు

ఇల్లా పదిరోజులుగడిచాయి. సుశీలగతి రోజుకి రోజూ హీనమయిపోతూంది. చివరకామె భర్తకొక సుదీర్ఘమగు జాబువ్రాసింది. ఎంత కఠినహృదయాన్నైనా కరిగించేటంత జాలికరంగాఉంది ఆజాబు.

ప్రత్యుత్తరానికి నిరీక్షిస్తూ దినమొక యేడాదిగా సుశీల మరి పదిరోజులు గడిపింది. ఎట్టకేలకు జాబు వచ్చింది. ఉత్తరంపైని సుశీలవిలాసమే ఉంది. పోస్టు మనిషి సాయంకాలమే ఉత్తరం ఇచ్చాడు.

వెంటనే జాబును చదవడానికామెకి ధైర్యం చాలిందికాదు. దానిపైనే తన భావిజీవిత మాధారపడి ఉన్నట్లామెకు తెలుసును. రాత్రి ఒంటరిగా గదిలో చూడాలని ఆమె నిశ్చయించుకుంది.

సృష్టిశోభయావత్తూ పశుపక్ష్యాది జీవకోట్ల మీదనే ఆధారపడిఉంది. క్రమక్రమంగా సూర్యుడస్తమించాడు. జీవరాసులు విశ్రాంతినిమిత్తము పట్లు చేరిపోవడంచేత ప్రపంచకం కళారహితమయిపోయింది.

ఇంట్లోపనులు ముగించుకుని సుశీల గదిలో ప్రవేశించేసరికి రాత్రి పదిగంటలయింది. భర్త రాసినజాబు బల్లమీదఉంది. చదవడానికని తీసేటప్పుడు ఆమె చేతులు వణికిపోయాయి. జాబు నేలమీద పడిపోయింది. తీసుకోడానికామె వంగినది. కాని కదులుతూ ఉన్న త్రాచుపాములాగు ఆ కవరు భయముగొల్పడం చేత మళ్ళీ వెనక్కి తప్పుకున్నది

ఎల్లాగో ధైర్యంతెచ్చుకుని కొంతసేపటికి తలుపులన్నీ మూసేసి, కవరునుచింపి ఉత్తరాన్ని చదవడం ప్రారంభించింది. చదువుతూఉన్నకొద్దీ ఆమెముఖం వివర్ణమయిపోతూంది. ఉత్తరం చేతులోనుండి జారిపోయింది. సుశీల పెద్ద నిట్టూర్పువిడిచి కొయ్యబొమ్మయైపోయినది.

అశ్రుధార లామె కపోలములపై కాలువలుకట్టాయి. నిట్టూర్పుగాడ్పులు అగ్నికీలలవలె గది నిండిపోయాయి. ఆమె ఆశ కూలిపోయింది. భర్తవైఖరి ఏమాత్రమూ మారలేదు. ఈ పిడుగుదెబ్బతో ఆమె హృదయము బద్దలైపోయింది. తన దుఃఖమయ జీవితాన్ని తలుచుకుని ఆమె ఎంతోసేపు ఏడ్చినది.

'మనస్ఫూర్తిగా ప్రేమించినభర్తయే ఇల్లా చేసినపుడు ఇంకా నాకు జీవితాశయెందుకు? ఝుంఝూ

మారుతంచేత ప్రపంచకం కంపించిపోతూఉండే రాత్రియప్పుడు చెట్టుచివరనుండే పక్షికేనా ఆశఉంది కాని నాకుమాత్రం ఏవేపుచూసినా నిరాశయే ప్రత్యక్షమవుతూంది.

'గొడ్డు గోతులో పడితే అందరూ తలోకర్రాయీ విసిరేవారే' అన్నట్లుంది నా బతుకు. నాకు కాస్త ధైర్యమేనా చెప్పేవారులేరు. చిన్నప్పుడు నిముషమయినా వదిలిపెట్టిఉండలేని స్నేహితురాలూ, తండ్రీ ఇప్పుడు నన్నుచూసి అసహ్యించుకుంటున్నారు. మతాంతరురాలనైతే మాత్రం నాదికూడా మానవజీవనమే కదా! కాస్తదయగల మాటాడ్డానికి నా అర్హురాలను కాను కాబోలు!

'నా చదువూ, అందమూ, అన్నీ విలువలేనివై పోయాయి. అవే నా జీవితానికి కష్టంతెచ్చాయి కూడాను. తోడికోడళ్లకి పగదాన్నై పోడానికి కారణం ఎంత ఊహించినా తోచకుండాఉంది. బావగార్లూ, మామగారూ వాళ్ళకి వ్యతిరేకం చెప్పలేక నా స్థితి కళ్ళారాచూస్తూ ఊరుకున్నారు. ఇంక ఈ యింటిలో ఉండడానికి నాకు ఏమిపని ఉంది? ఏంచెయ్యడానికీ ఈ స్థితిలో నాకు పాలుపోవడంలేదు.

పై విధములగు విషాదకరములగు తలపు లామెను బాధిస్తున్నాయి. (కొదువ)

—కాళూరి వెంకటరామారావు.

# భగ్నవీణ

౧

ముచ్చట దీఱ నే మధుర మోహన గీతముపాడ వెన్నెలన్
విచ్చిన పూలతెక్కలను విప్పియమర్చి మనంబుపొంగ భా
వోచ్చలనానిలంబుపయి పైకెలయంగ కవిత్వమొప్పగా
నుచ్చలితార్ద్రరాగమది యొక్కటి తీసితి వీణ మీటుచున్.

౨

పాణితలానబూని యటుపాడుకొనంగ తలంచుచుండ నా
వీణియతంత్రులూడిపడె వీగి మనోహర రాగ మంతలో
రాణతొలంగె గాయకపరాభవమబ్బెనుకాని యింతకున్
ప్రాణముకన్న నాకవిత పాడ్వడ కింకొక రాగమెత్తగా.

౩

అలలవలె తేలివచ్చె నావలకిపోవు
వింతకలల మున్గిన రాత్రి వేగ నుష
భాతనీహారధారినా కైతకూన
దళములనువిప్పి యునరశ్మి చెలువుగనదె.

౪

చిన్నయెలుంగుతో నెనగు చీకటిలో కనుపించుపందలో
మిన్నుతెఱంగు మోమునయి నించిన నైల్యపటంబులోని ది
వ్యోన్నత భావజాలమున నొప్పిన తారలమీద పాడి నే
నెన్నిదినంబులైనయదో! యేమునవేర్తు నికోయి మిత్రమా!

—పెమ్మరాజు రాజగోపాలము, బి.ఏ,

## జిజ్ఞాస — మీమాంస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొనఁ బత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

**27. గాంధి : సర్వమతసమావేశము**

వివేకానందస్వామి సర్వమతసమావేశమునకు హిందూమత ప్రతినిధిగ వెళ్లినపుడు గాంధీమహాత్ముడు జైనమత ప్రతినిధిగ వెళ్లి సమావేశమున పాల్గొనెనను విషయము నిజమేనా ? —దేవగుప్తాపు విశ్వేశ్వరరావు.

**28. సౌందర్యవర్ధకములగు నగలు**

కాసులపేరు, కంటె మొదలగు ఆభరణములకంటె దుద్దులు, ముక్కుపుడక, బేసరి మొదలైన రాళ్ళనగలే హెచ్చు సౌందర్య వర్ధకములనియు; మొదటివానిని ఎక్కువగ ధరించు ఆంధ్రస్త్రీలకంటె రెండవవానిని విశేషముగ ధరించు తమిళ కాంతలే హెచ్చు సౌందర్యవతులై యుందురనియు క్వీన్ మేరీ కళాశాలలోని నాతోడి ఆంధ్రవిద్యార్థినులు వాదించువారు. ఈ వాదము ఎంతవఱకు సత్యసమ్మతమని చెల్లును ? —యస్. సావిత్రి.

**29 కాలమానము : కొలతమానము.**

ప్రాక్పశ్చిమవాసులకందరకును సంవత్సరమునకు పండ్రెండుమాసములు, ఏడువారములకు సప్తగ్రహనామములు ఉండుటకు కారణమేమి? కాలమానమువలెగాక కొలత తూకము మొదలగువానియందు భేదమేల యుండవలయును ? —కేశరాజు వీరభద్రరావు.

**30. కాకరపాదుకు వేడినీళ్ళ పోత**

చన్నీళ్ళుపోసి పెంచిన దానికంటె వేడినీళ్ళుపోసి పెంచిన కాకరపాదు ఎక్కువగ కాయుననుట నిజమేనా ?—వి. నరసింహారావు.

**21. గతవత్సరమున ముఖ్యమగు తిథులు**

1933-వ సంవత్సరమున అంతర్జాతీయ సమస్యల దృష్టిలో చూచినచో ఈ క్రింది ఆఱు తేదీలును అతిప్రాముఖ్యము వహించినవని సుప్రసిద్ధ రాజ్యాంగవేత్తలందఱును అంగీకరించి యున్నారు.

౧. మార్చి 4 : ఫ్రాంక్లిన్. డి. రూజువెల్టు అమెరికాఅధ్యక్షపీఠము నధిష్ఠించినాడు.

౨. మార్చి 5 : జర్మను ప్రజాస్వామికమును హిట్లరు ఎన్నికలలో కూలద్రోసినాడు.

౩. మార్చి 27 : జపాను నానాజాతి సమితినుండి విరమించుకొన్నది.

౪. ఏప్రియలు 19 : అమెరికా సంయుక్త రాష్ట్రములు బంగారు ప్రమాణమును విసర్జించినది.

౫. జూలై 27 : లండను ఆర్థికమహాసభ నిష్ఫలమైనది.

౬. అక్టోబరు 31 : జర్మనీ నానాజాతి సమితినుండి విరమించుకొన్నది.

అడాల్ఫు హిట్లరు విజృంభణము, నానాజాతిసమితి ప్రతిష్ఠాభంగము, రష్యాకు ప్రపంచమునందలి వివిధ ప్రభుత్వములు మంచిప్రతిపత్తినిచ్చుట గతవత్సరము ప్రపంచేతిహాసమున మఱువరాని విషయములు.

—సాధకుడు.

**6. బ్రహ్మజ్ఞాని, రాజర్షియైన జనకుడు**

బ్రహ్మజ్ఞానియైన జనకుడును, రాజర్షియైన జనకుడును ఒకడేకాని వేరువేరు

కాదని చెప్పవలసియున్నది. జనకునకు బ్రహ్మజ్ఞాని అనియు రాజర్షి అనియు విశేషణములను వాడియున్న ఉపనిషద్వాక్యములను ఎత్తి చూపవచ్చును.

—బి. సింహాచలం.

20. కోడక్ ట్రేడ్ మార్కు

కోడక్ ట్రేడ్‌మార్కుకు స్వానుదారుడైన జార్జి ఈస్టుమాన్ తేయాకు వర్తకుడగు సర్ థామస్‌లిప్టన్‌కు వలెనే గొప్ప మాతృభక్తుడగుట నిస్సందేహమని వారి ఉభయుల జీవితచరిత్రలు పఠించినవారికి తేటతెల్లమగును. అసలు ఈస్టుమాన్ తల్లికి వినోదము కల్పించుటకే ఫొటోగ్రాఫరు అయినాడు. ప్రపంచమునందలి అన్ని భాషలలోను సులభముగ ఉచ్చరింపబడగల ట్రేడుమార్కు పదమును సృష్టింప ఆతడు గావించినకృషికి ఫలముగా 'కోడక్' పుట్టువు నొందినది. ఈ పదమున మొదటి అక్షరము 'కె' అయినట్లే ఆతనితల్లి నామములోని మొదటి అక్షరముకూడ 'కె' అయిఉన్నది. ఇంతవఱకు మాత్రమే సాదృశ్యమున్నది కాని ఆతని ట్రేడ్‌మార్కు ఆతని తల్లిపేర పెట్టబడినదని చెప్పుటకు ఎకము లేదు. కావున ఈస్టుమాన్ గొప్ప మాతృభక్తుడే యైయున్నను ఈ విషయము ఆతని మాతృభక్తికి ఒక నిదర్శనముగా చెప్పుటకు వలను లేదు.

—సాధకుడు

22. బొబ్బిలి రాజాగారివంటి యువకమంత్రి

మన రాజధాని ప్రస్తుత ప్రధానమంత్రులగు బొబ్బిలిరాజాగారు ఇంతకు పూర్వము ఇచట మంత్రులుగానున్న అందఱికంటెను యువకులనుట నిజమే. మన దేశమున ఇంత చిన్నతనముననే మదరాసు రాజధానివంటి పెద్ద రాష్ట్రమునకు ప్రధానామాత్యులగుట నిజముగా విశేషమైనదే. ఆంగ్ల మంత్రులలోకూడ ఇంత చిన్నతనముననే మంత్రిత్వము వహించినవారు ఎక్కువగ లేరు. 'పిట్' అనువాడు ఆతని ఇరువదియొకటవ వత్సరముననే ఆంగ్లదేశపు ప్రధానమంత్రియయ్యెను.

—కె. రాజారావు.

26. ఫొటోలు : ముఖవర్చస్సు

ఫొటోలు తీయించుకొనిన ముఖము యొక్క కళ తగ్గిపోవునని నమ్ముట మూఢనమ్మకములలో చేరును. ఈ తరమువారిలో ఈ నమ్మకము అంతగా లేదుగాని ముందటి తరము వారిలో విశేషముగా నుండినది. ఫొటోలు తీయించుకొనినంత మాత్రముననే ముఖముయొక్క కళ తగ్గిపోయినచో ఒక్కొక్కప్పుడు దినమునకు రెండుమూడు సారులు కూడ కెమెరా దృష్టికి గుఱి కావలసియుండు రాజకీయ నాయకుల ముఖములు కళాహీనములు కాక తప్పదు. ఇట్లు అయిన నిదర్శనములు ఏమియు లేవు.

—యస్. అచ్యుతరాయుడు.


# ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౫-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | |
|---|---|
| సంవత్సరమునకు | రు. 3-0-0 |
| అర్ధసంవత్సరమునకు | రు. ౧-౮-౦ |
| నాలుగు మాసములకు | రు. ౧-౦-౦ |
| విడిసంచిక | రు. ౦-౪-౦ |

# జాతకస్కంధచరిత్ర - దానిప్రాచీనత

జ్యోతిశ్శాస్త్రాంతర్గతమయిన జాతక స్కంధమును నమ్మి యవలంబించిన మహాశయుల పేరులు కొన్ని యీక్రిందఁ దెలుపుచున్నాను. అట్టి మహా బుద్ధిమంతులు ఆశాస్త్రమునందలి సత్యమును, జనులకు దానివలనఁ గలుగు లాభమును, నమ్మియుండిననే కాని తా మాశాస్త్రము నభ్యశించియుండరు. బైబిలు మొదలుగాఁగల పుస్తకములను జదివి చూచినయెడల నీక్రింద జెప్పఁబడినవారు ఆశాస్త్రమును నమ్మినవారనియు, కొందరు ఆశాస్త్రమునందుఁ బండితులనియు నిశ్చయింపవచ్చును. సేతు - యాకోబు - సాలోమను - అబ్రహాము హిబరు - డేనియలు - కేనను - యోసేపుమోసెసు- ఇసాకు - సామ్యుయెలు - గాడ్రాకు - మతీయుమిల్టను - యంగు - కాంగ్రీవు - డ్రైడెను - తామ్సను- బైరను - షేక్స్పియరు - ఇమర్సను మొదలగు మహాకవులు కావ్యములయందు జాతకస్కంధమందలి నమ్మకమును సూచించు వాక్యములు గనుపట్టుచున్నవి. ఇంకను ప్లేటో - లిలీ - ప్లయిని - డిమోక్రిటసు - డిమోస్తనీసు - థేకసుథేల్సు - సోక్రటీసు - టాలెమి - ల్యూకె - హేడను - మూరు - సెనెక - సిసిరో - మొదలుగాఁగల తత్వజ్ఞులును, జాతకస్కంధమును నమ్మి యభ్యసించినవారు. ఈక్రిందఁజెప్పిన జ్యోతిష్కులు జ్యోతిశ్శాస్త్రాంతర్గతమయిన జాతకస్కంధమునందు నమ్మకముకలవారు. టాలెమి - న్యూటను - గాలిలి - కోపర్నికసు సేపియరు - విచ్చెలు - పైతాగోరస్ - కెప్లరు - డెస్కార్టిసు. శ్రీశుకులు - పరాశరుఁడు- జైమిని మొదలుగాఁగల మహర్షులు జాతకశాస్త్రమును నమ్మి జాతకగ్రంథములను వ్రాశియున్నారు. జ్యోతిషశాస్త్రము వేదాంగములలో నొకటి. వైదిక కర్మముల కన్నింటికిని జ్యోతిశ్శాస్త్రజ్ఞాన మావశ్యకము జ్యోతిశ్శాస్త్రము వేదమునకు నేత్రమని చెప్పియున్నారు. (శబ్దశాస్త్రం ముఖం, జ్యోతిషం చక్షుషీ। శ్రోత్రముక్తం నిరుక్తంచ; కల్పః కరౌ। యాతుశిక్షాస్య వేదస్యసా నాసికా। పాదపద్మద్వయంఛంద, ఆద్యైర్బుధైః॥) (యథాశిఖామయూరాణాం నాగానాం మణయోయథా। తథా వేదాంగశాస్త్రాణాం జ్యోతిషం మూర్ధనిస్థితం॥) జ్యోతిషము మిక్కిలి పురాతన శాస్త్రము. అది వేదములనాటిది. అప్పటి మహర్షుల దివ్యజ్ఞానము గ్రహతారాదుల వరకును వ్యాపించెను. జాతకశాస్త్రమునందలి నమ్మకము భరతఖండమునుండి చీనా, బాబిలోనియా, కాల్డియా దేశములకును అక్కడనుండి ఈజిప్టుదేశమునకును వ్యాపించెను. జ్యోతిషశాస్త్రమును బలరాముఁడు (హెర్క్యులీసు) గ్రీసుదేశమున వ్యాపింపఁజేశెను. హరికులేశశబ్దము గ్రీకుభాషలో హెర్క్యులీసు గా మారెను. గ్రీకు రోమను చరిత్ర గ్రంథకర్తలు ముఖ్యముగా డైయోడోరసు - సిక్యులీసుజ్యోతిషశాస్త్రమును మొదట హెర్క్యులీసు గ్రీసు దేశమునకుఁ దెచ్చెనని రూఢిగాఁ జెప్పుచున్నారు. గ్రీసుదేశమునుండి ఆశాస్త్రము యూరపుఖండమందంతటను వ్యాపించెను. ఇట్లు జ్యోతిషశాస్త్రము భరతవర్షమునుండి ప్రపంచమందలి యితరభాగములను వ్యాపించెను. వేదములు అథమము క్రీ॥ పూ॥ 4000 సంవత్సరముల కంటె యీవలివి కావని తానన్నమాట జ్యోతిషశాస్త్రమునుబట్టి ఋతువుల యారంభమును లెక్కించి యాకుబు పండితుడు స్థిరపరుచుచున్నాఁడు. శ్రీరాముని జాతకమునుబట్టి ఆయన క్రీ॥ పూ॥ 3102-వ సంవత్సరమున జన్మించినట్లు సిద్ధాంతమును చేశియున్నారు. భరతదేశచరిత్రమును బట్టి చూచినను కేవలము జాతకవిషయముననే తిరువల్లూరు పథకములనుబట్టి చూచినను క్రీ॥ పూ॥ 3122 నాటికే జ్యోతిషశాస్త్రజ్ఞానము యీదేశమున నుండినట్లు స్పష్టమగుచున్నది.

—చాగంటి అన్నప్ప.శాస్త్రి.

# మణిమాల

## విదేశీ కంపెనీలలో భీమా చేయుట

విదేశపుభీమా కంపెనీలు మన సంకల్పములతో ఏకీభవింపజాలవు. అవి మన అక్కఱలను కాజాలవు. మన రాజకీయపు హక్కులను వానిపని అడ్డుపడునదిగా నుండును ఒకజాతియొక్క క్షేమాభివృద్ధులను విదేశపు భీమా కంపెనీలు విరోధించియుండును. విదేశపుభీమా కంపెనీలు ఇతరదేశములను దోచి తమతమ దేశముల ధనసంపదను పెంపొందించును. దేనికైనను ఒకనిపై ఆధారపడియుండుట వానితో స్నేహమునకు పర్యాయపదము కాజాలదు. తనకుతాను పూర్ణుడు, స్వతంత్రుడు కానివాడు ఇతరునకు మిత్రుడు కాజాలడు. ప్రధాన కార్యస్థానము సుదూరముననుండు విదేశీకంపెనీలలో భీమా చేయుటవలన మనలను విదేశీయులకు దాసులనుగా చేయును విదేశీకంపెనీలలో భీమా చేయుట వలన భీమా చేసినవారికి సాధారణముగనుండు ఆర్థిక రాజకీయ హక్కులు లేకుండపోవును. అదియునుగాక ఆ భీమా సంస్థయొక్క స్థిరత్వమునుగూర్చియు సక్రమ నిర్వాహణమునుగూర్చియు మనము తెలిసికొనుటకు అవకాశములేకుండ పోవును. భీమావలన పొందదగు పలు లాభములను మనము పొందలేక పోవుదుము. విదేశీ భీమా కంపెనీలతో భీమాచేయుట అనగా జాతీయ పరాధీనతను, కష్టమును, నష్టమును కోరి తెచ్చుకొనుటయే. జాతీయాతకు ప్రజాశక్తికి, స్వాతంత్ర్యమునకు, దేశ సంపదకు, దేశ క్షేమమునకు అది వేరుపురుగు వంటిది.

—దిఇండియన్ ఇన్స్యూరెన్సు

* * *

## జపానులో విలువిద్య

తుపాకులు రాకపూర్వము ఇతర దేశములందువలెనే జపానులోకూడ విలువిద్య విస్తారముగ అభ్యసింపబడుచుండెను. తుపాకులరాకతో విలువిద్య నేర్పు పాఠశాలలు జపానులో క్రమముగా తగ్గిపోవ నారంభించెను. విల్లంబులు తుపాకులకు సరికాజాలవు కదా! కాని జపానులో దేహపరిశ్రమకొఱకు విలువిద్య నేడు కూడ అభ్యసింపబడుచున్నది. టోకియో యందును, ఇతర పట్టణములయందును విలువిద్య నేర్పుటలో కుశలులగువారు నేడును గలరు. విలువిద్యయందు పోటీ పరీక్షలు జరుపబడుచుండును. ఆ పోటీ పరీక్షలు జరుపుటకు ప్రత్యేకస్థలములు ఏర్పాటైయుండును. ఫుట్‌బాల్, క్రికెట్ మొదలగు క్రీడలను పాశ్చాత్యులు ఎంతగా ప్రేమింతురో కొందరు జపానీయులు ఈ విలువిద్య క్రీడలనుకూడ నంతగ ప్రేమింతురు. పెద్ద కుటుంబులకు చెందిన పురుషులు స్త్రీలుకూడ— ఈ క్రీడాస్థలములకు వత్తురు. దేహపరిశ్రమకు అనువైన క్రీడలలో నిదియొకటి అగుట దీని అభ్యాసమునకు పలువురు మక్కువపడుదురు. ఉన్నతకుటుంబములకు చెందినవారు అభ్యసించుటకు అనువైన దేహపరిశ్రమలో విలువిద్యకు చాలినదిలేదని జపానీయుల అభిప్రాయము. అగుట ఆ దేశమున విలువిద్య నభ్యసించువారిలో పలువురు ఉన్నత కుటుంబములకు చెందినవారే. ఈ కళ అభ్యసించుటలో ఒకడు తాను నిలబడుతీరు విషయమును గూర్చియు, తన మనస్సుయొక్క స్థితినిగూర్చియు, అతి జాగ్రత్త వహింపవలసియుండును. విలుకాడు ఎల్లవేళల స్థిరచిత్తుడై యుండవలయును. తన విద్యను గూర్చి పొరపాటునగూడ ఆసామాషీగా తలంపగూడదు, విలుకాడు ఆత్మసంయమన మలవఱచుకొనవలయును. ఉచ్ఛ్వాస నిశ్వాసములు క్రమపఱచుకొనవలయును. కండరముల శక్తికి పూర్తి వినియోగము కల్పింపవలసియుండును. గుఱితప్పిపోకుండ దృష్టి నిలుపవలసియుండును ఇంత మెలుకువలో వర్తింపవలసిన వాని మానసిక స్వభావము స్థిరమైయుండుట జపానీయులు వానిని అధికముగ మెచ్చుకొందురు. తుపాకి గుఱిచూచి కొట్టుటకంటె అంబుకొట్టుటకు ఎక్కువ

కుశలత కావలసియుండును. విలుకాడు ఎట్టి కృత్రిమ సహాయమునులేకనే గుఱిని కొట్టవలసియుండును.

—ది జపాన్ మేగజిన్

* * *

## జపానులో నొకవింత ఉద్యోగము

జపానీయులు పలు పాశ్చాత్యపద్ధతులను, కళలను, ఫాషనులను అలవఱచుకొనినను వారి జాతీయపద్ధతులలో శుభ్రమైన వానిని, అనువైనవానిని, చవుకయిన వానిని విడనాడలేదు. అట్లు విడనాడకుండిన పద్ధతులలో నొకదానిని యస్. హొండా అనువారు 'ది జపాన్ మేగజిన్'లో ఇట్లు వివరించుచున్నారు. 'ఈ దేశమునందలి వింత ఉద్యోగములలో చెప్పులను జాగ్రత్తపెట్టు వృత్తియొకటి. జపానువారి పాదరక్షలకును పాశ్చాత్యుల పాదరక్షలకును ఎంతయో తేడా కలదు. జపానువారు ఉపయోగించు పాదరక్షలలో గేటా, సెట్టా, జోరి అనుబడువాని మాదిరివి ఇతర దేశములందు కానబడవు. ఒకఇంటికి పోవునపుడు ఈ పాదరక్షలను ఆయింటి బయటనే విడిచి లోనకు పోవలయును. అదియొక నాటకశాలగాని, సభా మందిరముగాని అయినచో వందలకొలది వేలకొలది అగు పాదరక్షలను బయట వదలివేయవలసినదే. ఇట్లు బయట వదలివేసిన పాదరక్షలను జాగ్రత్తపెట్టుటకు ఒకడు నియమితుడైయుండును. ప్రజలు విశేషముగవచ్చు పైన చెప్పిన సంస్థలవంటి వానికడ ఇట్టి పాదరక్ష రక్షకులు తప్పక ఉందురు. ప్రతివాడును తన పాదరక్షలను వానికి అప్పగించవలయును, వాడు వారికి ఒకచెక్కను లోపల మందిరమున ఉపయోగించుటకు అనువైన స్లిప్పరుల జోడును ఇచ్చును. వెళ్ళిపోవునపుడు ఆతడు ఈ స్లిప్పరులును, ఆ చెక్కను వానికి ఇచ్చివైచి తన పాదరక్షలను తాను పొందును. చెక్క సాధారణముగ నెంబరు చెక్కబడిన కఱ్ఱబిళ్ళయై యుండును. ఈ కొయ్యబిళ్ళపైగల నెంబరు ఒక చీటిమీదవేసి దానిని పాదరక్షలకు కట్టుదురు. ఇట్లు చెప్పులను జాగ్రత్తపెట్టువారిని జపానీయులు గేసాకుబన్ అను నామమున పిలుతురు. ఈ వృత్తి ఆ దేశమున అతి ప్రాచీనకాలమునుండియు వచ్చుచున్నది. ప్రపంచమున మతి యెచ్చటను గానరాదు. కథలుచెప్పు మందిరములు, సినీమాహాలులు మొదలగువానికడ ఈ గేసాకుబన్లు తప్పక ఉందురు. ప్రతి పెద్దపట్టణమునందును గేసాకుబన్లను కుదుర్చు ఆఫీసులు గలవు. ఏ గృహస్థు అయినను ఒకనాడు విందుభోజనము మొదలగునవి ఏర్పఱచుచో వచ్చు అతిథుల పాదరక్షలను జాగ్రత్త చేయుటకు ఆ ఒక్కనాటికి ఈ గేసాకుబన్లను ఆ ఆఫీసుద్వారా కుదుర్చుకొనవచ్చును. నేడు జపానునందలి పెద్ద ఆఫీసుమందిరములందు లోపలకూడ పాదరక్షలతో తిరుగుటకు అనుమతి గలదు. కాని ఇళ్ళయందు మాత్రము పాదరక్షలతో తిరుగరాదు. పుస్తక భాండాగారములందుకూడ చెప్పులు తొడుగుకొని లోనికి పోరాదు. లైబ్రరీలకడ గేసాకుబన్లు తప్పక ఉందురు. ఈనొ గ్రంథాలయమునకు దినమునకు సగటున మూడువేలమంది పాఠకులు వత్తురు. ఈ మూడు వేలమంది చెప్పులను అచటి గేసాకుబన్లు జాగ్రత్త పెట్టవలసియుందురు.' —ది మోడరన్ రెవ్యూ.

---

## గతమాసపు సంఖ్యాపజుల్ సమాధానములు

1. వసంతము, 2 పద్మము, 3. రామాయణము, 4. పిల్లి, 5. భూకంపము, 6 దానిమ్మ, 7. ఏకాదశి, 8. సావిత్రి, 9. అర్జునుడు, 10. కావేరి, 11. భవభూతి, 12. పిచుక, 13. దమయంతి, 14. వాల్మీకి, 15. వనజాక్షి, 16 భారతి. ఈ పజిల్ నకు [illegible]లువురు పోటీ చేసియున్నను ఒక్కరుకూడ అన్నిటికిని సరియైన సమాధానములు వ్రాయలేదు. ఈ క్రింది ముగ్గురుమాత్రమే ఒక్కొక్క విషయమందు తప్పినారు.

౧. శ్రీమతి డి. రాజరత్నమ్మగారు,
కేరాఫ్ దొంతి. రామసుబ్బారావుగారు ఉప్పుఏలూరు.

౨. యడ్లపాటి లక్ష్మణస్వామిగారు,
మునిపల్లి గుంటూరుజిల్లా.

3. శ్రీమతి ఐ. కమలాదేవిగారు
కేరాఫ్ ఐ యమ్. శాస్త్రిగారు తెనాలి.

పై ముగ్గురకు అన్నిటికి సరియైన సమాధానములు వ్రాసినవారు లేకపోవుటచే మా ఆంధ్రభూమి ఒక్కొక్కరికి ఒకసంవత్సరం ఉచితముగా పంపుటకు నిర్ణయించినాము.

# సంపాదకీయ సమాలోచన

**గోలకొండ పత్రిక : కవుల సంచిక :—**

నిజాము రాష్ట్రాంధ్రుల ద్వైవార పత్రిక యగు గోలకొండ పత్రిక ప్రత్యేక మొక కవుల సంచికను ప్రచురింప తలపెట్టినందుల కెంతయు అభినందించ వలసియున్నది. ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికను, కృష్ణాపత్రిక సంక్రాంతిసంచికను, గృహలక్ష్మి దసరాసంచికను ఆయాపండుగ సమయమున ప్రచురించుట మనము ఎఱుగుదుము. కాని ఇట్లు ప్రత్యేకము ఒకప్రాంతమునందలి కవుల సంగతి తెలుపుటకు సంచికను ప్రచురింప సమకట్టియు, ఆసంచికను ఆకవుల కవితకు ప్రదర్శనభూమిగ చేయ తలపెట్టియు చేసిన ప్రయత్నములు ఇదివఱకు ఏ తెనుగు పత్రిక విషయమునను మనము వినియుండ లేదు. ఈరీతి యుద్యమమునకు గోలకొండ పత్రిక మార్గదర్శకమగుచున్నది. పురాతన కవుల విషయమునుగూర్చి సమకాలిక చరిత్రలు లేకుండినందులకు మనము నేడెంతయు వగచుచున్నాము. వగచుటయే కాని నేటికవులను గూర్చిన చరిత్ర భావిసంతతి వారికి తెలుపు విషయమున మనము పిసరంతేని శ్రద్ధచూపుట లేదు. ఇదియెంతయు తెగడదగినది. బ్రిటీషు ఆంధ్రప్రాంతమున గల నేటి తెనుగుకవులను గూర్చి శ్రీరాజా మంత్రిప్రగడ భుజంగరావుగారు తమ కుమార్తె వివాహమహోత్సవమును పురస్కరించుకొని ప్రచురించిన హైమవతీ పరిణయమున కొంత వివరింపబడినది. నిజాము రాష్ట్రపు నేటి తెనుగుకవులనుగూర్చి అట్టి వివరములు తెలిసికొనగల గ్రంథమేదియు లేదు. రేపటి దీపావళి పర్వసందర్భమున ప్రచురింపబడు గోలకండ పత్రిక కవుల సంచిక ఈలోపమును చాలవఱకు తొలగింపగలదని నమ్ముచున్నాము. నిజామురాష్ట్రమునందలి అక్షరముఖులెల్ల ఈ సంచిక విషయపూర్ణమును, సమగ్రమును అగునట్లు సాయపడి ఆంధ్రాభ్యుదయమునకు యథాశక్తిని తోడుపడగలరని ఆశించుచున్నాము.

**నాస్తికులు దీనికేమందురు ? :—**

"వంగరాష్ట్రమున సాంథాలు పరగణాలలో పకూరు అను పట్టణమున డాక్టరు సత్యేంద్రనాథ్ బెనర్జి ఛీఫ్ మెడికలు ఆఫీసరుగానుండెను. ఆయనకుమారుడు 16 ఏండ్ల యువకుడు. ఆతనికి ఊపిరితిత్తులవ్యాధి చాల ముదిరినది. వైద్యులందరును పెదవులు విరచిరి, వారములోజులలోనే అతడు మృతినొందునని అందరును నిశ్చయించిరి. నిరాశ చేసికొని శ్రద్ధగా చికిత్సచేయుటకూడ మానివేసిరి. ఆ బాలుని తల్లికి దైవభక్తికలదు, ఆ పట్టణమున పంచథక్కూరు అను దేవుని గుడియున్నది. ప్రసవగృహముల కాదేవుడు అధిష్ఠాతయని ప్రజలు నమ్మెదరు. ఆమె ఆదేవునిగుడివద్ద నిరశనదీక్షను ప్రారంభించెను కొన్నిరోజులగుసరికి దేవుడామె కలలో కనపడెను. 'నీకొడుప్రక్కమీద దిండుక్రింద నొక రాగిముక్క కనపడును. దానిని కడిగి ఆనీళ్ళు త్రాగించుము. నాయనుగ్రహమున నతడు బ్రతుకును'. అని ఆమె కెరిగించెను. ఆమెకు మెలకువయైనది. ఆమె వెళ్ళిచూడగా

దిండుక్రింద రాగిముక్క కనబడెను. దాని నొక గిన్నెడు నీళ్ళలోవేసి కొంతసేపైన పిమ్మట ఆనీళ్ళను తనకొడుకుకు త్రాగించెను. మరునాడే జ్వరము వదలినది. రెండు మూడు రోజులలో నతడు లేచినడువగలిగెను. క్రమముగా నతనికి బలముగూడ కలిగెను. వ్యాధికుదిరినదని డాక్టరులందరును నిర్ధారణ చేసిరి." (భారతవైశ్య) అనదుమ కలకత్తాయందలి నొక తమిళ కాంత తనమగడు రోగవిముక్తుడైనచో తమ స్వస్థానమగు కుంభకోణమునందలి దేవునకు నిలువుదోపు ఇత్తునని మ్రొక్కుకొనుటయు, ఆతడు స్వస్థచిత్తుడగుటయు మనము పత్రికల మూలమున వినియున్నాము. బేబరు హుమాయూన్‌ల విషయమునకూడ ఇట్టి కథ గలదు. ఇట్టి సంఘటనములు నాస్తికులకుగూడ ఆస్తిక్యభావమును కలిగించును.

ఘంటాసురుని కథ అసత్యమా ? :—

పురాణకథలు పుక్కిటిగాథలని నేటి ఆంగ్లమానస పుత్రులలో పలువురి నమ్మకము. పూర్వమొక అసురుడు విష్ణునామము తనకు వినిపించకుండ గంటలు కట్టుకొన్నాడట విష్ణునామమును ద్వేషించిన ఆఘంటాసురుని అంశగలవారు ప్రతియుగమునందును ఉందురు. లవణసత్యాగ్రహావసరమున గాంధిటోపికి - ఎర్రబట్టచూచిన సంతపశువులవలె- బెదరిన ప్రభుతోద్యోగు లెందఱోగలరు. ప్రభుత్వమును ప్రతిఘటించుచున్నాడు కావున ఆనాడు గాంధిటోపీని చూచి ప్రభుతోద్యోగులు బెదురుటలో కొంత అర్థము కలదు కాని నేడు గాంధి ప్రభుత్వమును ప్రతిఘటించు యోధుడుగాడు. షష్ఠిఘడియలు హరిజనసేవలో మునిగి తేలుచున్న సాత్వికమూర్తి, కాగా ఇపుడాతని నామమునకు ప్రభుతోద్యోగులు బెదరవలసిన పనిలేదు, కాని కొందఱు బెదరుచునే యున్నారు. బెదరుజాడ్యము ఒకసారి కలిగినచో మరి మానదేమో ! మానుటయే యుండునేని ఈక్రింది విషయము నడచునా ? ఒక తండ్రి తనకుమారునకు గాంధినామ మిడెను. జీతమీయ నక్కఱలేని పద్ధతిని పాఠశాలలో చదువుకొనుటకు సర్టిఫికెటును బడయుటకు ఆతడు ఒక ఫస్టుక్లాసు మేజస్ట్రేటుగానున్న ఒక భారతీయునివద్దకు వెళ్ళెను. ఆతడు తన పేరు గాంధి అని చెప్పుటతోడనే మేజస్ట్రేటు కక్కసించుకొని సర్టిఫికెట్ ఈయ నిరాకరించి ఆబాలుని గాంధి వద్దకే పొమ్మని చిరాకుపడినాడు.

కుమ్మరావమునకు కుండలు అమ్మకమునకు తెచ్చుట :—

ప్రపంచమున వరిపంటకు ప్రేరుప్రోసిన దేశములందు మన భారత దేశమొకటి. అట్టి భారత దేశమునకు నేడు మన దౌర్భాగ్యవశమున బియ్యము దిగుమతియగుచున్నవి. కుమ్మరివీధికి కుండలు అమ్మకమునకు తెచ్చి వానిని అచటి కుమ్మరులచే కొనిపించుట. చూడుడు : భారత దేశమునకు బియ్యపు దిగుమతుల లెక్కలు.

| | | | |
|---|---|---|---|
| జనవరి: | 19628 టన్నులు | ఏప్రియలు: | 32264 టన్నులు |
| ఫిబ్రవరి: | 15641 ,, | మే : | 16780 ,, |
| మార్చి : | 23207 ,, | జూన్ : | 14680 ,, |

పిసరంతేని అవసరములేని ఈ బియ్యపు దిగుమతిని అరికట్టుటకు భారతప్రభుత్వము వారు ఏమాత్రమును తలంపకున్నారు. ఈ బియ్యపు దిగుమతి నిలుపబడకుండినంత కాలమును దేశమున ధాన్యపుధర పెరుగదు. ధాన్యపుధర పెరిగినగాని రయితు తెప్పరిల్లడు. దేశమునకు వెన్నెముకయగు రయితు పడిపోయియుండుట ప్రభుత్వమునకు దేశమునకు మంచిదికాదు.

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవిత భీమా : కొన్ని ఆలోచనలు

## ౪

## భీమా ఏజెంటు

(గత వ్యాసము తరువాయి)

గత వ్యాసమునందు భీమాకంపెనీ ప్రతినిధిత్వము ఏలా గౌరవనీయమైన వృత్తియో సూచింపబడినది. ఆ వృత్తి ఎంత గౌరవనీయమైనదో అంత బాధ్యతకలది కూడను.

సామాన్యముగా దేశమందు ప్రస్తుతం పనిజేస్తూన్న సామాన్యప్రతినిధులందరు మొదటివ్యాసంలో వ్రాయబడిన ప్రకారం తనజీవితాన్ని భీమాచేయదగిన యోగ్యత కలవారినే కలిసికొని వారిచేత తాను భీమాచేయుట కొప్పుకొనినట్లును, తనయొక్క ఆరోగ్యము గురించిన్ని, సంగతులను క్లుప్తముగా వివరముగా తెలియజేయుచు ఒక దరఖాస్తును తయారు చేయించుతాడు. తరువాత అతన్ని డాక్టరు వద్దకు తీసికెళ్ళి పరీక్షచేయిస్తాడు. పిమ్మట ఈ కాగితములన్నియు కంపెనీవారికి పంపించిన తరువాత ఏజంటుయొక్క పని పూర్తిఅవుతుంది.

డాక్టరు పరీక్షప్రకారం సదరు దరఖాస్తు దారుడు కంపెనీలో చేర్చుకోతగిన వాడని కంపెనీవారికి నమ్మకం తోచినప్పుడు సదరు దరఖాస్తును అంగీకరించినట్లును ప్రథమసంవత్సరపు సాలీనారుసుమును ప్రీమియము పంపవలెనని కంపెనీవారు ఉత్తరము వ్రాసెదరు. సదరు పైకము పంపబడినవెంటనే వారొకపట్టాను జారీచేసెదరు. ఆరోజునుండి మీ సదరు దరఖాస్తుదారునియొక్క జీవితముపైన కంపెనీవారు బాధ్యతవహించెదరు.

ఈపనిని నిర్వర్తించినందులకు గాను కంపెనీవారు మొదటి సంవత్సరపు సాలినారుసుములో కొంతభాగమును ఏజంటుకు ప్రతిఫలముగా యిస్తారు. తిరిగి కంపెనీతో సదరు పాలసీదారునకు కల సంబంధ మున్నంతవరకూ సదరు ఏజంటుకు కొంతకమీషను ప్రతిసంవత్సరమూ యిస్తూఉంటారు. దీనినే (రెన్యూఎల్) కమీషను అందురు.

పైన వ్రాయబడిన దానివలన భీమాకంపెనీయొక్క ఏజంటు చేయదగిన పని ఏమియో తెలిసికొన్నాము. తనదగ్గరకులోనున్నవారికి తన కంపెనీగురించి నచ్చచెప్పి వారికిని కంపెనీకిని తనసంబంధము కలుగజేయుటయే ముఖ్యమైనపని. అందుకుగాను కంపెనీవారు ఆ సంవత్సరము తరువాతసంవత్సరాలు కొంతధనము ఏజంటుకు ముట్టజెప్తూతూ ఉంటారు. ప్రస్తుతం కంపెనీలు హెచ్చైనసమయమందు ఈ రుసుము చాలా హెచ్చుగా వృద్ధిచేయబడెను.

ఈ వ్యాపారము వృద్ధిలోనికిరాని పూర్వపురోజు

లందు సామాన్యముగా చదువుకొననివారే ఈవ్యాపారం చేస్తూన్నకారణంచేత ఈ వ్యాపారాని కిప్పుడున్నంత గౌరవం పూర్వం ఉండేదికాదు. కాని ప్రస్తుతం గొప్ప విద్యావంతులు ఈ వృత్తిని చేపట్టడంచేత ఈ వృత్తికి గౌరవం హెచ్చైందై ఈ వ్యాపారానికి అభివృద్ధి హెచ్చింది.

సామాన్యముగా కంపెనీలు ఎట్టివానినైనను తమ ఏజంట్లుగా నియమిస్తున్నారు. కాని అతడు గౌరవనీయుడగునా కాడా అతని మాటయందు అతని గ్రామంలో వారికి గౌరవం కలదా యను విషయంమాత్రం, బాధ్యత కల కంపెనీలవాళ్ళు చూస్తూనేఉన్నారు.


ఈ ఏజంటు చేయవలసినపని చాలా సులభంగా కనపడినప్పటికీ ఆచరణలోమాత్రం చాలా కష్టసాధ్యమైంది. తగిన తెలివితేటలు గౌరవము పలుకుబడి కలవాడైతేతప్ప ఏజంటు తన వృత్తిలో జయప్రదుడు కాలేడు. ఇప్పటికిన్నీ కంపెనీయొక్క మంచి చెడ్డలు తెలిసికోకుండగనే ఏజంటుయొక్క మాటలనుబట్టికాని సిఫారసునుబట్టికాని భీమాచేయువారు చాలామంది ఉన్నప్పటికి ఏజంటుమాత్రం కష్టపడకతప్పదు.

ఏజంట్లు నేను మొదటివ్యాసంలో వ్రాసినప్రకారం అనేకవిధములుగా వ్యాపారాన్ని వృద్ధికి తీసుకొస్తారు. కొందరు స్వదేశీకంపెనీ అని కొందరు స్వకులంకంపెనీ అని కొందరు భీమాచేసి చనిపోవడంవలన డబ్బుసంపాదించిన కుటుంబములయొక్క ఉదాహరణ చూపించి అనేకవిధములుగా ప్రయత్నాలుచేస్తారు. ఏది ఎట్లున్నను కష్టముమాత్రము హెచ్చు.

ఏజంటు గౌరవనీయుడుగా నుండవలెను. అబద్ధములు చెప్పుటను వెనుదీయువాడుగా నుండవలెను మాటప్రకారము నిర్ణయమైన కాలముప్రకారము పనులు జరిగించవలెను. విస్తారమగు ప్రపంచజ్ఞానము కలిగి గొప్పవారితో సమాన ప్రతిపత్తితో మాటలాడగల శక్తియుక్తులు గలిగియుండవలెను. మంచినడవడిక గలిగి పరుల మనోభిప్రాయములను తెలిసికొనువాడుగా నుండవలెను. తాను మాటలాడు వ్యక్తియొక్క చిత్తవృత్తిని బట్టి తనయొక్క సంభాషణను నడపగలవాడే ఈవృత్తియందు విశేషముగా జయప్రదుడు కాగలడు. పైన చెప్పబడిన గుణములన్నియూ కలవారు దొరకుట దుర్లభమే!

భీమా వ్యాపారప్రచారము ఒకవిధముగా ఒకకళ 'ఆర్ట్' యని చెప్పవచ్చును. ఒక చిత్రకారుడుకాని ఒక కవిగాని చిత్తవృత్తినే ప్రధానముగా కలిగి తన కళను ఎట్లు అభివృద్ధిపరచునో ఈ వ్యాపారమందు కూడ అట్లే చాల యవసరము

—జమిలి సత్యనారాయణ



లోకసన్నుతగుణవంతు నేకదంతు,
నమిత హేరంబు సత్కరుణావలంబు
విమలరవికోటి తేజు శ్రీవిఘ్నరాజుఁ,
బ్రథితవాక్సిద్ధి కెప్పుడుఁ బ్రస్తుతింతు.

(మొల్లరామాయణము)

# జయవిజయ యిన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్

(పూర్వపు జయభారత్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.)

సామాన్యజనుల కుపయోగపడునట్లు

నెలవాయిదాల పద్ధతులతో, ధారాళమగు షరతులతో,

## నూతన పద్ధతుల నేర్పాటు చేసినది

నిరుద్యోగులకు మంచియవకాశము.

ఏజన్సీ షరతులకు హెడ్డాఫీసుకు వ్రాయుడు.

**5-104 ఆర్మీనియన్ వీధి, మదరాసు.**

# Tri-Colour Process Blocks



M C Appaswamy Chetty & Co.

PROCESS ENGRAVERS

64 Vavarimuthu St Mannady MADRAS

For Best Results

STUDIO

# హాస్యప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

తాత కృష్ణమూర్తి, బి.ఏ;యల్.టి.

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలదు. క్రౌన్ సైజు, వెల 12 అణాలు.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చటలూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

తాత కృష్ణమూర్తి, భద్రాచలం.

# సువర్ణసుందరరసము
## సర్వసవాామేహాములకు సంజీవివంటిది

ఎటువంటి సవాామేహాములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూాత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూాత్రమునందుండు చక్కెరను మాయము చేయును. ప్రశస్తమైన రసాయనము.

వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రి గారు, ఎ.ఎం.ఎ.సి.



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలు పడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్ధకౌషధము.

## జీవామృతము

### (పూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

### ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె 287,

మదరాసు.

# ది సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం. 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుటవలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని, పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# దిస్టార్ ఆఫ్ ఇండియా

## ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

23, 24 సెకండులైన్ బీచి, మదరాసు.

### 1933 - అభివృద్ధిదశ

| | | | |
|---|---|---|---|
| చేరిన వ్యాపారము | రు. 16,21,000 | గవర్నమెంటు హామీలలో పెట్టుబడి | రు. 95,700 |
| పూర్తిచేసిన వ్యాపారము | ,, 11,53,600 | చెల్లించినక్లెయిములు | |
| దాదాపు ఆస్తులు | ,, 2,00,000 | (ఇండస్ట్రియల్ స్కీములు) | 1,80,000 |

### యాక్చుయరీగారి అభిప్రాయము.

1. కార్యనిర్వహణవ్యయములు ప్రీమియము ఆదాయములో నూటికి 77-24 వంతున చేయబడినవి. ఇది భారతప్రభుత్వమువారు అనుమతించిన దానికంటె చాలభాగము తక్కువగానే యున్నది.

2. మొదటిసంవత్సరములో, సంవత్సరాదాయమునందు నూటికి 25 36 వంతున్నూ, మొదటిసంవత్సరములోనే భీమామొత్తములో దాదాపు నూటికి ఒకభాగమున్నూ కలిగిన రు 10,000 ల జీవితనిధి కమనించినచో, హైందవజీవిత భీమాసంస్థల చరిత్రములో ఈ విషయము అద్వితీయముగా గోచరింపకమానదు.

3. ఆస్తికి, 'ఆర్గనైజేషన్ అకౌంటు' అదనపు ప్రారంభవ్యయములు మొదలైన బాపతులు యేమి లేకుండుట ప్రోత్సాహమైన సంగతి. దీనివలన లెఖ్ఖల విస్పష్టత గోచరించుచున్నది.

4. స్టాక్ యెక్స్చేంజి హామీలవిలువ, మార్కెటుల విలువకంటె తక్కువగానే మదింపువేయబడినది. ఇపుడు తీసికొన్న విలువనుబట్టి చూడగా, యీ హామీలవలన నూటికి 5 28 వంతున వడ్డీ గిట్టుచున్నది. ఈమాదిరి లాభములు కంపెనీకి సంక్రమించుట గూడ సంతోషావహమైన విషయము. పైమాదిరిగా గవర్నమెంటు హామీలలో గూడ లాభము చేకూరజాలదు.

ఈ సందర్భములన్నియు పర్యాలోచించి చూచినచో, నిర్వహణ చాకచక్యమునకు కంపెనీవారిని ప్రశంసింపక తప్పదు ప్రస్తుతపు పాలిసీదారులు, రాబోవుపాలిసీదారులు, అందరును, ఈకంపెనీ పరిస్థితులకు తృప్తిజెంది గర్వింపవలసిన అవకాశము చాలగలదు." (ప్రొఫెసర్ కే బి. మాధవ, ఎం.ఏ.ఏ.ఐ.ఏ(లండన్) గారు వ్రాసిన జాబు నెం. 3262—24-6-34.)

మిగిలిన వివరములకు:—యం. యస్. ఆర్. ఎ. గుప్త, మేనేజింగు ఏజెంటు.

నొప్పుల నివారించుటలో సాటిలేనిది. బుడ్డి వెల 0-5-0.

## హనుమాన్ పెయిన్ బాం




పలుతావులయందు పలువురిచే వాడబడి తృప్తికరముగా పనిచేసినట్లు ఆరోగ్యతాపత్రములను పడసినది. అన్నివిధములైన నొప్పులకు, కత్తిగాట్లకు జెణుకు నొప్పులకు, వరిబీజములకు, వాపులకు, జలుబులకు, చిగురు ఉబ్బులకు, తిమ్మురులకు నమ్మకమైన మందు. ఎంత తలనొప్పియైన 2, 3 నిమిషములో గారంటీగా పోవును.

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.
ఏజెంట్లు: పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటర్, శ్రీరామకృష్ణ ట్రేడింగుకంపెని, నర్సారావుపేట.
క. నాగభూషణరావుగారు, తాడేపల్లిగూడెం, వెస్టుగోదావరిజిల్లా.

ఏజెంట్లులేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.